www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 254 | సోమవారం | 5 మార్చి, 2018

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ఏదీ తేల్చరు తెగదు జరగదు ఇదేం ఢిల్లీ?

ప్రగతి భవన్ ప్రజా ప్రసంగంలో సిఎం

దేశం దిశ, దశ మారుస్తా



కెసిఆర్ జాతీయ ప్రత్యామ్నాయం ప్రకటనకు అనూహ్య స్పందన

- మద్దతు పలికిన మమత, హేమంత్ సోరెన్, అసదుద్దీన్, పవన్ కల్యాణ్, పలువురు మహారాష్ట్ర ఎంపిలు
- రాష్ట్రం నలుమూలల నుంచి ప్రగతిభవన్‌కు తరలి వచ్చిన ప్రజలు, ప్రముఖులు

మిన్నుముట్టిన దేశ్ కా నేత కెసిఆర్ నినాదాలు

- నాన్ కాంగ్రెస్, నాన్ బిజెపి కూటమి ఏర్పాటు కావాలె
- నిజమైన కో-ఆపరేటివ్ ఫెడరలిజం అవతరించాలె
- తెలంగాణలో మొదలైన ఈ ప్రస్థానం యావత్ భారతాన్ని చుట్టుముడుతది
- ప్రజల అవసరాల కోసం రాజ్యాంగాన్ని మార్చుకోవాలె
- రిజర్వేషన్లపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలె
- మీ ఆశీస్సులు పెట్టని కోటగా ఉంటయి
- అధికారాలన్నీ రాష్ట్రాలకు బదలాయించి కేంద్రం పరిమితంగానే చెలాయించాలి
- నూతన వ్యవస్థ కోసం అందరితో మాట్లాడుతా

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ప్రజల అవసరాలను తీర్చే దిశగా, వారి జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చే తీరులో స్పష్టమైన విధానాలు రాలేదని, రెండు జాతీయ పార్టీలు మారిమారి అధికారంలోకి వచ్చినా ఒరిగిందేమీ లేదని, ప్రస్తుత తరుణంలో బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమని, ప్రబలమైన మార్పు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు పలువైపుల నుంచి మద్దతు లభించింది. వివిధ ప్రాంతీయ పార్టీల నేతలు కెసిఆర్‌కు ఫోన్‌చేసి మద్దతు తెలియజేశారు. రాజకీయ వ్యవస్థలో గుణాత్మక మార్పుకు శ్రీకారం చుట్టే తొలి అడుగు తెలంగాణ నుంచే పడుతోందని, ప్రజల ఆశీర్వాదంతో వంద శాతం విజయం లభిస్తుందని కెసిఆర్ ధీమా వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువు ధరలు పెరుగుతూ ఉంటే దానికనుగుణంగా ఉద్యోగులకు జీతాలు, డి.ఎ. పెంచుతున్న ప్రభుత్వాలు రైతుల పంటలకు మాత్రం కనీస మద్దతు ధరను పెంచడం లేదని, వారిని పట్టించుకున్న పాపాన పోలేదని సిఎం కెసిఆర్ పేర్కొని ప్రబలమైన మార్పు ప్రజల నుంచే ప్రారంభం కావాలని వ్యాఖ్యానించారు.

కెసిఆర్ పూర్తి ప్రసంగ పాఠం 3లో

“కాంగ్రెస్ మీద కోపం వచ్చి బిజెపికి ఓటేసినం. ఏం జరిగింది మాటలు మస్తుగా మాట్లాడుతాం... నాలుగేళ్లలో రియల్‌గా ఏం జరిగింది. రైతులకా..? కార్మికులకా.. విద్యార్థులకా.. నిరుద్యోగులకా... ఎవరికేం జరిగింది? మళ్ల మనం ఇంకా కహానీలు వినాలి. దప్పన వీళ్లమీద కోపం వస్తది. మళ్ల వాళ్లొస్తరు. వాళ్లొచ్చి ఏం చేయాలి. మళ్ల 64 ఏళ్ల కథనే. కొత్తగా ఏమైనా మారుతదా? ఏం మారదు. మన పక్కన ఉన్నటువంటి చైనా దేశంలో చాలా అద్భుతం... మనకన్న అధ్వాన్నమైన దేశం అది. వ్యవసాయ భూమి మనకన్న తక్కువ. ప్లేన్ ఏరియా ఉండదు. కొండలు గుట్టలు ఉంటయి. అటువంటి కాడ 24, 25 ఏండ్లలో ఈ రోజు అమెరికా తర్వాత ఆర్థికంగా అత్యంత బలవంతమైన దేశంగా తయారైంది. ఎట్ల తయారైంది. వాడు ఎక్కడో లేడు ఆకాశంలో. హిమాలయ పర్వతం ఇవతల వైపు మనం, అవతల వైపు వాళ్లు ఉన్నరు... మరి వాళ్లెట్ల చేసిండ్లు? మరి, నేను ఢిల్లీకి పోయినప్పుడు కొంతమందితో మాట్లాడిన. చైనాలో ఇట్ల చేసిండ్లు కదనయ్యా మనమెందుకు చేయకూడదంటే.. వాళ్ల కానూన్ కాగితం వేరే ఉన్నది బాయ్‌సాబ్ అన్నరు. నీ కానూన్ మార్చుకో. నీకు లేదా అధికారం? పేరుకు ఫెడరల్ వ్యవస్థ భారత రాజ్యంగంలో మెన్షన్ చేసి ఉన్నది. ఉందా ఫెడలిజం ఈ దేశంల? మాట్లాడితే డెమోక్రసి అంటరు. నరేగా కూలీలకు కూడా ఢిల్లీలో టప్పలో డబ్బులు వేసేంత గొప్పది ప్రజాస్వామ్యం. ఇది ప్రజాస్వామ్యమా..? ఇక్కడున్న సర్పంచ్ ఎక్కడ పాయే, జిల్లా పరిషత్ ఎక్కడ పాయే? ఎంఎల్ఎ ఎక్కడ పాయే? ఎంపి ఎక్కడ పాయే? ఇక్కడి స్టేట్ గవర్నమెంట్ ఎటు పాయే? ఢిల్లీలో వేస్తర నరేగా కూలీలకు? ఇది ప్రజాస్వామ్యమా?”

కుంచెపోటు



గాలి, నీరు, నేల

సర్వం విష తుల్యం

- హైదరాబాద్ సహా పలు నగరాల్లో, పట్టణాల్లో కాలుష్యం ఏడాది క్రితమే 17% అత్యధికంగా నమోదు
- ప్రైవేటు సంస్థ పరిశోధనలో వెల్లడి
- పర్యావరణవేత్తల ఆందోళన



మన తెలంగాణ / హైదరాబాద్ : కంటికి కనిపించని వాయు కాలుష్యం వేగంగా విస్తరిస్తూ ప్రజలను అనారోగ్యంపాలు చేస్తోంది. హైదరాబాద్‌తో పాటు పలు నగరాలు, పట్టణాల్లో వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని, అతి సూక్ష్మ, ధూళి కణాలు ప్రమాదకర స్థాయిని దాటాయని, దీనివల్ల గాలి నేరుగా ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి ప్రాణాలను హరిస్తోందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణకు సత్వరమే చర్యలు చేపట్టకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. 'ఎయిర్ కొలిప్పి 2'

తరువాయి 6లో

బలి యత్నం భగ్నం

- గుప్త నిధుల కోసం యువకుడిని బలి ఇవ్వబోయిన ముఠా
- పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు
- పెద్దపల్లిజిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం సుంగరికోటలో దారుణం

మన తెలగాణ/ కాల్వశ్రీరాంపూర్ : గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి ఓ యువకుడిని నరబలి చేయడానికి యత్నించిన గుప్త ముఠా చివరికి కటకటాల పాలైన ఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్టపల్లి గ్రామ శివారులోని మానేరు నది ఒడ్డున సుంకరికోటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి.. గుప్త నిధుల ముఠాతో సంబంధం ఉన్న కిష్టంపేట్ గ్రామానికి చెందిన సాగర్ల రవి, శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన గాదర్ల రమేష్‌ను తన పొలం వద్దకు విద్యుత్ మోటారు ఆన్ చేయడానికి వెళ్దామని చెప్పి తీసుకెళ్లాడు. తరువాత ఇక్కడ కాదు, మా బావ (మొట్లపల్లి గ్రామానికి చెందిన పోగుల సారయ్య) పొలం వద్దకు వెళ్లాలని చెప్పి మానేరు ఒడ్డున గల సుంకరికోటకు తీసుకు వెళ్లాడు. అప్పటికే అక్కడ మద్యం బాటిళ్లతో కొంతమంది ఉన్నారు. గాదర్ల రమేష్‌కు ఒక గ్లాసులో మద్యం పోసి ఇచ్చారు. ఆ తరువాత ఇంకొంచం తాగాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో ముఠాలోని ఇద్దరు సభ్యులు గుప్తనిధుల కోసం తవ్విన గొయ్యిలోకి దిగారు. అక్కడ ఉన్న

తరువాయి 6లో



గుప్త నిధులకోసం తవ్విన గొయ్యి

బ్యాలట్ పేపర్ వెనుక స్టాంప్ తప్పనిసరి



మనతెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో బ్యాలట్ పేపర్ వెనుక సంబంధిత పోలింగ్ స్టేషన్ వివరాలు తెలిపే స్టాంప్‌ను వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికల కోసం ఇచ్చే ప్రతి బ్యాలట్ పేపర్‌పై సంబంధిత ఎన్నికల అధికారిచే కేటాయించిన సీరియల్ నెంబర్లతో కూడిన స్టాంప్‌ను వేయాలని పేర్కొనింది. ఓటర్‌కు బ్యాలట్ పత్రాలు ఇవ్వకముందే వాటిపై స్టాంప్ వేసి సిద్ధంగా ఉంచుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. మండలాల పరిధిలో పంచాయతీలకు, పోలింగ్ స్టేషన్లకు సీరియల్ నెంబర్లను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు కేటాయించాలని స్పష్టం చేసింది. మండలాల వారీగా పంచాయతీలు, పోలింగ్ స్టేషన్ల జాబితా ఖరారు కాగానే జిల్లాల ఎన్నికల అధికారులు ఈ సీరియల్ నెంబర్లను కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నిర్దిష్టంగా ఒక పంచాయతీకి ఒక నెంబర్‌ను కేటాయిస్తే దాని పరిధిలోని పోలింగ్ స్టేషన్‌కు కేటాయించిన నెంబర్ ప్రకారం బ్యాలట్ పత్రాల వెనుకు పంచాయతీ నెంబర్/పోలింగ్ స్టేషన్ నెంబర్‌ను స్టాంప్ వేయాలని పేర్కొనింది. ఒకవేళ ఆ పోలింగ్ స్టేషన్‌లోనే మరో పోలింగ్ కేంద్రం ఉంటే 'ఎ', 'బి' అని పేర్కొనాలని స్పష్టం చేసింది.

డిఎస్‌సి సమస్యను పరిష్కరించండి

మన తెలంగాణ/హైదరాబాద్ : బడ్జెట్ సమావేశాల్లో 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ సమస్యను పరిష్కరిస్తే దేశ రాజకీయాల్లో సారథ్యం వహించే బలమైన నాయకునిగా ఎదిగేందుకు శక్తిని ప్రసాదిస్తారని 1998 డిఎస్‌సి సాధన సమితి అధ్యక్షులు కె. శ్రీనివాస్ ఆకాంక్షించారు. కెసిఆర్ ఆరోగ్యం బాగుండాలని, బంగారు తెలంగాణ సాధ్యం కావాలని, రాష్ట్ర ఆర్థిక పురోగతి సాధించాలని ఆకాంక్షిస్తూ డిఎస్‌సి సాధన సమితి ఆధ్వర్యంలో చారిత్రక, ప్రసిద్ధ ఆలయాల్లో అర్చన, పూజలు అభిషేకాలు, హోమాలు నిర్వహించినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెసిఆర్ ఇప్పటికైనా తమ సమస్యనుపరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

బిజెపికి దిలీప్‌కుమార్ రాజీనామా?



మన తెలంగాణ/హైదరాబాద్: బిజెపి నాయకులు, మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్‌కుమార్ బిజెపి పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిసింది. ఈ మేరకు తన రాజీనామా లేఖను పార్టీ కార్యాలయానికి పంపించినట్టు సమాచారం. కాగా కొంత కాలంగా కపిలవాయి దిలీప్‌కుమార్ బిజెపి కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. పైగా ఇటీవల తెలంగాణ జెఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తో కపిలవాయి దిలీప్‌కుమార్ పలుమార్లు చర్చించినట్లు తెలిసింది. త్వరలోనే ఆయన కోదండరామ్ ప్రారంభించనున్న పార్టీలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అమ్మ'ల కోసం రైల్వే వినూత్న నిర్ణయం



న్యూఢిల్లీ: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ రైల్వే ఓ సరికొత్త అడుగు ముందుకు వేసింది. బహిరంగంగా, అందరి మధ్యా బిడ్డకు పాలివ్వడానికి చాలా మంది తల్లులు ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారి కోసం కేరళలోని కొల్లం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక క్యాబిన్‌లను ఏర్పాటు చేసింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లలోనూ ఈ క్యాబిన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతను తెలిపే కథనాన్ని ఓ ప్రతిక ప్రచురించగా, దాన్ని ట్వీట్‌చేస్తూ క్యాబిన్ ఫొటోలను పంచుకుంది. ఈ ప్రాజెక్టు తొలి దశలో భాగంగా ప్రస్తుతం కొల్లం స్టేషన్‌లో రెండు క్యాబిన్లను ఏర్పాటు చేశారు. బిడ్డకు పాలిస్తున్న తల్లి ఫొటోను క్యాబిన్‌పైన ముద్రించడంతో పాటు, దాన్ని పూర్తిగా గులాబి రంగుతో తీర్చిదిద్దారు. అందులో ఒక ఫ్యాన్, లైటు, కూర్చునేందుకు కుర్చీని ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాబిన్ రూపకల్పనకు రూ.50వేలు ఖర్చుపెట్టినట్లు అధికారులు తెలిపారు. తొలుత ఈ క్యాబిన్లను బస్టాప్‌లకు సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినా, అవి దుర్వినియోగం అయ్యే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా మలయాళ మ్యాగజైన్ గృహలక్ష్మి తల్లి పాల విశిష్టతపై కథనాన్ని రాస్తూ ముఖ చిత్రంగా ఓ పెళ్లి కాని మోడల్ బిడ్డకు పాలిస్తూ రొమ్ములపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా ప్రచురించిన ఫొటో వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.

వృద్ధుడి గొంతుకోసిన దుండగులు

శంషాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడలో ఆదివారం వృద్ధుడిపై హత్యాయత్నం జరిగింది. గుర్తుతెలియని దుండగులు వృద్ధుడి గొంతుకోసి పరారయ్యారు. గాయపడిన వృద్ధుడిని 108లో ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉందని పరీక్షించిన వైద్యులు వెల్లడించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షీ -టీమ్స్ 10కె రన్

హైదరాబాద్ : షీటీమ్స్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లో ఆదివారం 10కె రన్ నిర్వహించారు. ఈ రన్‌ను తెలంగాణ డిజిపి ముదిరెడ్డి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు.ఈ రన్‌లో హైదరాబాద్ పోలీసు కమిషనర్ శ్రీనివాసరావు, అదనపు సిపి షీ టీమ్స్ చీఫ్ స్వాతి లక్రా, క్రీడాకారిణి పి.వి. సింధు, నటుడు విజయ్ దేవరకొండ తదితరులు పాల్గొన్నారు. ఈ రన్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొంది. నేర రహిత హైదరాబాద్ కోసం షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈ రన్‌ను నిర్వహించారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల సాధన సాధ్యమని డిజిపి మహేందర్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. మహిళల రక్షణకు షీ టీమ్స్ అంకిత భావంతో పని చేస్తున్నాయని ఆయన చెప్పారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

హైదరాబాద్ :మెకెన్సీ ఫౌండేషన్, సిటీ బ్యాంకు ఆధ్వర్యంలో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో రెండు మాసాల ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్ అర్హత కలిగి 18 నుంచి 28 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు ఈ కోర్సులో శిక్షణ పొందేందుకు అర్హులు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం సదుపాయాలు కల్పిస్తారు. శిక్షణ అనంతరం ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఇస్తారు. విదేశాల్లో పని చేసే అవకాశం కూడా ఉంది. వివరాలకు 9000097781, 8897732197 నంబర్లలో సంప్రదించాలని సంస్థ ప్రతినిధి పివిఆర్ కృష్ణన్ తెలిపారు.

మృతదేహాల కోసం ఎవరూ రావట్లేదు



భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో గ్రేహౌండ్స్ కమాండో సుశీల్‌కుమార్‌తో పాటు పది మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. అదేరోజు సుశీల్‌కుమార్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి పంపించారు. శనివారం మావోయిస్టుల మృతదేహాలకు హైకోర్టు ఆదేశాలతో ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం దడబోయిన స్వామి మృతదేహాన్ని రాత్రి ఆయన బంధువులకు అప్పగించారు. మిగిలిన వారంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారే ఉన్నారు. తొమ్మిది మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని ఫ్రీజర్‌లోనే ఉన్నాయి. ఆదివారం బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు.

పంచాయతీలకు పెరిగిన ఆదాయం

- **పకడ్బందీగా వసూళ్లు**
- **రెండేళ్లలో రూ. 276 కోట్లు పెరుగుదల**



మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల సొంత ఆదాయం క్రమేపీ పెరుగుతోంది. 2015–16 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2017–18లో పంచాయతీల ఆదాయం దాదాపు రూ. 274 కోట్ల మేర పెరిగింది. సొంత ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు పన్నుల వసూళ్లను పకడ్బందీగా చేస్తుండడంతో ఈ పెరుగుదల కనిపిస్తోంది. జనాభాతో పాటు ఆస్తులు పెరగడం, వాటి ద్వారా ఆస్తిపన్ను రాబడిలోనూ పెరుగుదల కనిపిస్తోంది. కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు కూడా పెరుగుతున్నాయ ని, రాష్ట్రం ప్రభుత్వం కూడా ప్రత్యేక నిధులను వి డుదల చేస్తుండడంతో అభివృద్ధిపై ప్రజలు సం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 8684 గ్రామ పంచాయతీల ద్వారా 2015 –16లో సమకూరిన సొంత ఆదాయం రూ. 452.26 కోట్లు కాగా ఆ తర్వాతి సంవత్సరంలో రూ. 601.46 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ. 726.56 కోట్లకు చేరుకుంది. గతేడాదితో పోలిస్తే సుమారు రూ. 125 కోట్లు పెరిగింది. 14వ ఆర్థిక సంఘం నుంచి విడుదలవుతున్న నిధులు కూడా పెరుగుతున్నాయి. 2015–16లో రూ. 574.01 కోట్లు రాగా 2016–17లో రూ. 1,117.60 కోట్ల మేరకు వచ్చాయి. అంటే దాదాపు రెట్టింపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 2,048.48 కోట్ల మేరకు అం దాయి. నేరుగా గ్రామ పంచాయతీల అభివృద్ధికోసం కేటాయించాల్సి ఉన్నందున గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో మెరుగుదల కనిపిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తే కేంద్రం 'పర్ఫార్మెన్స్ గ్రాం ట్స్' పేరుతో అదనపు నిధుల్ని కూడా విడుదల చేస్తుంది. 2015–16లో 'పర్ఫార్మెన్స్ గ్రాంట్స్' కేవలం రూ. 71.51 లక్షలుగా ఉంటే 2016–17లోరూ. 3.10కోట్లకు పెరిగి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లో రూ. 97.49 కోట్లకు చేరుకుంది. 2015 –16 లో రాష్ట్ర ఆర్థిక సం ఘం రూ. 58.17 కోట్లు ఇవ్వగా, 2016–17 లో రూ. 61.61 కోట్లు ఇచ్చింది. రాబోయే బడ్జెట్‌లో 3 వేల కోట్ల రూపాయలను పంచాయతీలకు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.

గ్రామ పంచాయతీలకురూ.2914.70కోట్లు : రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు 2017–18 ఆర్థిక సంవత్సరంలో వాటి సొంత ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే వివిధ గ్రాంట్‌లు కలిపి మొత్తం రూ. 2914.70 కోట్ల మేరకు అందాయి. కొత్త జిల్లాల వారీగా మొత్తం పంచాయతీలకు కేటాయింపులు జరిపారు. ఈ నిధుల్లో ఆయా గ్రామపంచాయతీలు సమర్పించిన గ్రామాభివృద్ధి ప్రణాళికలు, వాటిలో పూర్తి చేసిన పనులను బట్టి కేంద్ర ఆర్థిక సంఘం ఇచ్చిన పర్ఫార్మెన్స్ నిధులు రూ. 97.46 కోట్లు, రాష్ట్ర ఆర్థిక సంఘం ఇచ్చిన రూ. 34.47 కోట్లు, ఆయా గ్రామ పంచాయతీలు సొంతంగా పన్నుల ద్వారా సమకూర్చుకున్న ఆదాయం ... ఇలా అన్నీ కలుపుకుని మొత్తం రూ. 2914.70 కోట్లు అయింది. రాష్ట్రంలోని మొత్తం 8685 గ్రామ పంచాయతీల్లో 8670 గ్రామాభివృద్ధి ప్రణాళికలు సమర్పించగా ఇంకా 15 గ్రామ పంచాయతీలు ప్రణాళికలను అందచేయలేదు.

ఆదాయ సముపార్జనలో మేడ్చల్ ఫస్ట్ : ఈ ఆర్థిక సంవత్సరంలో సొంత ఆదాయాన్ని సమకూర్చుకున్న పంచాయతీల్లో మేడ్చల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల సొంత ఆదాయం రూ.726.56 కోట్లుకాగా మేడ్చల్ జిల్లాలోని మొత్తం 77 గ్రామ పంచాయతీల ఆదాయం రూ. 122.76 కోట్లు. అతి తక్కువ గ్రామపంచాయతీలు ఉన్న జిల్లా అయినప్పటికి స్వంత రాబడిలో మాత్రం అన్నింటి కంటే ముందుంది. అన్నింటికంటే అతి తక్కువ సొంత ఆదాయం సమకూరింది కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనే. ఈ జిల్లాలోని గ్రామ పంచాయతీల ఆదాయం మొత్తం రూ. 7.36 కోట్లు. అన్ని జిల్లాల్లోని పంచాయతీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సొంత ఆదాయాన్ని రూ. 741.30 కోట్లను సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.726.56కోట్లను సమకూర్చుకున్నాయి. ఇంకా ఒక నెల రోజుల వ్యవధిలో మిగిలిన లక్ష్యాన్ని సాధించాల్సి ఉంది.

ఎన్‌కౌంటర్ మృతులపై అస్పష్టత

- **ఎంత మంది అనే విషయంలో డిజిపి కార్యాలయం తికమక**
- **ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులని నిర్ధారించిన ఆఫీస్**
- **ఏడుగురు మహిళలు ముగ్గురు పురుషులని తేల్చిన భద్రాచలం పోలీసులు**

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ– ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల్లో ఎంత మంది మహిళలు..? ఎంత మంది పురుషులు..? అనే విషయమై రాష్ట్ర డిజిపి కార్యాలయం తికమకకు గురైంది. అదే రోజు (ఘటన జరిగి తొమ్మిది గంటల తరువాత) డిజిపి కార్యాలయం నుంచి వెలువడిన పత్రికా ప్రకటనలో మావోయిస్టుల మృతు ల్లో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారని పేర్కొనింది. డిజిపి కార్యాలయం నుంచి వెలువడిన ఈ ప్రకటనపైనే ఆధారపడిన ఆయా మీడియా సంస్థలు కూడా అదే పద్ధతిలో వార్తలు ప్రచురించాయి. అయితే నిజానికి మరణించిన పది మంది మావోయిస్టుల్లో ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. ఈ విషయాన్ని భద్రాచలం ఎఎస్‌పి, భద్రాచలయం స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌లు సంయుక్తంగా ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన ఎన్‌కౌంటర్‌లలో ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్. ఇలాంటి పెద్ద సంఘటనపై డిజిపి కార్యాలయం సరిగా దృష్టి సారించలేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత నాలుగు గంటల్లోనే మీడియాకు ఘటనా స్థలం ఫోటోలు, మృతుల ఫోటోలు సైతం వచ్చాయి. పది మంది మావోయిస్టులు మృతి చెందారని కూడా తేలింది. అయితే ఇందులో ఎంత మంది మహిళలు, ఎంత మంది పురుషులు ఉన్నారనే విషయంపైనే అధికారులు తికమకపడ్డారు. ఘటన జరిగిన తొమ్మిది గంటల తరువాత కూడా మరణించిన వారు మహిళలా లేక పురుషులా అనే విషయాన్ని కూడా పోలీసులు సరిగా నిర్ధారించుకోకపోవడం విడ్డూరంగా ఉంది.

మహిళల అక్రమ రవాణా నివారణకు చర్యలు



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో మహిళల రక్షణపై మరింత దృష్టి సారించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహిళల్లో అవగాహన పెంపొందించడం, వారిని చైతన్యవంతులను చేసి మహిళల అక్రమ రవాణాను శాశ్వతంగా నిరోధించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాచరణను రూపొందించింది. అందులో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం 'స్వరక్ష డే' పేరుతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టనుంది. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. పాఠశాలల్లో, వసతిగృహాల్లో ఉన్న బాలికలందరికి అవగాహన పెంచాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, చిత్రాల ద్వారా అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించినా అనుకున్నంత స్థాయిలో అమలుకాలేదని, అందువల్లనే స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకుని ప్రతి నెలా మూడో శనివారం తప్పనిసరిగా విరివిగా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశాలు జారీచేశారు.ఈ కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 వేల మంది మహిళలు, బాలికలకు మహిళల అక్రమ రవాణాపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

'తెలంగాణ ప్రజల పార్టీ' ఆవిర్భావం



- **అధ్యక్షుడిగా రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్**

మన తెలంగాణ/హైదరాబాద్ : రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ 'తెలంగాణ ప్రజల పార్టీ' (టిపిపి) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. 'ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, అందరికీ ఆత్మగౌరవం, సమన్యాయం, అవినీతి నిర్మూలన, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం' తమ లక్ష్యం అని ఆయన వెల్లడించారు. టిపిపి ఆవిర్భావ సభ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఆకుపచ్చ, తెలుపు, నేవీ బ్లూ రంగులతో పాటు మధ్యలో తెలంగాణ రాష్ట్ర చిత్రంతో కూడిన పార్టీ జెండాను జస్టిస్ చంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీలు, దౌర్జన్యాలు, ఎన్‌కౌంటర్లు, పార్టీ ఫిరాయింపులు, అవినీతికి వ్యతిరేకంగా పేదల అభ్యున్నతి, సామాజిక న్యాయం, కుల రహిత సమాజం కోసం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా టిపిపి పనిచేస్తుందని వివరించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని నియోజవర్గాల్లో పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాల నాయకులు ప్రొఫెసర్ తిరుమలి (తెలంగాణ మేధావుల సంఘం), జి.రమేష్ (తెలంగాణ లేబర్ పార్టీ), జె.బి.రాజు (దళిత హక్కుల ఉద్యమ సమితి), రామ్‌నర్సయ్య (టిపిపి), రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ప్రభాకర్, రేఖ (తెలంగాణ మహిళా హక్కుల వేదిక) ప్రసంగించారు.

టిపిపి కార్యవర్గం : టిపిపి అధ్యక్షులుగా జస్టిస్ బి.చంద్రకుమార్, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ టి.వి.రామనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ డి.సాంబశివగౌడ్, కోశాధికారిగా రఘుతో పాటు మొత్తం 43 మందితో పార్టీ కార్యవర్గాన్ని సమావేశం ఎన్నుకున్నట్లు అనంతరం టిపిపి అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్ ప్రకటించారు.

బిసిలకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలి

డిమాండ్ చేస్తున్న బిసి సంఘాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : శాసనసభ బడ్జెట్ సమావేశాలు సమీపిస్తున్న తరుణంలో బిసిలకు ప్రత్యేక బడ్జెట్‌ను (సబ్‌ప్లాన్) పెట్టాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. గత బడ్జెట్ నుంచి ప్లాన్, సబ్ ప్లాన్ అనే విభాగాలను ఎత్తివేసినా ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చినట్లుగానే బిసిలకు కూడా ఇవ్వాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్ర జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సంక్షేమ బడ్జెట్ అని ప్రభుత్వ వర్గాలు నిర్దిష్టంగా పేర్కొంటున్నా బిసిలకు ప్రాధాన్యత ఇవ్వడంపై మాత్రం అలాంటి స్పష్టత లేదనేది బిసి సంఘాల వాదన. మార్చి నెలలోనే బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నా ఇప్పటివరకూ బిసిలకు ప్రత్యేక బడ్జెట్‌పై కసరత్తు జరగలేదని సమాచారం. ఈ సారి ఎలాగైనా బిసి సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయింపులు జరుపాలని బిసి సంఘాలు ప్రభుత్వంపై వత్తిడి పెంచుతున్నాయి. ఆయా వర్గాలకు బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయకపోవడం, చేసిన కేటాయింపులకు జరిగిన ఖర్చులకు పొంతన లేకపోవడం, కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్ళించిందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈసారి బిసిలకు చేసిన కేటాయింపు నిధులు ఇతర అవసరాలకు మ ళ్లించకుండా పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఒకవేళ నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు కాకపోతే తర్వాతి సంవత్సరానికి కొనసాగించేలా నిబంధనలు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నదని, ఇప్పుడు కూడా దీన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి. పదివేల కోట్ల రూపాయలతో బిసి సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం, ఆర్ కృష్ణయ్య నేతృత్వంలోని జాతీయ బిసి సంక్షేమ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరో వైపు మైనారిటీలు కూడా మైనారిటీల కోసం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. మైనారిటీ సబ్‌ప్లాన్ విషయమై గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఎంఐఎం ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. మరోవైపు ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఎంబీసీ కులాలను గుర్తించక పోవడం, ఎంబీసీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయకపోవడంపై బిసి సంఘాల నేతలు మండిపడుతున్నారు. బిసి ఫెడరేషన్లకు కూడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపుకు నెల రోజులు కూడా లేని ప్రస్తుత పరిస్థితుల్లో బడ్జెట్ నిధులు విడుదల చేయక పోవడం పై నిరసన వ్యక్తం అవుతోంది.

హజ్ యాత్రకు అన్ని ఏర్పాట్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం నుండి హజ్‌కు వెళ్ళే యాత్రీకులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర హజ్ కమిటి సిఇఓ ఎస్‌ఏ షుకూర్ తెలిపారు. హజ్ యాత్రకు ఎంపికైనవారికి ఆదివారం హైదరాబాద్ పాతబస్తీలోని దారుష్షిఫాలో శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హజ్ యాత్రకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. హజ్ కమిటి చైర్మన్ మొహమ్మద్ మసిఉల్లా ఖాన్ మాట్లాడుతూ హజ్ కమిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు యాత్రకు ఎంపికైనవారు విధిగా హాజరు కావాలని సూచించారు. హజ్ యాత్ర ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, యాత్ర సందర్భంగా పాటించాల్సిన పద్దతులను ఈ శిక్షనా తరగతుల్లో మత పెద్ద లు వివరిస్తారన్నారు. ఇలాంటి సమావేశాలకు హాజరుకాకుంటే అనేక విషయాలను తెలుసుకోలేకపోతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మత పెద్దలు పాల్గొని మెలుకువలను వివరించారు. ఈ శిక్షణా తరగతులకు ప్రైవేటు టూర్ ఆపరేటర్ల ద్వారా వెళ్ళనున్న యాత్రికులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక శాసనసభ్యులు , కార్పొరేటర్ హాజరయ్యారు.

హాస్టళ్లకు అనుమతులు తప్పనిసరి

- **రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ పేరుతోనే అనుమతులు**
- **ప్రైవేట్ కళాశాలలపై పట్టు బిగిస్తున్న ఇంటర్ బోర్డ్**



మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు 'రెసిడెన్షియల్' అని బోర్డు తగిలించుకుంటే సరిపోదని, విధిగా ప్రభుత్వం నుంచి హాస్టళ్ళకు కూడా అనుమతులు పొందాల్సిందేనని భావిస్తున్న అధికారులు నిబంధనల అమలును పటిష్టం చేయనున్నారు. బడా కార్పొరేట్ కళాశాలలతోపాటు ప్రైవేట్ యాజమాన్యాలు సైతం గత కొన్నేళ్లుగా ఎలాంటి అనుమతులు పొందకపోయినా 'రెసిడెన్షియల్' పేరుతో కళాశాలలను నడుపుతున్నాయి. ఇప్పటివరకు కేవలం డే స్కాలర్ విధానంలో నడిపే జూనియర్ కళాశాలలకు మాత్రమే ఇంటర్ బోర్డ్ అనుమతులు జారీ చేస్తోంది. వాటిని రెసిడెన్షియల్ కళాశాలలుగా మార్చుకున్న యాజమాన్యాలు కళాశాలలకు అనుబంధంగా హాస్టళ్ళను నడుపుతున్నాయి. ఇటీవల కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు వెలుగుచూసిన నేపథ్యంలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై ఇంటర్ బోర్డ్ పట్టు బిగించింది. కళాశాలలకు అనుబంధంగా నడుస్తున్న హాస్టళ్లకు సైతం తప్పనిసరిగా అనుమతులు పొందాల్సిందేనని నిబంధన విధించింది. రానున్న విద్యాసంవత్సరం నుంచి హాస్టళ్లకు అనుమతులు తీసుకున్న కళాశాలలు మాత్రమే రెసిడెన్షియల్ విధానంలో నడుపుకోవాలని, అనుమతులు లేకుండా హాస్టళ్లు నడిపితే ఆ యాజమాన్యాలపై చర్యలు తప్పవని ఇప్పటికే బోర్డ్ హెచ్చరించింది.

వెబ్‌సైట్‌లో గుర్తింపు పొందిన కళాశాలల జాబితా : జూనియర్ కళాశాలల అనుబంధ గుర్తింపు ప్రక్రియ ముగిసిన వెంటనే అఫిలియేషన్లు పొందిన కళాశాలల జాబితా ఇంటర్ బోర్డ్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. పిల్లలను జూనియర్ కళాశాలల్లో చేర్పించే ముందు ఆ కళాశాలకు అనుమతి ఉందా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు వెబ్‌సైట్‌లో చూసు కోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే రెసిడెన్షియల్ కళాశాలగా అనుమతి ఉంటేనే పిల్లలను హాస్టళ్లలో చేర్పించాలని చెబుతున్నారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాలు వెలువడేలోపే అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తి చేసి, అనుమతులు పొందిన కళాశాలల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచేందుకు ఇంటర్ బోర్డ్ ఏర్పాటు చేస్తోంది.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

హాస్టళ్ల నియంత్రణకు ఇప్పటికే ఉన్న నిబంధనలతో పాటు కొన్ని నిబంధనలు పొందుపరిచి, ఆ నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేయాలని ఇంటర్ బోర్డ్ నిర్ణయించింది. ఇంటర్ బోర్డ్ అధికారులు కార్పొరేట్ కళాశాలల హాస్టళ్లలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో లోపాలను గుర్తించి 146 కళాశాలలకు నోటీసులు జారీ చేశారు. ఇరుకు గదులు, అపరిశుభ్రత, వెలుతురు లేని గదులు, గది విస్తీర్ణానికి మించి విద్యార్థులు ఉండడం వంటి సమస్యలు గుర్తించారు. రెసిడెన్షియల్ కళాశాలలకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి, అధికారులు స్వయంగా హాస్టళ్లలో తనిఖీలు చేసిన తర్వాతనే అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించారు.

మిర్యాలగూడలో నిర్బంధ తనిఖీలు

- **రెండు కార్లు, ఎనిమిది ఆటోలతో పాటు 69 బైకులు స్వాధీనం**

నల్గొండ : మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని రెండు కార్లు, ఎనిమిది ఆటోలు, 69 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 400 లీటర్ల కల్తీ ఆయిల్, 26 గ్యాస్ సిలిండర్లు, వెయ్యి గుట్కా పాకెట్లను సీజ్ చేశారు. ఈ క్రమంలో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

మన్యంలో బంద్

విశాఖ: గిరిజన ప్రాంత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాడేరు ఏజెన్సీలో ఆదివారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. పదకొండ మండలాల్లో ఈ బంద్ సంపూర్ణంగా జరుగుతోంది. జి.మాడుగుల, పెదబయలులో గిరిజన నేతలు బస్సులను అడ్డుకున్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అభద్రతాభావంతోనే 'ఫ్రంట్' రాజకీయం

మన తెలంగాణ/హైదరాబాద్: బిజెపి విజయధాటికి తట్టుకోలేకనే సిఎం కెసిఆర్ అభద్రతాభావంతో టెంట్లు లేనివారితో ఫ్రంట్లు ఏర్పాటు చేయనున్నట్లు బీరాలు పలుకుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు.టిఆర్ఎస్‌లో ఓటమి ఛాయలు కనిపిస్తున్నాయని, తెలంగాణలో కూడా బిజెపి గెలుస్తుందనే భయంతోనే ఆ పార్టీ కంపరంతో ఒణికిపోతుందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఎంఎల్‌సి ఎన్.రాంచంద్రరావు, బిజెపి నేతలు కృష్ణాసాగర్‌లతోకలిసి లక్ష్మణ్ మాట్లాడుతూ అమిత్‌షా లాంటి ఒక్క నేతను చూస్తేనే కెసిఆర్ వణికిపోతున్నారని, భవిష్యత్తులో ముగ్గురు, నలుగురు నేతలు వస్తే మూర్ఛ పోతారని ఎద్దేవా చేశారు. ఇతర ఎంఎల్‌ఎలను కొనడం, పార్టీ ఫిరాయింపులను ప్రొత్సహించడం, అవినీతికి పాల్పడడం, కుటుంబపాలన చేయడమే రాజకీయ గుణాత్మక మార్పా అని ప్రశ్నించారు. ముందుగా కెసిఆర్ గుణంలో మార్పురావాలని ఆ తర్వాత రాజకీయలలో గుణాత్మక మార్పు కోసం ఆలోచించాలని వ్యాఖ్యానించారు. రైతులకు బేడీలు, నేరేళ్ల దళితులపై దాడులు, నిరసనకు హక్కే లేకుండా ఇందిరాపార్కు దగ్గర ఉన్న ధర్నాచౌక్‌ను ఎత్తివేయడమే కెసిఆర్‌కు తెలిసిన రాజకీయ గుణాత్మక మార్పు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజలు 'గడీల పాలన' నుంచి విముక్తి పొందాలని భావిస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌పై కెసిఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

'ఆప్ కే సాత్ రహేంగే' : మమత



మన తెలంగాణ/హైదరాబాద్: దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పు దిశగా సిఎం కెసిఆర్ చేస్తున్న ఆలోచనలకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సంపూర్ణ మద్దతు తెలిపారని, ఆదివారం ఉదయం ఫోన్ చేసి 'హమ్ ఆప్ సే ఏక్ మత్ హై. ఆప్ కే సాత్ రహేంగే' అని వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వ ప్రకటన పేర్కొనింది. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో తప్పనిసరిగా గుణాత్మకమైన, ప్రబలమైన మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని కెసిఆర్ అభిప్రాయంతో ఆమె ఏకీభవించారని పేర్కొనింది. జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరేన్ సైతం ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని, జాతీయ రాజకీయాల్లో కెసిఆర్ క్రియాశీలక పాత్ర పోషించాలన్న కోరికను వ్యక్తం చేశారని పేర్కొనింది. మహారాష్ట్ర నుంచి వివిధ పార్టీలకు చెందిన ఎంపిలు సైతం కెసిఆర్‌కు ఫోన్ చేసి మద్దతు తెలియజేశారని, గుణాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగిన పరిణామమని, తప్పకుండా వెన్నంటి ఉంటామని హామీనిచ్చారని పేర్కొనింది.

కెసిఆర్‌కు సాధ్యమే : అసదుద్దీన్



కాంగ్రెసేతర, బిజెపియేతర పార్టీలతో కూడిన ఫ్రంట్ 2019 ఎన్నికల సందర్భంగా తక్షణావసరం అని ఎంఐఎం అధినేత ఒవైసీ వ్యాఖ్యానించారు. టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఆయనను తాము వ్యతిరేకించినా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన విజయవంతమయ్యారని, దాన్నిబట్టి ఆయన నిబద్ధత, రాజకీయ చతురత కలవాడని తేలిపోయిందని మీడియాతో మాట్లాడుతూ ఒవైసీ వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీలను ఒక్కతాటి పైకి తెచ్చి 2019 ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో కెసిఆర్ క్రియాశీలక పాత్ర పోషిస్తారని తాము బలంగా విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బిజెపిలతో దేశ ప్రజలు దీర్ఘకాలంగా విసిగిపోయి ఉన్నట్లు కెసిఆర్ చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని, ఈ రెండు పార్టీలు ఇక ఎంతమాత్రమూ ప్రజలకు ప్రత్యామ్నాయం కాదనేది రుజువైందని, ఇందుకు గడచిన నాలుగేళ్ళలో కెసిఆర్ తెలంగాణలో అందించిన పాలన నిదర్శనమన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు ముఖ్యమైన, నిర్ణయాత్మకమైన పాత్రను పోషిస్తాయని పేర్కొన్నారు.

ఫ్రంట్ అంకురార్పణకు మద్దతు: పవన్




జాతీయ స్థాయిలో తృతీయ ఫ్రంట్ ఏర్పాటుపై ఎప్పటి నుంచో చర్చ జరుగుతూ ఉందని, కొత్త రక్తం రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని, ఆ తీరులో ఈ ఫ్రంట్ ఉండాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన కార్యాలయంలో ఆదివారం వ్యాఖ్యానించారు. తనది, కెసిఆర్‌ది ఒకటే అభిప్రాయమని, తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన కెసిఆర్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీలను జాతీయ పార్టీలు పట్టించుకోకపోతే ఇలాంటి ఫ్రంట్‌లే పుడతాయని, కెసిఆర్ లాంటి వ్యక్తులు నాయకత్వం ఎంతైనా అవసరమని వ్యాఖ్యానించారు. థర్డ్ ఫ్రంట్‌కు కెసిఆర్ అంకురార్పణ చేస్తే తాను సంపూర్ణంగా మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై స్పందించిన కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు ప్రజలపై ఆయనకు ఉన్న ప్రేమ, అభిమానం ప్రస్ఫుటంగా కనబడుతోందని, తెలుగువారు ఎక్కడున్నా ఒకటే అనడానికి ఈ వ్యాఖ్యలు ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు.


'దేశ్ కా నేతా కెసిఆర్' : అభిమానులు



దేశ రాజకీయాల్లో ప్రస్తుత తరుణంలో ప్రబలమైన మార్పు రావాల్సిన అవసరం ఉందని, ప్రజల జీవితాలను మార్చడంలో గుణాత్మక మార్పు దిశగా ప్రయత్నాలు జరగాలని, అవి తెలంగాణ నుంచే ప్రారంభమవుతాయని కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. నగరం నుంచే కాకుండా కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం, సిద్దిపేట జిల్లా నుంచి వేలాది మంది ప్రజలు, అభిమానులు, టిఆర్ఎస్ శ్రేణులు ప్రగతిభవన్ చేరుకుని పెద్దయెత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మార్పు తీసుకొచ్చినకెసిఆర్ దేశ రాజకీయాల్లో సైతం క్రియాశీలక పాత్ర పోషించాలని, ప్రజలంతా సంతోషంగా జీవించే విధానాలకు కేంద్ర స్థాయిలో శ్రీకారం చుట్టాలని కోరారు. కెసిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడంతో పాటు ప్రగతిభవన్ దగ్గర గంటల వ్యవధిలోనే కటౌట్లు, హోర్డింగులు, ఫ్లెక్సీ బ్యానర్లు కట్టి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. దేశ రాజకీయాలను మలుపుతిప్పే సిసలైన నేత కెసిఆర్ నని, రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశ స్థాయికి ఎదగాలని కోరుకున్నారు.

మతపెద్దల ఆశీర్వాదం





కెసిఆర్‌కు అండగా వివిధ మతాలకు చెందిన పెద్దలు ప్రగతిభవన్‌కు చేరుకుని ఆయనను ఆశీర్వదించారు. వివిధ ఆలయాల పూజారులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, చర్చీల నుంచి ఫాదర్లు, క్రిస్టియన్ మత పెద్దలు, మసీదుల నుంచి ఇమామ్‌లు, మౌల్వీలు, ముస్లిం సంస్థల తరఫున మౌలు, సిక్కు మతగురువులు.. ఇలా వివిద మతాలకు చెందినవారంతా సిఎం కెసిఆర్‌ను కలిసి ఆశీర్వదించారు. తలపెట్టిన కార్యం విజయవంతం కావాలని, భవిష్యత్తులో చూడబోయే గుణాత్మక మార్పుకు తెలంగాణ ప్రజానీకంతో పాటు యావత్తు దేశ ప్రజలు గర్వపడేలా ఫలితాలు రావాలని ఆశీస్సులు అందజేశారు. ఆర్‌టిసి, సింగరేణి, విద్యుత్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో పాటు బంజారా సంఘాల ప్రతినిధులు, బిసి సంఘాల ప్రతినిధులు కూడా కెసిఆర్‌ను కలిసి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, వివిధ శ్రేణుల నాయకులు, ఎమ్ఎల్ఎలు, ఎమ్ఎల్‌సిలు, ఎంపిలు, వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కార్పొరేషన్ల నామినేటెడ్ చైర్మన్లు కెసిఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దేశం దిశ, దశ మారుస్తా

● కేంద్రం పెత్తనాన్ని సహించే ప్రసక్తే లేదు ● రాష్ట్రాలకు అధికారాలివ్వాలి : కెసిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రజల అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని, చట్టాలను మార్చుకోవాలని, ఇందుకు సింగపూర్, చైనా, జర్మనీ లాంటి ఎన్నో దేశాల అనుభవాలను పరిశీలించాలని సిఎం కెసిఆర్ అన్నారు. ఆదివారంనాడు ప్రగతి భవన్‌లో రాష్ట్ర నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రజలను ఉద్దేశించి కెసిఆర్ ప్రసంగించారు. రాష్ట్రాలు వాటి అవసరాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉండాలని, అధికారాలన్నీ కేంద్రం తన దగ్గర పెట్టుకుంటే అది నియంతృత్వమే అవుతుందని అన్నారు. నదీ జలాల వివాదాల పరిష్కారానికి పదేళ్ళు, ఇరవై ఏళ్ళు సమయం పడుతోందని, ఇది ఇలాగే కొనసాగితే ప్రయోజనం లేదని అన్నారు. రిజర్వేషన్ల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వాలు వాటి అవసరాలకు అనుగుణంగా విద్య, ఉద్యోగ రంగాల్లో జనాభాను బట్టి అమలుచేసుకునే స్వేచ్ఛ ఉండాలని, కేంద్ర ప్రభుత్వం దాని పరిధిలో నిర్ణయాధికారం ఉంచుకుంటే సరిపోతుందన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తి అనేది మాటలకే పరిమితమైంది తప్ప ఆచరణలో ఎక్కడా అది అమలుకావడంలేదన్నారు. ముక్కుసూటిగా మాట్లాడితే కొద్దిమంది తనను జైల్లో పెట్టిస్తాం అనే తీరులో బెదిరిస్తున్నారని, ఇలాంటి పిట్ట బెదిరింపులకు భయపడేవాడ్నయితే పద్నాలుగేళ్ళు తెలంగాణ ఉద్యమం ఎట్లా చేయగలిగానని ప్రశ్నించారు. తాను కుంభకోణాలకు పాల్పడితేనో, అక్రమంగా సంపాదిస్తేనో భయపడాలి తప్ప ఇలాంటి పిట్ట బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ ఉద్యమం ఒక్క అడుగుతోనే ప్రారంభమైందని, ఇప్పుడు ఈ దేశానికి దిశా నిర్దేశం చేసే ప్రక్రియ కూడా తనతోనే తెలంగాణ నుంచే ప్రారంభమవుతుందని, ప్రజల ఆశీర్వాదంతో వంద శాతం విజయం సాధిస్తాననే నమ్మకం ఉందని కెసిఆర్ ధీమా వ్యక్తం చేశారు.



కెసిఆర్ వ్యాఖ్యలతో విస్తృతంగా ప్రజలు ప్రగతిభవన్‌కు విచ్చేసి మద్దతు పలికారు. 'దేశ్ కి నేతా కెసిఆర్' అంటూ నినాదాలతో ముంచెత్తారు. కులసంఘాలు, పార్టీ శ్రేణులు, అభిమానులను ఉద్దేశించి ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్ చేసిన పూర్తి ప్రసంగ పాఠం...

'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఫోన్ చేసి 'చంద్రశేఖర్ తమ్ముడూ! నువ్వు కరెక్ట్ నిర్ణయం తీసుకున్నవు. నువ్వు ఏం చెబితే అదే ఫాలో చేద్దాం. ముందుకు పోదాం. త్వరలోనే మనం కలిసి మాట్లాడుదా'మని చెప్పారు. మహారాష్ట్ర నుంచి ఆరుగురు, ఏడుగురు ఎంపిలు వాళ్లు మేము ఫలాన పర్టీలో ఉన్నం అని చెబుతూ మీరు స్టార్ట్ చేసిన రోజే మేము రిజైన్ చేసి జంప్ కొడుతాం సార్ అన్నరు.. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ గారు ఫోన్ చేసి 'కెసిఆర్ సాబ్ ఏక్‌మత్ హై'. ఏకాభిప్రాయంతో ఉన్నం. మేము కూడా చాలా మందితో మాట్లాడుతున్నం. దేశంలో త్వరలోనే మనందరం కలిసి మాట్లాడుదాం అన్నారు...నేను ఏమీ పెద్దగా చెప్పింది లేదు. ఏజెండా చెప్పింది లేదు.. దాన్ని బట్టి మనకు ఏం అర్థమవుతుంది. ఖచ్చితంగా ఈ దేశంలో కాంగ్రెస్ మరియు భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో ప్రభుత్వాలు ప్రజలకు పనిచేయడంలో దారుణంగా విఫలమైనవనే విషయం ప్రజలకు బాగా అర్థమైంది. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఎందుకు జరగాలి. నీళ్లు లేవ్వా..? 70వేల టిఎంసి నీల్లున్నయి దేశంలో. నేపాల్‌కు మనకు మధ్య నది ఉన్నది. దానికి పరిష్కారం లేదు. భూటాన్ నుంచి వచ్చే నది ఉన్నది. దానిమీదా పరిష్కారం లేదు. వాటాలు తేల్చరు. చైనాలో గట్ల ఉందటా... జర్మనీల గిట్ల ఉంటదటా... ఇక జిందగిలో మనం కథలు వినుడేనా... జర్మనీ వాడు బంగారం తింటుండా... అమెరికా వాడు వెండి తింటుండా... మనమేమో మన్ను తింటున్నమా.

కెసిఆర్ జైలుకు భయపడతడా?

రైతులంతా సంక్షోభంలో కూరుకుపోతుంటే 70 సంవత్సరాలు టైంపాస్ చేసి మళ్లీ ఇప్పుడు కూడా మాట్లాడితే నిన్ను జైలుకేస్తాం అంటుండ్రు. జైలుకు భయపడోటోడైతే కెసిఆర్ తెలంగాణ గురించి కొట్లాడుతాడా? కుంభకోణాలు చేసినోళ్లకు మీ పిట్ట బెదిరింపులు. కెసిఆర్ మీద కాదు. దగా చేసినోళ్లకు కుంభకోణాలు చేసినోళ్లకు అక్రమంగా సంపాదనచేసినోళ్లకు, తప్పుడు పద్ధతులు చేసినోళ్లకు భయం ఉంటది. మేము నిటారుగా ఉన్నం. మమ్మల్ని ముట్టు కుంటే భస్మం అవుతారు జాగ్రత్త. అటువంటి స్వార్థానికి మేము పాల్పడలే. ఒక పద్ధతిగా మాట్లాడాలె. ఒక సిస్టం ఉండాలె. ఒక కొశ్చన్ వస్తే ఎందుకొస్తుందో ఆలోచన చేయాలె. దేశంలో ఇవాళ 3లక్షల 20 వేల మెగావాట్ల కరెంటు ఉత్పత్తి అవుతుంది. దేశం వాడుకుంటదా? భారతదేశంలో ఉన్న కరెంటు భారతీయులు వాడరు. 14 గంటలు కరెంటు రాదు. మన పక్క రాష్ట్రంలో చత్తీస్‌ఘడ్‌లో మూత పెట్టుకుని కూసున్నరు. బంద్‌చేసిండ్లు కొనేటోడు దిక్కులేక. ఒక పక్క కరెంటు లేదు. ఒక పక్క బ్యాక్‌డోర్ చేస్తరు. రెండో పక్క దాన్ని నేపాల్‌కు అమ్ముకుంటరు. ఈ దుస్థితా దేశంలో? కేంద్ర ప్రభుత్వ పాత్ర ఏంది? ప్రేక్షక పాత్ర వహిస్తరా? అన్నం పెట్టిన రైతులకు చేసింది ఏమున్నది? రైతు పండించే ధాన్యం ధర మాత్రం పెరగదు. ఎవరు అవునన్నా ఎవరు కాదన్నా భారతదేశం బతికేదే వ్యవసాయం మీద. ఎవరో ఆర్థిక శాస్త్ర వేత్త జిడిపి, పిడిపి అని లెక్కలు చెబుతరు. జిడిపినా తోకమట్టనా? అందువల్లనే నేను అనేదేందంటే,పెద్ద సెక్షన్ జానాభా ఉన్న రైతాంగం. దాన్ని అనుసరించి బతికే రైతు కూలీలు.

ఒక్క అడుగుతోనే ప్రయాణంమొదలైతది : సిద్దిపేట, నల్లగొండ, యాదాద్రి, కరీనంగనర్, రామగుండం, పెద్దపల్లి, ఆదిలాబాద్.. ఇట్ల అన్ని జిల్లాల ప్రజలున్నరు ఇక్కడ. పదిలక్షల కిలోమీటర్ల ప్రయాణమైనా ఒక అడుగుతోనే పడుతుంది. నేను తెలంగాణ కోసం బయల్దేరినప్పుడు కూడా చాలా మంది అనుమానాలు వ్యక్తం చేశారు. మీరు నన్ను పెంచి పోషించి ఈ స్థాయికి తెచ్చిన నా ప్రజలు, నా అన్నదమ్ములు నా తల్లిదండ్రులుకాబట్టి మీ దీవెన ఉంటే వంద శాతం ఈ భారత రాజకీయాలకు అద్భుతమైన దశ దిశ చూపిచ్చి దేశ ప్రజానీకానికి అద్భుతమైన మార్గనిర్దేశం చేస్తా.

చాట్ల తవుడు పోసి కుక్కల కొట్లాట...

ఇది స్థానిక సంస్థలకు, ప్రభుత్వానికి గౌరవించే విధానమా? దవఖానా నడిపియ్యాలె. ఢిల్లీలో కూసున్నోనికి ఏం తెలుస్తదండి? ఏ రాష్ట్రంలో ఏం భీమారి ఉన్నదో? ఆరోగ్య విధానం, విద్యా విధానం, వ్యవసాయ విధానం రాష్ట్రాలకు అప్పగించాలె. అర్బన్ డెవలప్‌మెంట్ రాష్ట్రాలకు అప్పగించాలె. ఎందుకు అప్పగిస్తలేరు? ఢిల్లీలనే పెత్తనం పెట్టుకుని తన శాయి పెట్టుకుని డిక్టేటర్‌షిప్ పెట్టుకుని, చిల్లర మల్లర రాజకీయ లబ్ధికోసం 130 మంది కోట్ల ప్రజల గోస పోసుకుంటున్నాయి. కృష్ణ, గోదావరి నీళ్ల పంచయతీ ఉన్నది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అని ఒకటి వేసిండ్లు. ఇది నీళ్ల లెక్క తేల్చి నీకు గింత,నీకు గింత అని చెప్పడానికి పద్నాలుగేళ్లయింది. 2014లో మనం పోయి దరఖాస్త్ పెట్టినం సెక్షన్ 3 కింద. మా నీళ్ల వాటా ఏందో చెప్పుండి. దాని ప్రకారం కాల్వ తవ్వుకుంటాం అని. ప్రాజెక్ట్ కట్టుకుంటామంటే తేలదు.పద్నాలుగేళ్లా? ఊర్లల్ల చింతకింది పంచాయతీ చెప్పమంటే మూడ్రోజుల్లో చెబుతాడు. పద్నాలుగేండ్లానయ్యా. ఒక మాజీ సుప్రీం కోర్టు జడ్జీ. లెక్కలు లేవా? అధికారులు లేరా? గేజీలు లేవా? మీటర్లు లేవా? దుర్భిణులు లేవా? ఏం లేదు? 14 సంవత్సరాలా..? నది నీళ్ల పంపిణీ చేయడానికి అంటే చాట్ల తవుడు పోసి కుక్కల కోట్లోట పెట్టాలె. కావేరి జలాల పంచాయతీ తమిళనాడు కర్నాటక కొట్టుకుసావాలె. కృష్ణ గోదావరి పంచాయతీ ఆంధ్ర తెలంగాణ కొట్టుకసావాలె. మేము ఢిల్లీ హాయిగా మంచిగుంటం అంటున్రు.

గ్రామీణ పథకాలకు ప్రధానికి ఏం సంబంధం ?

మళ్ల వాళ్లే మాట్లాడుతారు. ఎవరో ఏదో చేయాల్సి ఉండే అని. 64 ఏండ్లు ఉన్నది మీరే. మీరు చేస్తే ఎవరైనా వద్దన్నరా? మీకేమైనా ఎదురుండెనా? మీకెవరైనా సహకరించలేదా? ఈ విధంగా చాలా విషయాలు ఉన్నయ్. ఒక చిన్నమాట నేను నిన్నచెబితే.. ఎజెండా చెప్పలే ఏం చెప్పలే. అనేక విషయాలు నేను చెప్పుకుంటూ పోతే భారతమంత కథ ఉన్నది. ఏం పని నేను కేంద్ర ప్రభుత్వానికి చెప్పేది? దవఖానకాడ ఏం పని? పాఠశాల కాడ ఏం పని? మున్సిపల్ మోరికాడ ఏం పని? ఏమవసరం ఉన్నది వాళ్లకు? వాళ్లు చేయాల్సింది చేయరు. విదేశీ విధానం మీద ఉండాలె. ఆర్మీ మీ కంట్రోల్‌ల ఉండాలె. నేషనల్ హైవే మీ కంట్రోల్‌ల ఉండాలె. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన సే ఆప్ కో క్యా కామ్ హై భాయ్? సిగ్గు పడాలె మనం. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన ప్రధానమంత్రికో క్యా కామ్‌హై? ఇస్ దేశ్ కే చెలానే కె లియె. గ్రామ్ సడక్ బనానె కే లియే...రాజ్యోం కో సర్కార్ నయ్యే. క్యా వో లోగ్ నై బనాసక్తే?ఇది రాజకీయం.ఇట్ల అనేకమైన అనేకమైన విషయాలు. ఎక్కడికక్కడ దేశం అభివృద్ధి చెందాలంటే ఆనాడు ఎస్.కె డేగర్ పంచాయతీ ఉద్యమాన్ని తెచ్చినారు. దాన్ని కుల్లపొడిచి ఇటుమార్చి అటుమార్చి ఆ వ్యవస్థలు పనిచేయకుండా జేసి వాటి స్థాయి దిగజార్చారు.

అధికార వికేంద్రీకరణ జరగాలి : ఈ రోజు అమెరికా ఏ రాష్ట్రానికే ఆ రాష్ట్రంల సుప్రీం కోర్టు ఉంటది. ఏ సిటీ కమిషనర్ ఆ నగర మేయర్ కింద పనిచేస్తడు. ముఖ్యమంత్రికి కూడా సంబంధం ఉండదు. ఎవరి జిడిపి వాళ్లకు ఉంటది. పూర్తి స్వతంత్ర ఉంటది. మన సుప్రీంకోర్టు లాగ కోర్టు ఉండదు. ఫెడరల్ కోర్ట్ అని ఉంటది. రాష్ట్రాల మీద పెత్తనం ఉండదు. ఆ విషయాలకు సంబంధించి మాత్రమే ఆ కోర్టు ఉంటది. కానీ ఈ రోజు రిజర్వేషన్లు ఇవ్వాలి.

చైనా అలా.. మనమిలా..

హండ్రెడ్ పర్సంటె నేనేదో ఆషామాషీగా, తమాషాగా అంటలేను. నాకు వయసు కూడా పెద్దగా లేదు.. నాకు 64 సంవత్సరాల వయస్సు. నేను పనిలేక లేను. ఇక్కడ కావాల్సినంత పని ఉన్నది. నిన్నగాక మొన్న రాష్ట్రం తెచ్చుకున్నం. తిప్పలు పడుతున్నం.. ఒక ఏడాది ఏడాదిన్నరయితే మనకు కూడా ఒక కోటి ఎకరాలకు నీళ్లు వస్తయి. బాధపోతది.. పీడ వదిలిపోతది. అద్భుతంగా ఉంటం.. గొప్పగా ఉంటాం.. రాత్రింబవళ్లు అద్భుతంగా కడుతున్నరు. తెలంగాణ ఇంజనీర్లు... 26వేల మంది వర్కర్లు ఒక్క కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్నారు. చాలా గొప్పగా పనిచేస్తున్నారు.. కాంగ్రెస్ మీద కోపం వచ్చి బిజెపికి ఓటేసినం. ఏం జరిగింది మాటలు మస్తుగా మాట్లాడుతాం... నాలుగేళ్లలో రియల్‌గా ఏం జరిగింది. రైతులకా..? కార్మికులకా.. విద్యార్థులకా.. నిరుద్యోగులకా... ఎవరికేం జరిగింది? మళ్ల మనం ఇంకా కహానీలు వినాలి. వీళ్లమీద కోపం వస్తది. మళ్ల వాళ్లొస్తరు. వాళ్లొచ్చి ఏం చేయాలి. మళ్ల 64 ఏళ్ల కథనే. కొత్తగా ఏమైనా మారుతదా? ఏం మారదు. మన పక్కన ఉన్నటువంటి చైనా దేశంలో చాలా అద్భుతం. 24– 30 ఏండ్లలోనే 1976 వరకు మావో అనేటాయన అధ్యక్షునిగా ఉండె. ఆయన చనిపోయిన తర్వాత డెంగ్జియావో పింగ్ అనే అధ్యక్షుడొచ్చిండు. మనకన్న అధ్వాన్నమైన దేశం అది. వ్యవసాయ భూమి మన కన్న తక్కువ. ప్లేన్ ఏరియా ఉండదు. కొండలు గుట్టలు ఉంటయి. అటువంటి కాడ 24, 25 ఏండ్లలో ఈ రోజు అమెరికా తర్వాత ఆర్థికంగా అత్యంత బలవంతమైన దేశంగా తయారైంది. ఎట్ల తయారైంది. వాడు ఎక్కడో లేడు ఆకాశంలో. హిమాలయ పర్వతం ఇవతల వైపు మనం, అవతల వైపు వాళ్లు ఉన్నరు... మరి వాళ్లెట్ల చేసిండ్లు? మరి, నేను ఢిల్లీకి పోయినప్పుడు కొంతమందితో మాట్లాడిన. చైనాలో ఇట్ల చేసిండ్లు కదనయ్యా మనమెందుకు చేయకూడదంటే ... వాళ్ల కానూన్ కాగితం వేరే ఉన్నది బాయ్‌సాబ్ అన్నరు. నీ కానూన్ మార్చుకో. నీకు లేదా అధికారం? వాడు ఎట్ల పైకొచ్చిండో గంత మందం అక్కల్ లేదా మనకు?

ప్రజల అవసరాలను బట్టి రాజ్యాంగం మారాలి

రాజ్యాంగం మార్చుకో. ఎవని కోసం ఈ రాజ్యంగం? ప్రధానమంత్రో, ముఖ్యమంత్రో, పార్టో, మన్నో ఏదైనా ఉంటే ఎవరికోసమండి? ప్రజల కోసమే కదా! దేశంలో ఏది ఉన్న కూడా ఎవరి కోసం ఉంటది? రాజ్యాంగం గాని, ప్రభుత్వాలు కాని, ప్రజల కోసం తప్ప ఇంక దేని కోసం ఉంటది? ప్రజాస్వామ్యం కాబట్టి అవి మార్చరు. చైనా మంచిగా ఇంకా ఇంగ్లీష్‌లో చెబుతరు. ఇంకా చైనా కాన్సుట్యూషన్, సెటప్ డిఫరెంట్. యు బికమ్ ఏ డిఫరెంట్. వై డోంట్ బికమ్ ఏ డిఫరెంట్? వై డోంట్ యు ఛేంజ్? ఎన్ని రోజులు వినాలె ప్రజలు ఈ కథలు? సింగపూర్‌లో ఏమున్నదండి? మన్ను కూడా లేదు. వాళ్లు తాగే నీళ్లు కూడా వానివి కావు. మలేషియా నుంచి నీల్లు కొంటడు. వానిమందం వాడుకుంటడు. మల్ల అదే నీళ్ళను ట్రీట్ చేసి మలేషియాకు అమ్ముకుంటడు. ఒక ఇత్తు ధాన్యం గింజ ఉండదు ఆ దేశంలో. ఇయాల సింగపూర్ డాలర్ విలువ ఎంత, మన ఇండియా డాలర్ రూపాయి విలువ ఎంత? ఇంత నామోషా? ఈ దేశానికి అడిగేటోడు లేడా? వీళ్లు పోతే వాళ్లు, వాళ్లు పోతే వీళ్లు. ఇగ చూడాలె తమాషా. వీన్ని తిట్టగానే మీ జమానాల విజయ్ మాల్యా ఎల్లిపోయిండయ్యా లండన్‌కు. నీ జమాజానలో నీరవ్ మోడి పోయిండయ్యా. ఇదేనా? దేశానికి గిది కావాలా? దేశానికి ఏం కావాలి? ఇంకోమాట మనవి చేస్తున్న నేను దయచేసి. పేరుకు ఫెడరల్ వ్యవస్థ భారత రాజ్యంగంలో మెన్షన్ చేసి ఉన్నది. ఉందా ఫెడలిజం ఈ దేశంల? మాట్లాడితే డెమోక్రసి అంటరు. నరేగా కూలీలకు కూడా ఢిల్లీలో టప్పలో డబ్బులు వేసేంత గొప్పది ప్రజాస్వామ్యం. ఇది ప్రజాస్వామ్యమా..? ఇక్కడున్న సర్పంచ్ ఎక్కడ పాయే జిల్లా పరిషత్ ఎక్కడ పాయే? ఎంఎల్‌ఏ ఎక్కడ పాయే? ఎంపి ఎక్కడ పాయే? ఇక్కడి స్టేట్ గవర్నమెంట్ ఎటు పాయే? ఢిల్లీలో వేస్తర నరేగా కూలీలకు? ఇది ప్రజాస్వామ్యమా?

రెండు పార్టీలు మారినా ప్రజల బతుకులు మారలేదు

నేను ఢిల్లీకి పోయిన తర్వాత 2004 నుంచి అనేక మందితో మాట్లాడిన. అనేక అనుమానాలు పంచుకున్నం. 12 పంచవర్ష ప్రణాళికలు అమలయితే వాటన్నింటినీ నేను చదివిన. ఏ ఐదేండ్లలో ఈ దేశానికి ఏం జరిగింది? ఎట్ల ముందుకు పోయింది? ఏ రంగంలో ఏమైంది? అవన్నీ అవగాహన చేసుకున్న. చూసినం ఆశపడ్డం. వాస్తవంగా చెప్పాలంటే నేను డిగ్రీ చదువుకునే రోజుల్లో ధర్మారెడ్డి అనే పొలిటికల్ సైన్స్ లెక్చరర్ ఉండేవారు. ఆరోజు నేను ఇందిరాగాంధీకి పెద్ద అభిమానిగా ఉంటి. భూసంస్కరణ చట్టంతెచ్చి పేదలకు గుడిసెలు వేయించి కొన్ని ప్రోగ్రాములు తెస్తే గొప్పనాయకురాలని నేను పొంగేవాణ్ని. స్నేహితులతో పంచుకునేవాళ్లం. కానీ పెద్దగా జరగలే. ఏదో కొంత అట్ల జరిగింది తప్ప గొప్పగా జరగలేదు. దాని తర్వాత రాజీవ్‌గాంధీ వచ్చారు. మోతాదు లేకుండా గెలిచారు. అంతకు ముందు ఆయన రాజకీయాల్లో లేడు. నేను బాగా ఆశపడ్డ. రాజకీయాలను విశ్లేషణ చేసే వ్యక్తిగా చాల ఆశపడ్డా. తల్లి సచ్చిపోయిన సానుభూతిలో చాలా పెద్ద సంఖ్యలో మోతాదు లేకుండా గెలిచినాడు. ఏమైనా చేస్తడురా అనుకున్న. కానీ జరగలె. మన ఖర్మ. కాంగ్రెస్ ప్రభుత్వాలు అట్లనే వచ్చినయ్ పోయినయ్. ఏమీ చేయలేదు.




మాటలే తప్ప చేతల్లేని మోడీ ప్రభుత్వం

మోడి గారు వస్తే వారితో నేను చాలా సేపు మాట్లాడిన. ప్రజలకు చేసే అవసరమున్నదని చెప్పిన. దళితుల గురించి చేయండి, గిరిజనుల గురించి చేయండి. దయచేసి రైతుల గురించి చేయండి అని చెప్పిన. చంద్రశేఖర్‌జీ ఆప్ బోలేతే ఫసల్ బీమా యోజన హమ్ నే లాయా హై. ధన్యవాద్ అని చెప్పినా నేను. పంటల బీమా పథకం కూడా బాగాలేదు. మండల యూనిట్ అంటరు. గ్రామ యూనిట్ అంటరు. ప్రీమియం తీసుకున్నప్పుడు ఎవని పంట ఖరాబ్ అయితే వానికి రావాలె కదా. ఎవరికైనా వచ్చిందా? దేశమంతా ఇదే కథ. ఈ దేశంలో ప్రబలమైన మార్పు రావాలె. కచ్చితంగా తెలంగాణలో మొదలైతది. వంద శాతం మనం విజయం సాధిస్తాం. మీ అశీర్వాదంతో నేను ముందుకే ప్రయాణం చేస్తను. ఇప్పటికైనా రెండు జాతీయ పార్టీలు వాళ్ల పద్ధతి, పంథా మార్చుకోవాలి. ఆలోచనాసరళి మార్చుకోవాలి. పారిశ్రామిక రంగాలకు రాయితీలు ఇస్తారు. ఒక వ్యవసాయదారునికి నామోషీ అయిందా? నేను ఢిల్లీకి పోతే నన్ను రాజ్‌నాథ్‌సింగ్ అడిగిండు. 'ఆప్ కో బధాయ్' అన్నడు. 'రైతులు ఎన్ని కిస్తీలలో వాపస్ కట్టాలి మీకు?' అని అడిగిండు. 'కిస్తు లేదు. పిస్తు లేదు. ఇచ్చేది లేదు. మేమే ఇస్తున్నం' అని చెప్పిన. దాంతోని ఆయన కుర్చీ మీద నుంచి పడ్డంత పని చేసిండు. రైతుల గురించి ఈ విధంగా ఆలోచించే పరిస్థితి ఎక్కడ కూడా ఏ కోశానా లేదు. ఆ పరిస్థితి రావాలె. దేశంలో కాంపెన్సేషన్ రావాలె. దేశమంతా ఆలోచించే పరిస్థితి రావాలె. అనేక పథకాలు, అనేక విషయాలలో మన తల రాతలు మారయి. మన దళితులు నిరంతరం జీవితాంతం కొట్లాడుతునే ఉండాలా? ఇదే పద్ధతి ఉండాలా? ఇంకెన్ని రోజులు వారు పేదరికంలో మగ్గాలె? ఎన్ని రోజులు గిరిజనులు మగ్గాలె? బిసిలలో ఉండే సంచార జాతులు, మోస్ట్ బ్యాక్‌వార్డ్ క్లాసులు ఎన్ని రోజులు ఈ గతిలో ఉండాలె? ఇంకెన్ని రోజులు ఈ దురవస్థ ఎదుర్కొవాలె? ఇది పోవాలంటే ఈ రెండు పార్టీలతో కాదు. అందుకే కచ్చితంగా నాన్ కాంగ్రెస్, నాన్ బిజెపి కూటమి ఏర్పాటు కావాలె. ఒక శక్తి తయార్ కావాలె. కచ్చితంగా ఈ దేశానికి నిజాయితీగా, నిజమైన ట్రూత్‌ఫుల్ కో ఆపరేటివ్ ఫెడరలిజం తెచ్చి అధికారాలన్నీ రాష్ట్రానికే ట్రాన్స్‌ఫర్ చేసి కేవలం లిమిడెడ్ అధికారాలు మాత్రమే కేంద్రంలో పెట్టే వ్యవస్థ వస్తేనే ఈ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి వాళ్ల అవసరాన్ని బట్టి నిర్ణయాన్ని తీసుకునే అవకాశం ఉంటేనే ఈ దేశం బాగుపడుతుంది. అన్నీ మంచిగా చిలుకలు పలికినట్టు తియ్యగా, పుల్లగా పలుకుతాం, చక్కిలిగింతలు పెడుతాం, ఢిల్లీ నుంచి మా అధికారాలు మాత్రం ఇవ్వం అంటే ఈ దేశం బాగుపడదు. అందుకోసమే తెలంగాణలో ప్రారంభమైన ఈ ప్రస్థానం కచ్చితంగా యావత్ భారతదేశాన్ని చుట్టుముడుతది. నేను అందరితో మాట్లాడుతా. దానికి ప్రారంభంగా ఈ రోజు నేను ఒక మాట చెప్పినంత మాత్రాన్నే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చినటువంటి అభిమానులు, సోదరులు, మా అక్క జెల్లెండ్లు వచ్చిండ్రు. మీ ఆశీస్సులు పెట్టని కోటగా ఉంటయి. మీ ఆశీస్సులతో కెసిఆర్ వంద శాతం విజయం సాధిస్తారనే నమ్మకం నాకున్నది. ఆ రకంగా ముందుకు సాగుదామని తెలియజేస్తూ మీ అందరికీ కూడా పేరు పేరునా దన్యవాదాలు తెలియజేస్తూ నేను సెలవు తీసుకుంటున్న.

జై తెలంగాణ....జై భారత్....

పోతనపై మరో చూపు


డా॥ టి.శ్రీరంగస్వామి
9949857955


పోతన అనగానే మనకు ఒక హాలికుడైన కవి మనఃఫలకములో మెదలుతాడు. ఆయన బమ్మెర వాస్తవ్యుడు. పోతన జన్మతః శైవుడు. సదా శివ ధ్యాన తత్పరముతుడు. పోతన వీరభద్ర విజయము, భోగినీ దండకము, నారాయణ శతకము, భాగవతములను వెలువరించాడు. భాగవతము ఒక్కటే పోతన రచించాడని, ఇతర రచనలు పోతనవి కావని కొందరి వాదన. పోతన కుటుంబము శైవ సంప్రదాయమును పాటించినట్లుగా భాగవతములో 1–24, 26,2 పద్యాల ద్వారా తెలుస్తుంది. ''కౌండిన్య సగోత్రుడనని... శైవ శాస్త్ర మతముగనియె'' అని ''సదా శివ పాదయుగార్చనాను కంపానయ వాగ్భవాణికిని'' (26) అని చెప్పుకున్నాడు. శివ తత్పరుడు కావడం వల్లనే తొలి నాళ్లల్లో వీరభద్ర విజయం కావ్యాన్ని రచించినట్టుగా భావించవచ్చు. ఈ కావ్యము నాలుగు ఆశ్వాసముల గ్రంథం. ఇది వీర శైవ మతానికి సంబంధించింది. పోతన జన్మస్థలమైన బమ్మెర పాలకుర్తి పక్కన ఉండడం కూడా ఒక కారణం కావచ్చు. అప్పటికే పాల్కురికి సోమనాథుడు వీర శైవ మత వ్యాప్తికి పూనుకొని పండితారాధ్య చరిత్ర, బసవ పురాణం లాంటి అనేక కావ్యాలు అందించడం, ఇంట్లోని వాతావరణం అంతా శైవ సదాచార నిష్టా గరిష్టులు కావడం వలన తొలి కావ్యంగా శ్రీ వీరభద్ర విజయం అందించినాడని అనుకోవడంలో ఏమాత్రం సందేహం లేదు. పోతన నాటికే పాల్కురికి సోమనాథుడు దేవుడై పూజింపబడుతున్నాడు. సోమన్నను పోతన కొలిచినట్లు తెలిపే –

''పాలకుర్తి సోమలింగ నీ పాదములకు శరణు/ ఉడువుగ బమ్మెర పోతరాజునకు నీవు /కోరిన వరములు కృప చేసివావట...' అనే కీర్తనను ఇప్పటికీ పాలకుర్తి ఉత్సవాలలో గానం చేయడం గమనిస్తాం. వీరభద్ర విజయంలోని ఈ క్రింది పద్యం పోతన శివ తత్పరతను తెలియబరుస్తుంది.

''నిఖిల తంత్రములకు నీలకంఠుడు వేల్పు /భువినగ్రదైవంబు పూజసేయు / భాగ్యంబు కొరతయే భావించుచూడుడు/ కర్మ మానసులార కష్టులార'' ''పరమేశ తత్వంబు పరికింప దేమిటి/ కీశాను నిజతత్వమెరుగదేల / పరమోపదేశంబు పరమంబు పరమాత్మ/ శివుడౌట ఎరుగరే సృష్టిననుచు'' ఈ కావ్యం తదుపరి భోగినీ దండకాన్ని అందించాడు. దండక సాహిత్యములో ఇదొక విశిష్ట దండకంగా నమోదు చేసుకుంది. భోగినీ దండకము 70వ దశాబ్దిలో యువ భారతి వారు 'భోగినీ లాస్యము' పేరుతో ప్రచురించారు. ఆ దండకం చివర – ''పండిత కీర్తనీయుడగు బమ్మెర పోతన యాసుధాంశు మా / ర్తాండ కులాచలంబు నిధి తారకమై విలసిల్లు భోగినీ / దండకమున్ రచించె బహుదాన వివర్తకు రావు సింగ భూ / మండల భర్తకున్ మానవ నాథ మరూపహర్తకున్'' అను పద్యంవలన ఇది పోతన రచనయే అని తెలుస్తున్నది. భాగవతమును దైవమునకు అంకితం చేసిన వాడు . ఒక వేశ్య యొక్క ప్రేమ కలాపములకు దండకముగా చెప్పి ఉండడని కొందరి వాదన. కానీ వయస్సులో ఉన్నప్పుడు పోతన రాజులను ఆశ్రయించి భోగినీ శృంగారమును వర్ణించినాడని అనుకోవచ్చు. పైగా ఇది భాగవతము రచన కంటే ముందుది. వయస్సుపెరిగిన కొద్దీ అతని మనస్సు చతుర్థ పురుషార్థం వైపు మరలి భాగవతమును రచించాడని భావించవచ్చు కదా! భోగినీ దండకములోని శైలి, భావములు, అనుప్రాసలు భాగవత రచనా శైలికి దగ్గరగా ఉండడం వలన ఇది పోతన కృతి అనుకోవడమే సబబు. భాగవతం దృష్టితో భోగినీ దండకమును పోతన రచన కాదనడం కేవలం హ్రస్వ దృష్టి అవుతుంది. పోతన మూడవ కృతి ''నారాయణ శతకం'' ఇందులోని ఈ పద్యాన్ని చూద్దాం –

''అపరాధమ్ములు నిన్ను నమ్మి వినుమే నాజన్మపర్యంతమున్ / విపరీతమ్ముగ జేసినాడ నిక నీదే దిక్కు నాలోనికిన్ / గపటం బింతయు లేక దండధరునున్ గట్టీకరక్షింపుమో / కృపకున్ బాతృడనయ్య ధర్మపురి లక్ష్మీనాథ నారాయణా!'' (98)

మన సాహిత్యవేత్తలందరూ పోతన భాగవతానురక్తులై ఆ ప్రభావంతో పోతన కృతులను అంచనా వేసినారు. ఇది సరికాదు. భాగవతం పోతన చివరి రచన. అంతకు ముందు వచ్చిన వాటిలో భాగవత పరంపరలు ఎలా ఉంటాయనేది ఎవరూ ఆలోచించలేదనిపిస్తుంది. అనూచానంగా వస్తున్న శైవ తత్పరతతో 'వీర భద్ర విజయం', యుక్త వయస్సులో ప్రాపంచిక నేపథ్యంతో 'భోగినీ దండకము' ను, భాగవతాన్ని రచించుటకు ముందు పోతనలో వస్తున్న రచనా దృక్పథంలోని మార్పు భాగంగా 'నారాయణ శతకం' ను రచించాడని చెప్పవచ్చు. నారాయణ శతకంలోని పై పద్యము నందలి ధర్మపురి కరీంనగర్ జిల్లాలోని చారిత్రక ప్రసిద్ధమైన ధర్మపురి క్షేత్రమే అయినచో అచ్చట లక్ష్మి నరసింహ స్వామి దేవా



లయం ఉన్నది, కానీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం లేదు. నారాయణ శతకకారుడు నరసింహ స్వామినే నారాయణుడుగా స్తుతించినాడని అనుకోవచ్చుకదా! లేక పోతన ధర్మపురిలోని గోదావరి ఇసుక తిన్నెల మీదనే తపస్సు చేసుకొని భాగవత రచనాద్యుక్తుడు అయినాడని చరిత్ర చెబుతున్నది. ధర్మపురిలో పోతనకు రామభద్రుడు దర్శనం ఇచ్చినప్పుడు లక్ష్మీనారాయణుడు మనఃఫలకం మీద ఎందుకు నిల్వకూడదు. అందులో భాగవతం తొలి పద్యమే 'శ్రీ కైవల్య పథం' అని ప్రారంభించినాడు. అందువలన భాగవతము 'శ్రీ'తో కేవలత్వాన్ని పొందిన స్థానం. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో నారాయణుడే– శ్రీమన్నారాయణుడే శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ఉపాస్యుడు, ఆరాధ్యుడు, కీర్తనీయుడు. 'శ్రీ' – లక్ష్మీ దేవి నారాయణునికే సేవారూపిణి. శేషశాయి అయిన నారాయణుని పాదసేవలో శ్రీదేవి ఉన్నట్టు చూస్తుంటాం. అందువలన భగవత్ పారతంత్ర్యం, సేవా స్వరూపిణి అయిన 'శ్రీ' తో కేవలత్వం ఏకీభావం పొందిన పదం అని అనుకోవచ్చు. అందుచే నారాయణ శతకంలో 'లక్ష్మీ నారాయణా!' అనుసంబోధించినాడని అనుకోవచ్చు.

భాగవతములో పోతన ఒక చిన్న పద్యాన్ని చెప్పాడు. ఆ పద్యము తెలుగు నేలలో పామరులకు కూడా నోటి యందు నాన్చబడుతున్నది. ''చేతులారంగ శివుని పూజింపడేని/ నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని/ దయయు సత్యంబు లోనుగా దలపడేని / గలుగ నేటికి తల్లుల కడుపు చేటు'' ఈ ప్రపంచంలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ చేతులారా శివుని పూజించి, నోరారా కేశవుడిని కీర్తించి, దయ సత్యము మొదలయిన గుణాలను అలవర్చుకోవాలి. ఇలా చేయని వాడు తల్లి కడుపున పుట్టడం ఎందుకు? వారి పేరును చెడగొట్టినవాడవుతాడని అంటాడు.

మహాభాగవతం (తను) పోతన రాయలేదని కేవలం ఆ రామభద్రుడే తన నాలుక ద్వారా పలికించాడని అందువల్లనే రాశాను తప్పా తనకేమీ తెలియదని వినమ్రతగా చెప్పుకోవడంలో ఆయన నిశ్చల భక్తికి నిదర్శనంగా నిలుస్తుంది.


''పలికెడిది భాగవతమట/ పలికించెడివాడు రామభద్రుండట, నే / పలికిన భవహర మగునట/ పలికిన వేరొండు గాథ పలుకగ నేలా!'', ''భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు / శూలికైన దమ్మిచూలికైన/ విబుధ జనుల వలన విన్నంత కన్నంత / దెలియ వచ్చినంత దేటపరుతు!'' (1–18, 19) భాగవతమును శివుడుకాని, పద్మనాభుడైనా సమగ్రంగా తెలుసుకొని చెప్పలేదు. మరి నా సంగతి ఇక మీకు చెప్పాలా! అయితే నేను పెద్దల ద్వారా విన్నది, వారి దగ్గర నేర్చుకున్నది, నేను తెలుసుకున్నది మీకు తేటతెల్లముగా తెలియజేస్తాను అని తను వినయంగా చెప్పుకున్నాడు. అందువలననే ఇప్పటికీ చాలా మంది నేను రాశాను... రాశాను అంటారు తప్ప ఆ చదువుల తల్లికాని, గురువులు చెప్పిందికాని, పూర్వ జన్మ సంస్కృతిని కూడా మరచిపోయి చెప్పుకుంటుంటారు.

పోతన భగవద్భక్తులకు సంబంధించిన ఒక కావ్యమును రచించాలనే కోరికతో పెద్దల అనుమతిని తీసుకొని తన ఇష్టదైవము అయిన మహేశ్వరుడిని ప్రార్థించుటకు నిశ్చయించుకొన్నాడు. నేను ఎన్నో జన్మలెత్తి ఉంటాను. వేల కొలది జన్మలలో కూడ బెట్టుకొనిన నా తపస్సు పండింది. నా హృదయంలో శ్రీమన్నారాయణుడి పుణ్య కథలను విస్తరించి రచించాలనే కోరిక మిక్కుటముగా బలపడింది. ఒక పున్నమి రాత్రి, నిండు జాబిల్లి వెన్నెలలు కురుస్తున్నాడు. ఆనాడు చంద్ర గ్రహణం. పెద్దల అనుజ్ఞ తీసుకున్నాడు. గోదావరిలో స్నానము చేశాడు. (1–18) అప్పుడు పోతన దర్శనం పొందాడు. పోతన దర్శించిన తీరు ఇలా ఉంది. చంద్రశేఖరుడను కున్నాడు. కాని ప్రత్యక్షమైన వాడు నేను రామ భద్రుడనని చెప్పినాడు. శివకేశవ భేదము లేదని తాను గ్రహించినట్లు చెప్పుకున్నాడు. పోతన మాటలలోనే ... ''మెఱుగు చెంగటనున్న మేఘంబు కైవడి నువిద చెంగట నుండ నొప్పువాడు ... నా కన్నుగవకు నెదుర గానబడియే'' (1–16) ఆ సమయంలో ఒక రాజ శ్రేష్టుడు నా కన్నుల ముందు సాక్షాత్కరించినాడు. మేఘం ప్రక్కన మెరుపులాగ ఆయన చెంగట ఒక అంగన ఉన్నది. చంద్ర మండలం లోనుంచి అమృతంలాగా ఆయన ముఖంలో మందహాసం నిండుతోంది. తమాల వృక్షాన్ని చుట్టుకున్న తీగలాగ ఆయన భుజాగ్రాన ధనుస్సు వ్రేలాడుతున్నది. నీలగిరి శిఖరాన ప్రకాశించే భానుబింబం లాగా ఆయన శిరస్సుపై కిరీటం విరాజిల్లుతున్నది. ఈ విధంగా విచ్చిన తెల్ల తామర రేకుల వంటి కనులతో, విశాలమైన వక్షస్థలంతో, విశ్వమంగళ స్వరూపంతో ఆ రాజశేఖరుడు నా కందోయికి విందు చేశాడు. అంతేకాదు, నేను రామభద్రుడను, నా పేరు మీదుగా శ్రీ మహాభాగవతాన్ని తెలుగు చేయి. ఈ భాగవతమునకు అంకితమివ్వమని, నీ భవబంధాలు పటాపంచలవుతాయి.'' అని చెప్పాడని భాగవతంలో చెప్పుకున్నాడు. ఇక్కడ ఒక వంక శివ చిత్ర రూపాన్ని పరోక్షంగా రామభద్రున్ని దర్శింప చేయడంలో శివ కేశవాన్ని పాటించాడు.

పోతన భాగవతాన్ని ప్రారంభించినప్పుడు అలా చేయలేదు. ముందుగా రామభద్రున్ని స్తుతించలేదు. తన ఇష్టదైవాన్ని స్మరించుకొని పిదప తదితరుల స్మరించడం సంప్రదాయం. ఇది భారతాంధ్రీకరణ నుండి కొనసాగుతూ వస్తున్నదే. కాని పోతన అలా చేయక శ్రీరామ చంద్రున్ని ముందుగా స్మరించక శ్రీకృష్ణున్నే స్మరించాడు. 'శ్రీకైవల్య పదంబు జేరుటకు నై చింతించెదన్...' అని ప్రారంభించాడు. అట్ల శ్రీకృష్ణున్నే స్మరించాడు. ఏమైందిలే అని సరిపెట్టుకుందామంటే షష్ట్యంతంలో 'హారికి నందగోకుల విహారికి...' అనియు (1–29). 'గోపికా నివహ మందిర యాయికి, శేషసాయికిన్' (1–32), 'సమర్పితంబుగా నేనాంధ్రంబున రచియింపబూనిన శ్రీ మహాభాగవత పురాణంబునకు' (1–33) అని శ్రీకృష్ణునికే భాగవతమును అంకితం చేసినాడు. రామునకు కాదు. పోతన శివ కేశవులందువలె రామకృష్ణులందున కూడా ఏమాత్రము భేదము లేదు. కృష్ణ పథమును వాడి రామ పదమును వాడలేదనుకోవద్దు.– 'పలికెడిది భాగవతమట/ పలికించెడి వాడు రామభద్రుండట' అని చెప్పుకున్నాడు. రాముడన్ననూ, కృష్ణుడన్ననూ మహా విష్ణువనియే పోతన భావం. ఇంకొక రహస్యం. రామాయణం శ్రీరాముడ్ని చెప్పినట్లు భాగవతము శ్రీకృష్ణున్ని చెప్పుతున్నది. కాబట్టి భాగవతములో మొదట పోతన కృష్ణ పదమును సాభిప్రాయంగానే చెప్పి ఉంటాడు.

పోతన గురించి చెప్పుకుంటున్న క్రమములో ఈ నాలుగు మాటలు. పోతన అంటే భాగవతమే. ఇక్కడ పోతన గురించి అనుకోవడం భాగవతం గురించి మాత్రమే 'కృష్ణం వందే జగద్గురుమ్''●

సంచారి



జీవితం చిత్ర విచిత్రమైంది,
ఎన్ని అనుభూతులు
ఎన్ని ఆశలు,ఆశయాల సమాహారం

వసపిట్టయై కూసినట్టు
వెన్నెల పూలు పూసినట్టు
వసంతంలో మావిచిగురు తొడిగినట్టు

కలలు సజీవమై
చిత్రకారుడి కుంచెనుంచి
చిత్రాలు ద్రుశ్యాలై పురుడు పోసుకున్నట్టు
ఎన్ని కలలు భుజానికి తగిలించుకున్న
జోలెలో నింపుకుని రాలిన ఆకులై
యాదులు మతిన దొర్లుతుంటె
ఒక్కొక్కటిగ ...
నడక సాగుతున్న సంచారి

అంతరంగపు ఆశలు చిగురిస్తుంటే
ఎదురుచూసిన రుతువు పలకరిస్తుంటే
పలవరిస్తూ గుసగుస లాడుతూ
పలకరిస్తుంటే,తీపి చేదు కబుర్లు చెబుతుంటే

అతని ముందు మోకరిల్లిన యాదులు
తెరలు తెరలుగ,పొరలు పొరలుగ
సాక్షాత్కరిస్తు వెన్నంటి మదిని నెమరేస్తూ
యీ లోకంలో తిరుగుతాడు సంచారియై...

భూతం ముత్యాలు
9490437879

శోభ ..

నిరంతరం చలించే చైతన్యం
మనసంతా పరిమళించే స్నేహాన్వితం
పనీ పాట బోధన సమస్యలు సాలోచనలు
ఎల్లవేళలా సమాజమే సహజీవనం
యాల్లంతా సోపతిగాల్ల ఆపతి పనులకే
సంస్థలు సాహిత్యం రెండు చేతులా చేతనం
ఒప్పించుడు మెప్పించుడు సాధించుడు
ఒక ఒరవడిలో నేర్చిన జ్ఞానం
మదినిండా ఆనందం ఆరాటం పోరాటం
పాట ఎత్తుకుంటే గుండె గాయం
మానాల్సిందే
రాగం తీస్తే హృది పులకరించాల్సిందే
కవిత్వం అలుకుతే ప్రశ్నల మొలకలు
మాట మాటల్లో వర్ధమానం జాలువారుతది
ఆ దీపం వెలుతురు జైత్రయాత్ర నుంచే
పల్లెల లేత సొగసు తెలుసు
పట్నవాసాల వగరు పొగరూ తెలుసు
ఆయన అరికాళ్ళకు పయ్యలు ఉన్నాయి
నవ్వితే తలుక్కున మెరిసే పలువరస
చెంపమీద వికసించిన సొట్ట
మనిషే నిలువెత్తు మందహాసం
ఇద్దరు వాళ్ళు ,ఇద్దరు పిల్లలు
కళకళల అనురాగ తరంగాలు
ఆ ఇల్లు గాన శోభయభూషణం

(మిత్రుడు గాజోజు నాగభూషణం కు)
అన్నవరం దేవేందర్ 9440763479

శ్రీదేవి యాదిలో



దివి నుండి భువికి
దిగిన అందాల తార
భువి నుండి దివికి
అందరి తారగ వెళ్లింది.
బాలనటి నటన ప్రస్థానం
మేటి నటిగా ఎందరికో ఆదర్శం
పాత్రలకే వన్నె తెచ్చిన రాణి
అందరి హృదయాలను గెలిచిన ధీశాలి
శ్రీదేవిలో ఉన్న శ్రీకారం
అందరికి పంచింది మమకారం
ఆమె లేదన్న వార్త
ప్రపంచానికి కలిగించింది దుర్వార్త
ఆమె అమరం
నటించిన సినిమాలు అజరామరం
పాటలలో సజీవం
ఆమెకు ఎవ్వరూ పడలేరు పోటీ
ఆమెకు ఆమెనే సాటి
ఆ (ఈ) తరంలోని తారల్లోనే మేటి!!

(నటి శ్రీదేవికి నివాళిగా)

డా॥ ఎస్. విజయ భాస్కర్
9290826988

మట్టి కథల 'పెద్ద బాలశిక్ష' గూడూరి సీతారాం


డా.పత్తిపాక మోహన్
9966229548

స్వాతంత్ర్యానంతర తెలంగాణ తొలితరం కథకుల్లో అగ్రగణ్యులు గూడూరి సీతారాం. తెలంగాణ మట్టి భాషకు, యాసకు కథల్లో పటం కట్టి చూపించిన కథకుడాయన.నిఖార్సయిన తెలంగాణ భాషకు 1950 ప్రాంతంలోనే పట్టం కట్టిన గూడూరి జులై 18, 1936న నిన్నటి కరీంనగర్ జిల్లా, నేటి రాజన్న సిరిసిల్లా జిల్లా లోని హనుమాజీ పేటలో పుట్టారు. హనుమాజీ పేట, సిరిసిల్ల, కరీంనగర్ లలో విద్యను పూర్తిచేసిన గూడూరి సీతారాం 1961లో బి.ఏ కోసం తన మిత్రుడు, గురువు, హితుడు డా.సి.నారాయణ రెడ్డి సలహాతో హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో చేరారు. ఈ సమయంలోనే దాదాపు పది సంవత్సరాలు సినారె గూడూరి ఒకే ఇంట్లో ఉన్నారు. ఈ సమయంలోనే దాశరథి, కాళోజి, పల్లా దుర్గయ్య, వట్టికోట ఆళ్వార్‌స్వామి, బి.ఎన్.శాస్త్రివంటివారితో సాన్నిహిత్యం ఉండేది. తొలినాళ్ళలో సినారె, కనపర్తిలు కవిత్వం వైపుకు వెళ్ళగా గూడూరి సీతారాం, వీరి తమ్ముడు డా. గూడూరి రాఘవేంద్ర మరో కథకులు గూడూరి శంకరం కథల వైపుకు మొగ్గుచూపారు. సినారె మాటల్లో చెప్పాలంటే '' ఆ రోజుల్లో నన్ను అనుసరించిన యువకులిద్దరు, ఒకరు గూడూరి సీతారాం, రెండవ వాడు కనపర్తి లక్ష్మీనర్సయ్య. గూడూరి కథలో దారిలో చరించాడు. కనపర్తి కవితా మార్గంలో సాగిపోయాడు '' అంటారు.

విద్యార్థి దశలోనే గోరా, లవణంల ప్రభావంతో సీతారాం మిత్రబృందం 'ఎథిస్ట్ బాయిస్ క్లబ్'ను ఏర్పాటు చేసింది. ఇదే సమయంలో వేములవాడ నుండి వీరు, వీరి మిత్రబృందం వెలువరించిన లిఖిత పత్రిక 'విద్యుల్లత'లో, హెచ్.ఎస్.ఎల్.సి సిరిసిల్ల పాఠశాల నుండి వీళ్ళే స్థాపించి వెలువరించిన సంచిక 'తరంగిణి'లోనూ సీతారాం కథలు అచ్చయ్యాయి. అప్పటి ప్రముఖ పత్రికలు ప్రజామత, పల్లెటూరు, సుజాత, శోభ, తెలుగుదేశంతో పాటు భారతి, కరీంనగర్ నుండి వెలువడ్డ సారస్వత జ్యోతిలో గూడూరి కథలు, వ్యాసాలు, కవిత్వం వచ్చాయి. 1955 నుండి 1965 మధ్య గూడూరి సీతారాం 85కు పైగా కథలు, రెండు నవలలు, వివిధ అంశాలపై విమర్శ వ్యాసాలు రాసారు. అయితే అందరు తెలంగాణా రచయితల మాదిరిగా రాయడమే తప్ప వాటిని ప్రిజర్వ్ చేసుకోవాలనే సోయి లేకపోవడంతో అరవైకి పైగా కథలు లభించకుండా పోయాయి. మళ్ళీ 1995 ప్రాంతంలో సిరిసిల్లలోని మానేరు రచయితల సంఘం గూడూరి సీతారాం సాహితీ జీవిత స్వర్ణోత్సవం జరపాలనుకున్న సమయంలో తెలుగుదేశంలోని అన్ని ప్రసిద్ధ గ్రంథాలయాలు తిరిగి సేకరించిన 18 కథలతో గూడూరి సీతారాం కథలను ప్రచురించింది. ఇటీవల మరో నాలుగు కథలు లభించాయి. 1960– 65 మధ్యరాసిన రెండు నవలలు ఇంకా అలభ్యాలే. గూడూరి విమర్శకులుగా కూడా ప్రసిద్ధులే. ఆ మధ్య పాత పత్రికలు వెతుకుతున్నప్పుడు తెలుగుదేశంలో కాళోజీ 'నాగొడవ' గూర్చి రాసిన వ్యాసం కనిపించింది. ప్రజాకవి కాళోజీ ఒక్కడే అంటారు. అంతేకాక 'ఇలాతలంలో హేమం పిండగ' అంటూ రాసిన మహామహా సమాసాలు చదువుకున్న నాలాంటి వాడికే అర్థంకానప్పుడు సామాన్యునికి ఎట్లా అర్థం అవుతాయి. కాబట్టి సామాన్యునికి అర్థమయ్యేలా కవిత్వం రాసిన కాళోజీ ఒక్కరే ప్రజాకవి అంటారు.

గ్రామీణ జీవితం నేపథ్యంగా కథకునిగా ఎదిగిన గూడూరి సీతారాం తన రచనల్లో సామాన్యుని జీవిత వలయాలను దాటి రాసేప్రయత్నం ఎక్కడా చేయలేదు. తెల్లవారింది మొదలు పొద్దు గూకేవరకు పల్లెల్లో కంటికి కనిపించే వృత్తులు, జీవితాలు, సంస్కృతి మొదలైనవాటిని సూక్ష్మంగా నమోదు చేసారు గూడూరి.

కరీంనగర్ మాండలికంలో 1957లో రాసిన కథ 'మారాజు', ఇది అచ్చమైన తెలంగాణ భాషనే కాక జీవన విధానాన్ని, జాగరూకతను చిత్రించిన కథ. 'రంగడు బొంబాయి పోయచ్చిండు. ఆడెప్పుడో బొంబాయి దాకా ఎల్ల కుంటా ఉండడని చానామంది అనుకున్నరు. ఎర్రిబాగులోడు ఆ పిచ్చోడు బొంబాయి దాకా ఒక్కడే ఎట్లా ఎళ్ళిండా అనే తర్కాల పడ్డరు. గా నడుమ అదేదో పెద్ద సోపాల సదువంతా సదువుకున్న దొరగారి పిల్లగాడు లష్కరు బోయిండంట' అంటూ ఈ కథ సరళమైన భాషలో సాగుతుంది. 1950ల్లోని వలస జీవితాలను ఈ కథలో ప్రతిబింబింపజేసారు. పట్నం మోజులో అటు వృత్తికి దూరమై, ఇట్టు మట్టికి నా అనుకున్న మనుషులకు దూరమై అప్పటి తెలంగాణం ఎట్లుందో చూపిస్తారు గూడూరి. భాషరాని, బాట తెలియని ఒక అమాయక పల్లెటూరి బైతు పరాయి ప్రాంతంలో పడ్డ సాదకబాధకాలతో ఈ కథ ఆద్యంతం సాగింది.

'నారిగాని బతుకు' మరో మంచి కథ. కథలోని నారి వృత్తిరీత్యా గీత కార్మికుడు. కల్లు గీసితేవడం అతడి దిన చర్య. పల్లెల్లో భర్తతో పాటు భార్య, ఇంటిల్లిపాది వృత్తిలో పాల్గొనడం మామూలే. వృత్తిని కేంద్రంగా చేపుకుని గూడూరి ఈ కథలో విభిన్న స్త్రీల మనస్తత్వాలను, గ్రామీణ జీవనంలో కులవృత్తుల స్థానాన్ని చెబుతారు. నారిగానికి ముగ్గురు భార్యలు, లసుము, ఎల్లి, మూడో భార్య పాత్రలతో మూడు రకాల మానవ మనస్తత్వాలు గోచరిస్తాయి. లసుము కుటుంబపరమైన వ్యాపారంలో భర్తకు సహకరిస్తూ పరువుగా బతుకుతుంది. ఎల్లి నారిని మోసం చేసి లేచిపోతుంది. ఎల్లి మోసంచేయడంతో నారిగాడు చివరకు


గూడూరి సీతారాం

మూడోపెళ్ళి చేసుకుంటాడు. తనవృత్తి ధర్మంగా కల్లు వంచుతున్న మూడో భార్యను ఒక వ్యక్తి కొంగుపట్టి లాగగా నారిగాడు ఆవేశంగా అతని మీద చేయిచేసుకుంటాడు. ఇక్కడ రచయిత కల్లు గీత వృత్తిలోని చాలా విషయాలను చర్చిస్తారు. తరాలు మారిపోయి కులవృత్తిపై యాజమాన్యం సంతానానికి సంక్రమించి పూర్వ యజమానిది ప్రేక్షకపాత్రే అయినప్పుడు ఆయన పడుతున్న సంఘర్షనను, మానసికస్థితిని, పల్లెజీవికకు భూమికగా నిలిచిన కులాల సంస్కృతి మూల బిందువుగా చక్కటి కథనం ద్వారా మెప్పించారు గూడూరి. అంతేకాకుండా శ్రామిక కుటుంబాల్లో ఇల్లాలు భర్తతో పాటు కులవృత్తిలో పాల్గొనే గ్రామీణ కుటుంబ సంస్కృతిని వివిధ కోణాల్లో చిత్రించారు.

'రాజమ్మ రాజరికం' కథ ఐహిక సుఖాలు, కోరికలు, విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్శితురాలై మోసపోయి చివరకు భిక్షగత్తెగా మారిన స్త్రీ కథ. కథను ఎత్తుకోవడంలోనే ఒక కొత్త ఒరవడిని చూపిన గూడూరి సెన్గ సేన్ల నిలుచుని నీవు, చేయి జాపవే పూసలోల్ల రాజమ్మ, కంది సేన్ల నిలుచుని నువ్వు కన్నుగీటవే పూసలోల్ల రాజమ్మ' తెలంగాణ జానపదంతో ప్రారంభిస్తారు. సంస్కృతిలో వస్తున్న మార్పులతో కొత్తగా వస్తున్న వస్తువుల మోజులో సామాజిక జీవనం, నియమాలకు భిన్నంగా ప్రవర్తించి భర్తను కాదనుకున్న రాజమ్మ తాను పెళ్ళి చేసుకున్నా మార్పులకు లొంగని భర్తను కాదనుకుని వికటించిన నాగరికత ప్రభావంతో, కోరికలతో భర్తతో వైవాహిక జీవనానికి దూరమై రెంటికి చెడిన రేవడిలా అవుతుంది. రాజమ్మ పాత్రద్వారా గూడూరి చూపించిన వాస్తవాలు దాదాపు నాలుగు దశాబ్దాల నాటి సామాజిక పరిస్థితులు, అప్పుడప్పుడే తెలంగాణ బతుకులపై ప్రభావం చూపుతున్న సినిమాల పరిణామాలు చూడవచ్చు.

ఇంచుమించు ఇదే సమయంలో వచ్చిన మరో రెండు కథలు 'రంగడు', 'లచ్చి'. భాష, ఇతివృత్తం, ఆనాటి సమయ కాలాల విషయంలోనే కాక రచయిత గూడూరి సీతారాం కథలకు పేర్లు పెట్టడంలో కూడా తన ప్రాంతం, ప్రజలపై ఉన్న మమకారాన్ని వదులుకోలేదు. ఆయనకుగల అభిమానం, ప్రేమ ఆయన రచనల్లో ప్రతివాక్యంలో కనిపిస్తుంది. ఈ నేపథ్యంగా విలువల గురించి, అప్పుడప్పుడే వస్తున్న మార్పుల గురించి ఎంతో చర్చించారు గూడూరి.

1957లోనే అణగారిన బతుకుల జీవనవిధానాన్ని, సంస్కృతిని పరిశీలించి ఒక డాక్యుమెంటులాగా మలిచి, పరిశీలించి రాసిన కథ లచ్చి. సంచార తెగకు చెందిన బిక్షగాళ్ళ బతుకుతెరువుకు సంబంధించిన కథ ఇది. చాపలు అల్లుతూ, భిక్షాటన చేస్తూ బతికే ఒక కుటుంబం అందరిలాగే పట్నం మోజులోకి వచ్చి వృత్తిమారి, ఆర్థికంగా ఎదిగి ఈ క్రమంలోనే సామాజికంగా ఎదగలేక చిన్నాభిన్నమై ఎలా నాశనమైందో దీనిలో చూడవచ్చు. పరిగెత్తి, పరిగెత్తి ఎన్నో అపార్థాలు, అనుమానులకులోనై చతికిలబడి చివరికి బతుకు పరుగు పందెంలో అలసటచెంది పూర్వపు జీవితాల్ని మళ్ళీ గెలుచుకున్న క్రమంలో జరిగిన పరిణామాలు, పరిస్థితులు సామాన్యుని జీవితంలో మార్పులు ఎందుకు అనుకూల స్థితిని కలిగించలేకపోతాయో లచ్చి కథ అందుకు తార్కాణంగా నిలుస్తుంది.

ఇంకా 'అందని ఆకాశం', 'అబ్బాయిఅమ్మాయి', 'దెబ్బతిన్న అహంభావం', 'ఎర్రని పువ్వు', 'బస్సచ్చింది', 'పిచ్చోడు' వంటి ఎనభై అయిదు కథలను రాసారు గూడూరి సీతారాం. గూడూరి కథలన్నిటిలో పాత్రోచితమైన సంభాషణలతో జీవభాష ఉట్టిపడుతుంది. గూడూరి సీతారాం కథలు స్వాతంత్ర్యానంతరం రాయడం మొదలు పెట్టిన తెలంగాణ నవతరం రచయితలకు ఒక దిక్సూచిగా పనిచేసాయి. కథా సాహిత్యంలో నిజాయితిగా, నిస్సంకోచంగా గ్రామీణ పేదల జీవితాలను, వాళ్ళ ఇతివృత్తాలను ప్రవేశపెట్టేందుకు గూడూరి కథలు ఎంతగానో తోడ్పడ్డాయి. కథల్లో గూడూరి వాడిన తెలంగాణా జీవభాష అటుతరువాత తరం రచయితలకు ఒక పెద్దబాలశిక్ష లాగా ఉపయోగపడింది. తాను తన హనుమాజీ పేట, వేములవాడ, సిరిసిల్లల్లో చూసిన జీవితాలను నేపథ్యంగా చేసుకుని పల్లెజీవితాన్ని కథనం చేసారు గూడూరి. తెలంగాణా భాషకు సాహిత్య గౌరవాన్ని కల్పించిన రచయిత గూడూరి సీతారాం. అంతేగాక ఆనాటి తెలంగాణా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను, పరిణామ క్రమాన్ని అధ్యయనం చేయడానికి గూడూరి సీతారాం కథలు ఆకరాలుగా నిలుస్తాయి. ●

మోళ్లు

అవే ఆ పండ్లే.... తియ్య తియ్యగా..
వగరు వగరుగా, పుల్లపుల్ల గా
వాకిట్లో రాలిపడి
హుస్సేన్ బీ కొట్టం లాంటి
ఇంటికి మూడునెల్ల
గ్రాసం అందిచ్చిన పండ్లు
గుట్ట మీద ఏరుకొచ్చినవే అయినా
పోగుల లచ్చమ్మ కడుపెండుక పోకుండ
బొడ్ల సంచినింపిన పండ్లు
బడిడ్రెస్సు జేబులో నింపి
దవడకింద నానిచ్చి చప్పరించిన పండ్లు
వాడలన్నీ తిరిగి ఏ పెరడ్లో
ఏ రుచి దొరుకుతదో
అని దోస్తులను ఎంబడేసుకుని
ఊరు గాలిచ్చిన పండ్లు
పళ్ళను జివ్వుమన్పించి అంగుట్ల శర్కర జల్లి
ముడిచిన మూతికి బలమిచ్చి
నా అలకను నిలబెట్టిన పండ్లు
అప్పుడప్పుడు చేతిలో ఆడిన
పది పైసలు, పావలలు
డబ్బెడు ఆ పండ్లెత్తు...
నా చిన్నతనమంతా నిండిన పండ్లు..
దోర రేగు పండ్లు... చేవ తగ్గిన శరీరాలకు
పెరళ్లు బరువయినయి.... కళ్ళు తెరిచేసరికి
మోళ్లు నిలబడినయి..!
నిజమే..! ఇంక ఎప్పటికి రాకుండా
ఆ చెట్లన్నీ స్వర్గానికెక్కినయి...
బరువు కాత కోసం ఆ గింజలన్నీ సంకరం
కల్తీ లో చిక్కినయి...

దేవనపల్లి వీణావాణి
9951331122

ఆస్తికం... నాస్తికం...?

రాతి దేవుళ్ల కళ్యాణానికి రాచభోగాలు,
కటిక పేదల కంట్లో కన్నీటి ధారలు,
తల్లిదండ్రులకు పచ్చడి మెతుకులు,
కర్మకాండల పేరుతో కాకులకు వంటకాలు,
చేయిచాచి సాయమడిగితే ఉచిత సలహాలు,
గుళ్లు గోపురాలకు భూరి విరాళాలు,
అన్నదానాల పేరుతో గుడికి చందాలు,
ఉన్నవాళ్లే వచ్చి మెక్కి వెళ్లడాలు,
మనిషంటే ప్రేమలేక,
జంతువులపై జాలిలేక,
సంపాదనే సర్వస్వంగా సాగే,
ఆధునిక మానవ జీవన గమనంలో...
ఏది ఆస్తికం... ఏది నాస్తికం...?

వి.కైలాష్
9848866835

కవితా సంకలనం ఆవిష్కరణ

'అమ్మ–నాన్న–నేను' అన్న కవితా సంకలనం మార్చి 20 న శ్రీ త్యాగరాయ గానసభ కళాదీక్షితులు కళావేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచార్యులు ఆవిష్కరిస్తారు. ఈ పుస్తకానికి సంపాదకులుగా గుదిబండి వెంకటరెడ్డి వ్యవహరించారు. ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా ఆం.ప్ర.పూర్వ శాసనమండలి చైర్మన్ డా॥ఎ .చక్రపాణి ముఖ్య అతిథిగా, దూరదర్శన్ పూర్వ సంచాలకులు డా॥పాలకుర్తి మధుసూదన్‌రావు అంకిత స్వీకర్తగా, పొత్తూరి జయలక్ష్మి పుస్తక పరిచయ కర్తగా పాల్గొంటారు.

తెలంగాణ సాహిత్య సమాలోచన

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నందలి ప్రభుత్వ డిగ్రీ, పి.జి. కళాశాలలో ఈనెల 6,7 తేదీలలో రెండు దశాబ్దాల తెలంగాణ సాహిత్యం–సమాలోచన (1996–2016)అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఇందులో పన్నెండు ఉప అంశాలపై పత్ర సమర్పణలుంటాయని పాల్గొనదలచినవారుడా॥ఎం.రమేష్‌బాబు, సెల్:9493914871ను సంప్రదించాలని కోరారు.

ఎక్స్‌రే 2017 అవార్డు ప్రకటన

ప్రతిష్టాత్మకమైన ఎక్స్‌రే అవార్డు ప్రతి సంవత్సరం ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ సంవత్సరం కూడా.'భవన నిర్మాణ కార్మికుడు' రాసిన యాములపల్లి నరిసిరెడ్డికి 'ఎక్స్‌రే –2017' అవార్డు లభించింది. విజేతకు పదివేల రూపాయల నగదు, జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. మరో పది మందికి ఉత్తమ కవితా పురస్కారాలు అందిస్తారు. ఇప్పటికి మూడు సంవత్సరాలుగా ఇస్తున్న ఈ అవార్డును ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాల ప్రదానం జరుగుతుంది. ఎంపికను ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ నిర్వహించారు.


కోచ్‌తో అరుణ

అంతిమలక్ష్యం ఒలింపిక్స్ పతకం!!

తన లక్ష్యాన్ని దిశా నిర్దేశం చేసిన తండ్రి హఠాత్తుగా దూరమైనా... ఆయన తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయక .. ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొంటూ..అనుకున్న విజయాన్ని సాధించిందో యువ క్రీడా కారిణి. ఆమే ప్రపంచకప్ జిమ్నా స్టిక్స్‌లో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించిన తెలుగమ్మాయి బుద్దా అరుణా రెడ్డి.

కామన్వెల్త్ నుంచి ఆసియా క్రీడల వరకూ, ఆసియా చాంపియన్‌షిప్ నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్ వరకు అన్నింట్లో పాల్గొంది అరుణారెడ్డి. పతకానికి దగ్గర కాకపోయినా పట్టుదలను మాత్రం వీడలేదు. ప్రపంచ కప్‌లో పతకంతో మెరిసి అందరి దృష్టిని తనవైపునకు తిప్పుకుంది. ఆత్మరక్షణ కోసం నేర్చుకున్న క్రీడను అంత ర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ఇటీవల జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్య పతకం సాధించిన తొలి భారతీయు రాలిగా గుర్తింపు పొందింది. ఈ స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధస్తానంటోంది. తన లక్ష్యం మాత్రం ఒలింపిక్ పతకం మాత్రమే అంటోంది 22 ఏళ్ల అరుణ.

చార్టెడ్ అకౌంటెంట్ అయిన తండ్రి నారాయణరెడ్డి కోరిక మేరకు చిన్నతనంలోనే కరాటే నేర్చుకుంది. ఆ తర్వాత కరాటే మాస్టర్ సలహాతో జిమ్నాస్టిక్స్ వైపు మళ్లింది. ఎల్బీస్టేడియంలో కోచ్‌లు స్వర్ణలత, రవీందర్, బ్రిజ్ కిశోర్ నేతృత్వంలో చాలా నేర్చుకున్నానని వినయంతో గుర్తుచేసుకుంటుంది. ప్రాథమికాంశాల నుంచి అనేక ఈవెంట్లలో పోటీపడేవరకు కష్టపడింది. ఫలితాలు అందుకుంది. సబ్‌జూనియర్ స్థాయి మొదలు ఇంటర్ యూని వర్సిటీ, సీనియర్ నేషనల్స్ వరకు వరుసగా పతకాలు సాధించి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుకుంది.అనం తరం అంతర్జాతీయ స్థాయిలో చెప్పుకోదగిన ఫలితాలు రాకపోవడంతో పెద్దగా గుర్తింపు లభించలేదనే నిరాశ మాత్రం ఆమెను వెంటాడేది.

2010లో తండ్రి మరణంతో మరింత కుంగిపోయింది. ఆటలో ప్రాక్టీస్‌కి, గేమ్స్‌కి, శిక్షణ శిబిరాలకు తండ్రే స్వయంగా తీసుకెళ్లేవాడు. ఒక్కసారిగా ఆయన్ని కోల్పోవడంతో ఇబ్బందులు పడింది. ఆర్థిక సమస్యలు తలె త్తాయి. మానసికంగా కుంగిపోయింది. అమ్మ సుభద్ర, అక్క పావని, బావ జనార్థన్‌రెడ్డి నిరంతరం ప్రోత్సహించి అరుణలో ఆత్మవిశ్వాసాన్ని నిలిపారు. వారి ప్రోద్బలంతో ఆటలో మళ్లీ విజృంభించింది.

జాతీయ స్థాయిలో రాణిస్తూ అనేక పతకాలు గెలుచుకుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆమెకు అండగా నిలిచింది.ఈ క్రమంలో 2014లో జరిగిన కామన్వెల్త్, ఆసియా క్రీడలు, 2013లో ప్రపంచ చాంపియన్‌షిప్, గత ఏడాది ఆసియా చాంపియన్‌షిప్‌లలో వరుసగా పాల్గొంది. కానీ పతకానికి చేరువకాలేకపో యింది. ఇలాంటి టోర్నీలలో పాల్గొనడం వల్ల క్రీడలో లోటుపాట్లు, నైపుణ్యం తెలుసుకునే అవకాశం లభించిం దని అంటుంది.

ప్రపంచ కప్ టోర్నీలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా, ప్రత్యేకంగా తాష్కెంట్‌లో శిక్షణ పొందింది. ఆమెకు గ్రీన్‌కో గ్రూప్‌తోపాటు వ్యాపారవేత్త, మాజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్‌లు ఆర్థికసాయం చేశారు. వాల్ట్ ఈవెంట్‌లో అరుణ తన సహజశైలిలోనే ఆడింది. కొన్ని విన్యాసాలు కష్టంగా ఉన్నా ...సాధనతో వాటిని అధిగ మించి పతకం సాధించింది. తర్వాతి రోజు ఫ్లోర్ విభాగంలో బాగా ఆడినా పతకం మాత్రం దక్కించుకోలేక పోయింది. జిమ్నాస్టిక్స్‌కు ఉత్తర భారతంలో చాలా ప్రాధాన్యత ఇస్తారు. ఇక్కడ పెద్దగా గుర్తింపులేదంటూ విచారం వ్యక్తం చేస్తుంటుంది. ఇప్పటికైనా జిమ్నాస్టిక్స్ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందనే ఆశను వ్యక్తం చేస్తోంది అరుణ.

వచ్చే నెలలో కామన్వెల్త్ క్రీడలు, అనంతరం ఈ ఏడాదిలోనే ఆసియా క్రీడలు రానున్నాయి. వీటిలో పత కాలు గెలుచుకోవడమే తన ముందున్న ఏకైక లక్ష్యం అంటోంది. అంతిమ లక్ష్యం మాత్రం ఒలింపిక్స్ పతకం సాధించడమే అని తెలుపుతోంది. ప్రస్తుతం టోక్యో ఒలింపిక్స్‌లో పతకం నెగ్గడానికి కృషి చేస్తు న్నట్లు చెబుతోంది. అదేవిధంగా కేంద్రప్ర భుత్వ పథకం 'టాప్'లో ఉండటంతో ఆర్థికపరంగా కూడా పరిస్థితి మెరుగై నట్లు చెబుతోంది.



గతుకులకు పరిష్కారం..!



గతుకుల రోడ్లపై వాహనం నడపడం నరకంలాంటిది. ఎక్కడ ఏ గుంతలో పడతామో..నడ్డివిరుగుతుందోననే భయం వెంటాడుతుం టుంది. అప్పుడప్పుడూ ప్రమాదానికి గురైనవారూ లేకపోలేదు. ఈ సమస్యకు పరిష్కారాన్ని కనిపెట్టారు మాధవ్, విశ్వనాథ్, సంతోష్‌లు. ఫిగో ఇన్నోవేషన్స్ అనే కంపెనీను స్థాపించారు. గతుకుల తీవ్రత తగ్గించే కారు, మోటార్ సైకిల్ ఫిగో ఫ్లోట్ (బుడగ సీట్ల)ను రూపొందించారు. వీరికి ఆలోచన ఎలా వచ్చిందంటే... ఎన్ఐటీ సూరత్‌లో చదువుతున్నప్పుడు సమాజానికి ఉపయోగపడే ఏదైనా కొత్త ఆవిష్కరణ చేయా లనుకున్నారు. అప్పుడే వారికి గతుకుల రోడ్లు కనిపిం చాయి. ఓరోజు అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)కి ముగ్గురూ వెళ్లారు. అక్కడ కార్లు నడిపేవారికి నడుము నొప్పి రాకుండా అనేక ఉత్పత్తులు కనిపించాయి. వాటినే మార్చి కొత్తగా సీటు తయారుచేయాలనే ఆలోచన వచ్చింది. నిత్యం మంచం మీదే ఉండేవారి కోసం తయారు చేసే ఎయిర్ సస్పెన్షన్ వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుని కారు సీట్లు, మోటార్ సైకిల్ సీట్లు తయారుచేయడం మొదలుపెట్టారు. ఎన్ ఐడీ కూడా వారి కంపెనీ పెట్టుబడి పెట్టడా నికి ముందుకొచ్చింది. దాదాపు ఓ ఏడాది ఎన్ఐడీలో ఉన్న తర్వాత టీ హబ్‌కు వచ్చారు.

గతుకుల రోడ్డులో వాహనంపై ప్రయాణిస్తున్నపుడు వెన్నెముకపై పడే ఒత్తిడిని ఈ బుడగ సీటు 50 శాతానికి పైగా తగ్గిస్తుందని చెబుతున్నారు కంపెనీ వ్యవస్థా పకులు. కొంత వాహనానికి ఉండే సస్పెన్షన ద్వారా తగ్గితే, సీటు వల్ల ఇంకొంత ఒత్తిడి తగ్గుతుందంటున్నారు. ఈ సీట్లను ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని గుజరాత్ వచ్చిన ప్పుడు ప్రదర్శించారు. వీటిని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో ఆర్డర్ ద్వారా కొనుగోలు చేయొచ్చు.



తక్కువ పెట్టుబడితో సంపాదించండిలా...

ఎక్కువ మందితో పరిచయాలు ఉండి, ఏదో ఒకటి సాధించాలనే తపన ఉంటేచాలు.. తక్కువ పెట్టు బడితో వ్యాపారం చేసుకునే అవకాశం ఉంది. మరికొన్నింటికైతే డబ్బే అవసరం ఉండదు. కావల్సిందల్లా ఆలోచన, దాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వర్తించడమే. అవేంటో చూద్దాం..



పిల్లల సంరక్షణ : ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. దీంతో తమ పిల్లల్ని చూసుకోవడానికి సమయం దొరక్క సత మతమౌతున్నారు. అలాంటివారి సమస్యల్ని పరిష్కరిస్తూ, సంపాదించే మార్గమే పిల్లల సంరక్షణ బాధ్యత. సమర్థవంతంగా నిర్వర్తిస్తే ఈ రంగంలో చక్కగా సంపాదించవచ్చు.

బ్యూటీషియన్ : ఇంటి వద్దకే వచ్చి అందానికి సంబంధించిన సేవ లను అందించే బ్యూటీషియన్లు ఎక్కువున్నారు. అందానికి సంబంధిం చిన కోర్సులను నేర్చుకొని, దాన్నే వ్యాపారంగా మలుచుకుంటే బాగా సంపాదించవచ్చు. ఎక్కువ పరిచయాలను కలిగి ఉంటే అంత ఆదరణ లభిస్తుంది.

ఫలహార బండి: వంట చేయడంలో ప్రావీణ్యం ఉన్నట్లయితే టిఫిన్ సెంటర్‌ను నడుపుకోవచ్చు. ఇంటి వంటను ఇష్టపడేవారు ఎప్పుడూ ఉంటారు. ఈ వ్యాపారానికి కాస్త పెట్టుబడి కావాలి. ఇంటి నుంచే నడుపుకునే వీలుంటుంది.



పెంపుడు జంతువుల సంరక్షణ: పెంపుడు జంతువులంటే ఇష్టం ఉంటే, పెంపుడు జంతువుల సంరక్షణ వ్యాపారం (పెట్ కేర్) చేపట్టవచ్చు. సొంత స్థలం ఉన్నట్లయితే సున్నా పెట్టుబడితో ప్రారంభించవచ్చు.

టాక్సీ సర్వీసెస్: పెరుగుతున్న నగరీకరణ, ప్రయాణాల మూలంగా ఈ వ్యాపారం ఊపందుకుంటోంది. మామూలు వ్యక్తులు సైతం దీనిపై ఆసక్తి చూపుతున్నారు. సొంత వాహనం ఉంటే పెట్టుబడి లేకుండానే మొదలుపెట్ట వచ్చు.

ట్యూషన్స్: పిల్లలకు బోధించే తెలివి ఉండి, నైపుణ్యం ఉంటే ఇది మంచి ఐడియా. అయితే దానిలో ఉండే లోతుపాతుల గురించి ఆ రంగంలో ఉండే వారి సలహాలు తీసుకోవడం మంచిది.

వంట పాఠాలు: వంట చేయడంలో నైపుణ్యం ఉండి, బాగా ఎదుటి వారికి వివ రించగలం అనుకునేవారు ఈ విధంగాను డబ్బు సంపాదించుకోవచ్చు. దీనికి పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. హోమ్‌మేకర్లు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతారు.

యోగా, డ్యాన్స్ పాఠాలు: డ్యాన్స్ పాఠాలు నేర్పించడం మంచి డిమాండ్ కలి గిన రంగం. ఏరోబిక్, యోగా వంటి అంశాలను సైతం నేర్చుకునేందుకు చాలా మంది ఎదురుచూస్తుంటారు.

నేడు లోక్‌సభలో టిఆర్ఎస్ వాయిదా తీర్మానం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రాల పరిధిలో ఉండే విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పించే రిజర్వేషన్ అంశం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా ఉంటుందని, దీనిపై నిర్ణయాధికారం రాష్ట్రాలకే ఉండే విధంగా రాజ్యాంగ సవరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభలో టిఆర్ఎస్ సోమవారం వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెడుతోంది. ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి ఈ అంశంపై చర్చించాలని పట్టుబట్టనుంది. స్పీకర్ అనుమతించకపోయినట్లయితే సభలోనే నిరసన తెలపాలని ఆ పార్టీ భావిస్తోంది. రాష్ట్రాల్లో జనాభా అవసరాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలని టిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. సిఎం కెసిఆర్ సైతం రెండు రోజులుగా ఇదే అంశాన్ని నొక్కిచెప్తున్నారు. ఆ పార్టీ పార్లమెంటు సభ్యుల సమావేశంలో సైతం ఈ అంశంపై లోతుగా చర్చ జరిగింది. రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా చట్టం చేసి కేంద్రానికి పంపించినా ఆమోదం లభించలేదని, దేశమంతా ఒకే రిజర్వేషన్ విధానం అమలుకావాలన్నది రాజ్యాంగం చెప్తున్నప్పటికీ తమిళనాడులో 69%, మహారాష్ట్రలో 52% ఎలా అమలవుతున్నాయని కెసిఆర్ ప్రశ్నించారు. తెలంగాణ మాత్రం తన జనాభా అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్ ఎందుకు పెంచుకోరాదని ప్రశ్నించారు. తెలంగాణ పంపిన రిజర్వేషన్ చట్టాన్ని కేంద్రం తిప్పి పంపడాన్ని టిఆర్ఎస్ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో ఆ పార్టీ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టి రిజర్వేషన్ విధానంపై చర్చకు పట్టుబట్టాలని నిర్ణయించింది. కేంద్రం నుంచి వచ్చే స్పందనను బట్టి మంగళవారం నుంచి ఏ విధమైన వ్యూహం అనుసరించాలనేదానిపై స్పష్టత రానుంది.

మూడో ఫ్రంట్ అసాధ్యం

● బిజెపికి కాంగ్రెస్ పార్టీయే ప్రత్యామ్నాయం ● టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్



మనతెలంగాణ/ నిజామాబాద్ బ్యూరో : కేంద్రంలో బిజెపికి కాంగ్రెస్ పార్టీయే ప్రత్యామ్నాయమని, తెరాసతో సాధ్యం కాదని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగడంపై కెసిఆర్ సిగ్గుపడాలని విమర్శించారు. ధనిక రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, పక్క రాష్ట్రాలను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. బంగారు తెలంగాణలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగానికి పైగా పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో మోసపూరిత హామీలతో సిఎం కెసిఆర్ ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజా చైతన్యబస్సుయాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ యాత్రకు జనం బ్రహ్మరథం పట్టగా సిఎస్ఐ మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మూడవ ఫ్రంట్‌పై కెసిఆర్ చేసిన ప్రకటనకు స్పందిస్తూ రాష్ట్రంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించలేని వ్యక్తి కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడం సిగ్గుచేటని అన్నారు. వేలాది మంది రైతుల ఆత్మహత్యలకు కారకుడైన సిఎం మూడవ ఫ్రంట్‌తో ఉద్ధరిస్తాడట అని ఆయన ఎద్దేవా చేశారు. దేశంలోనే ధనిక రాష్ట్రమైన తెలంగాణలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, బోనస్ అందించకపోవడం శోచనీయమన్నారు. ఏకకాల రుణమాఫీ చేయకపోవడంతో రైతులు అప్పుల పాలై బలవన్మరణాలకు పాల్పడ్డారని, దేశంలోనే అమానవీయంగా ప్రవర్తించిన తొలి సిఎం కెసిఆర్ అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నట్లుగా విశ్లేషిస్తున్నామని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నోట్ల రద్దు, జిఎస్టీ అమల్లో బిజెపికి మద్దతుగా నిలిచిన కెసిఆర్, ప్రస్తుతం బిజెపిపై విమర్శలు గుప్పిస్తూ అవకాశవాద రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపికి వెన్నుదన్నుగా నిలిచి ప్రస్తుతం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మోడీతో దోస్తాన చేస్తూ బిజెపికి వ్యతిరేకమని మభ్యపెడుతు మూడవ ఫ్రంట్ పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. 12శాతం రిజర్వేషన్ పేరుతో ముస్లీం మైనార్టీలను మోసం చేశారని, వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ పవర్ ఇస్తామని ప్రకటించి దాట వేశారని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. బిజెపిని గద్దె దించడం రాహుల్ గాంధీతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నాయకుడు బాలరాంనాయక్, దానం నాగేందర్, మధుయాష్కిగౌడ్, ఎమ్మెల్సీలు షబ్బీర్ అలీ, ఆకుల లలిత, మాజీ రాజ్యసభ్యులు వి. హన్మంత్‌రావు, అరికెల నర్సారెడ్డి, డిసిసి ప్రెసిడెంట్ తాహెర్‌బిన్ హందాన్, అర్బన్ ఇంచార్జీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రత్నాకర్, గడుగు గంగాధర్, కేశవేణు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు భూసార కార్డు !

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రతి రెండున్నర ఎకరాల విస్తీర్ణానికి భూసార పరీక్షల మట్టి నమూనాల సేకరణ చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ యోచిస్తోంది. ఈ మేరకు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. ప్రస్తుతం గ్రిడ్ ఆధారితంగా భూసార పరీక్షలకు వర్షాధార భూముల్లో 25 ఎకరాలకు, బోర్లు, బావులు, ప్రాజెక్టు ఆయకట్టు సాగు భూముల్లో 12 ఎకరాలలో మట్టి నమూనాలు తీసి విశ్లేషిస్తున్నారు. వీటి ద్వారా రైతులకు అంత ఉపయోగం ఉండటం లేదని, విస్తీర్ణం ఎక్కువగా తీసుకోవడం వల్ల మట్టి నమూనాల్లో తేడాలు ఉంటున్నాయని భూసార శాస్త్ర వేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మట్టి నమూనాలు సేకరించే విధానంలో మార్పులు ఉండాలంటున్నారు. రానున్న కాలంలో భూసార ఫలితాల కార్డులను ఎరువుల పంపిణీకి అనుసంధానించే యోచనలో కేంద్రం ఉంది. ప్రస్తుతం భూసార పరీక్షల నిర్వహణ ఖర్చు మొత్తం కేంద్రమే భరిస్తుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుని నిధులు సమకూర్చే యోచనలో ఉందని అధికారులు చెబుతున్నారు. తాజాగా రైతు ప్రతి ఎకరా భూమిలో ఏ రకమైన భూసారం ఉందో తెలుసుకోవడం ద్వారా పంటల సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొదటి దశలో 2015–16లో 5 లక్షల మట్టి నమూనాలు పరీక్షించి 25.20 లక్షల కార్డులు, 2016–17లో 5.35 మట్టి నమూనాలు పరీక్షించి 30.33 లక్షల కార్డులు పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రెండో దశలో 2017–18, 2018–19లో 9.73 లక్షల మట్టి నమూనాలు పరీక్షించి, 55.45 లక్షల భూసార కార్డుల పంపిణీ లక్ష్యంగా కేంద్రం నిర్దేశించింది. ఇందులో ఇప్పటివరకు 4.87 లక్షలు పరీక్షించగా 79,773 కార్డులు పంపిణీ చేసినట్లు సమాచారం. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 12, వ్యవసాయ మార్కెటింగ్‌లో 28, సంచార భూసార కేంద్రాలు 4, మిని భూసార పరీక్షా కేంద్రాలు 2050 ఉన్నాయి.

విద్యార్థులతో కైలాష్ సత్యార్థి ముఖాముఖి



మనతెలంగాణ/హైదరాబాద్ : దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, దానిని గుర్తిపెట్టుకుని ఆచరించాల్సిన అవసరం ఉందని నోబుల్ గ్రహీత కైలాష్ సత్యార్థి అన్నారు. ప్రపంచంలో 53 శాతం బాలబాలికలకు హక్కులు లభించడం లేదని పేర్కొన్నారు. శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన విద్యార్థులతో ఇటీవల ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ, కలలు కనడం, అన్వేషించడం, మనసా, వాచా కర్మనా ఆచరించి అనుసరించాన్న 'త్రి డి' విజయ సూత్రాన్ని విద్యార్థులకు ఉద్భోదించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంఎల్‌ఎ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బివి పాపారావు, వేదకుమార్, కళాశాల ఛైర్మన్ రంగినేని వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి భవన్‌కు ఆర్‌టిసి బస్సులు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆదివారం ఆర్‌టిసి ప్రయాణికులకు అవస్థలు ఎదురయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆర్‌టిసి బస్సుల్లో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రిని అభినందించడానికి తరలివచ్చారు. బస్సులన్నీ హైదరాబాద్‌కు తరలడంతో వివిధ జిల్లాల్లో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. టిఆర్‌టి పరీక్షకు సుమారు లక్ష మంది విద్యార్థులు హాజరు కావడం, రాష్ట్రంలో ఆదివారం ఒక్క రోజే లక్ష పెళ్ళిళ్లు జరగడంతో బస్ స్టేషన్లు, బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా అసలే బస్సుల్లో రద్దీతో సతమతమవుతుండగా ఎక్కువ బస్సులు ప్రగతి భవన్‌కు తరలిపోవడంతో ప్రయాణికులు బస్ స్టేషన్లలో గంటల కొద్దీ వేచి చూస్తూ వచ్చిన ఒకటి రెండు బస్సుల్లో నానా అవస్థలు పడి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది. అదనపు బస్సుల కోసం ప్రయాణికులు బస్ డిపోల మేనేజర్లకు ఫోన్లు చేస్తే అవి స్విచాఫ్ చేసి ఉన్నాయని పలువురు ప్రయాణికులు తెలిపారు. ఇదే అదనుగా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ తదితర ముఖ్యమైన పట్టణాల నుంచి హైదరాబాద్‌కు రావడానికి, హైదరాబాద్ ఎంజిబిఎస్, జెబిఎస్ తదితర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ అందినకాడికి దండుకున్నాయి.

నటిపై గూండా చట్టం

చెన్నై: పలువురిని ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసిన నటి శృతిపై కోయంబత్తూరు పోలీసులు ఏడాదిపాటు నాన్‌బెయిలబుల్ గూండా చట్టాన్ని ప్రయోగించారు. ఆమెతో పాటు తల్లిదండ్రులైన చిత్ర, ప్రసన్న వెంకటేష్‌లపై కూడా పోలీసులు ఇదే చట్టం నమోదు చేయడం గమనార్హం. ఆడిపోనాల్ ఆవని మూవీతో నటిగా మంచి గుర్తింపు పొందిన శృతి చీటింగ్ కేసులో ఇరుక్కుంది. దీంతో విచారణ మొదలు పెట్టిన పోలీసులకు ఆమె మోసాల చిట్టా బయటకు వచ్చింది. చాలా మందిని ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసి, వారి నుంచి భారీ మొత్తంలో దండుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో శృతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు సహకరించిన తల్లిదండ్రులను కూడా అరెస్టు చేశారు.

రేవంత్‌రెడ్డి కారు ఢీ, ఒకరికి తీవ్ర గాయాలు

వనపర్తి: కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి కాళ్లు విరిగిన ఘటన వనపర్తి జిల్లాలోని మూసాపేట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వనపర్తిలో సింహగర్జనకు రేవంత్ కారులో బల్దేరారు. అయితే కారు మూసాపేట వద్దకు రాగానే ఓ వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాధితుడి రెండు కాళ్లు విరిగిపోయినట్లు తెలిసింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. దీంతో రేవంత్ కారు ముందు స్థానికులు ధర్నాకు దిగారు. బాధితుడికి న్యాయం చేయాలని రేవంత్‌ను నిలదీశారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించి రేవంత్‌ను అక్కడి నుంచి పంపించి వేశారని సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఖరీఫ్‌లో వరి సాగు అధికం

మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన ఆహార పంట వరి సాగుకే ప్రాధాన్యం లభించనుంది. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల కింద సాగునీరు పెరగడంతో పాటు వాతావరణం ఆశాజనకంగా ఉండవచ్చన్న సంకేతాలు కనబడుతున్నాయి. వర్షాకాలం వరిసాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. మే రెండో వారం నుంచి విత్తనాల అమ్మకం మొదలు కానుండడంతో రాయితీ విత్తనాలు అధికంగా సిద్ధం చేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రజలకు 'లైఫ్ స్టైల్'

వృత్తిపరంగా వైద్యుల్లో మానసిక ఒత్తిడి



మన తెలంగాణ / హైదరాబాద్ : మారుతున్న జీవనశైలి కారణంగా ఇటీవలి కాలంలో కొత్తకొత్త రోగాలు, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వృత్తిపరమైన వ్యాధులతో పాటు రక్తపోటు, మధుమేహం లాంటి వ్యాధులు సాధారణమైపోయాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'స్పీడ్ లైఫ్'తో ఇలాంటి వ్యాధులబారిన పడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. రోజువారీగా వైద్యులు ఎదుర్కొనే పలు రకాల సమస్యల పరిష్కారానికి అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 'నాట్ జస్ట్ మెడ్స్ లెట్స్ టాక్ బియాండ్ మెడిసన్' పేరుతో ఆదివారం పార్క్ హయత్ హోటల్‌లో జరిగిన సదస్సును అపోలో ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ శోభన కామినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యవృత్తిలో ఉన్నవారు ప్రజల ఆరోగ్య అవసరాలను తీరుస్తూ ఇటు వృత్తిపరంగా అటు వ్యక్తిగతంగా రోజు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీటిని వైద్యులు నిర్లక్ష్యం చేయడం వల్ల కుటుంబంపై ప్రభావం పడుతోందన్నారు. టెక్నాలజీలోని మార్పుల అనుగుణంగా రోగాలు కూడా హైటెక్ ధోరణిలో వస్తున్నాయని పలు కార్పొరేట్ ఆసుపత్రుల యాజమానులు అభిప్రాయపడ్డారు. పరీక్షలు చేస్తే తప్ప రోగాన్ని నిర్ధారించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మిగతా దేశాలతో పోలిస్తే భారతీయ వైద్యుల సగటు వయస్సు పదేళ్ల తక్కువగా ఉందన్నారు.

వైద్యుల ఆత్మహత్యలు : ఏటా 2500 మంది డాక్టర్లు వృత్తిపరమైన సమస్యలు ఎదుర్కొంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని శోభనా కామినేని ఆవేదన వెలిబుచ్చారు. డాక్టర్లలో ఆత్మస్థైరాన్ని నింపాల్సి ఉందన్నారు. వృత్తిని మెరుగుపర్చుకుంటూనే ఆర్థిక నిర్వహణ, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఒత్తిడిని తట్టుకోవడం వంటి సమస్యలపై సదస్సులో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య వృత్తిలో అవకాశాలు కూడా మెరుగ్గానే ఉన్నాయని, కేంద్రం ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్‌భవ' పథకం ప్రజలకు దోహదపడుతుందన్నారు. వివిధ అంశాలపై కేర్ ఆసుపత్రి హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ సోమరాజు, కిమ్స్ హాస్పిటల్ ఎండి, సీఈఓ డాక్టర్ భాస్కర్‌రావు, సన్‌షైన్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ గురవారెడ్డి, స్టార్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ గోపిచంద్, అపోలో ఆసుపత్రి అధ్యక్షులు డాక్టర్ కె.హరిప్రసాద్‌తో పాటు నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ అమితా వారే, నిర్వాహక కార్యదర్శి ఇషిత షిలిలి మాట్లాడారు. కొత్తగా డాక్టర్ల వృత్తిలోకి వచ్చే వారికి అవసరమైన మెలకువలు నేర్పడంతో పాటు సాధక బాధకాలు, రోగుల స్థితిగతులతో పాటు వారిని సంతృప్తి పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఆసుపత్రిలో సంభవించే చిన్నపాటి పొరపాటుకే రోగులకు సంబంధించిన వాళ్ళు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీని పట్ల డాక్టర్ల ఆందోళన వ్యక్తం చేశారు. వీటి నివారణకు చట్టపరంగా చర్యలు తీసుకునే అంశాలపై కూడా చర్చించారు.






నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్ రెడ్డి, రేణుక దంపతుల కుమార్తె స్ఫూరి వివాహం ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి భాస్కరరావు, సుశీల దంపతుల కుమారుడు ఆశీష్‌తో ఆదివారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటుగా మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పద్మారావు, మాజీ గవర్నర్ రోశయ్యతో పాటు ప్రముఖులు హాజరయ్యారు.

బలి యత్నం భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

మారణాయుధాలను చూడగానే అనుమానం వచ్చిన గాదర్ల రమేష్ నరబలి కోసమే నన్ను ఇక్కడకు తీసుకొచ్చారని అర్థం చేసుకున్నాడు. వెంటనే అక్కడి నుండి చాకచక్యంగా తప్పించుకుని మొట్లపల్లి గ్రామానికి రమేష్ చేరుకున్నాడు. జరిగిన విషయాన్ని గ్రామస్థులకు వివరించాడు. దీంతో మొట్లపల్లి గ్రామస్థులు రమేష్ గ్రామమైన కిష్టంపేటకు చేర్చారు. జరిగిన విషయాన్ని రమేష్ తండ్రి గ్రామస్థులకు వివరించాడు. అనంతరం సంఘటన స్థలానికి గ్రామస్థులతో కలిసి వెళ్లేసరికి గుప్త నిధుల ముఠాలో సభ్యులైన సూర్యాపేట జిల్లా, మోటంపల్లి మండల కేంద్రానికి చెందిన గోలి ప్రేంకుమార్‌రెడ్డి, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన చలిగంటి రాజెల్లులు పోగల సారయ్య పొలంవద్ద ఉన్న గుడిసెలో ఉన్నారు. వీరిద్దరితో పాటు సాగర్ల రవిని గ్రామస్థులు నిర్భందించి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు ప్రేంకుమార్‌రెడ్డి, రాజెల్లు, సాగర్ల రవిని అదుపులోకి తీసుకున్నారు. గుప్తనిధుల ముఠాలో సభ్యులైన మరికొందరు పరారీలో ఉన్నారు. పరారైన నిందితుల కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు. ఇది ఇలా ఉండగా 20సంవత్సరాలు పైబడిన యువకుడినే నరబలి ఇచ్చేందుకు పూనుకున్నారంటే, ఇక చిన్నపిల్లలను ఎత్తుకెళ్లి ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడుతారోనని స్థానిక గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుప్త నిధుల ముఠాసభ్యులు(ముగ్గురు)

గాలి, నీరు, నేల

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో గ్రీన్‌పీస్ ఇండియా అనే సంస్థ 2016లో విడుదల చేసిన నివేదికలో పలు ఆందోళనకర అంశాలు వెలుగుచూశాయి. హైదరాబాద్‌తో సహా మరో పది నగరాలు, పట్టణాల్లో కాలుష్య తీవ్రతను అధ్యయనం చేసినట్లు పర్యావరణవేత్తలు తెలిపారు.

గతేడాది నవంబర్‌లో వాయుకాలుష్య తీవ్రత (పీఎం 10) 117 యూనిట్లుగా నమోదైందని, సాధారణం కంటే 17 శాతం అధికమని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఓ) నిర్ధేశించిన దానికంటే మూడు రెట్లు అధికంగా ఉందని, పలు అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని, చిన్న పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఈ నివేదిక స్పష్టం చేసింది.

నాలుగేళ్ళల్లో భారీగా పెరిగిన విషపు కణాలు : సూక్ష్మ, ధూళి కణాలు సంఖ్య గణనీయంగా పెరిగిందని, 11 మిల్లీ గ్రాముల స్థాయికి చేరుకుందని, చెత్తను కాల్చడంతో పాటు వాహనాల నుంచి వెలువడే పొగ, భవన నిర్మాణాల వల్ల 40 రకాల ధూళి కణాలు విడుదలవుతున్నాయని, గాలిలో సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ తదితర కాలుష్య కారకాలు ఎక్కువ మోతాదులో ఉంటున్నాయని నివేదిక పేర్కొనింది.

వాయు కాలుష్యం కారణంగా శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయని, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) నిర్ధేశిత పరిమితి ప్రకారం ఘనపు మీటరుకు సగటున 60 మైక్రో గ్రాములకు మించరాదనే నిబంధన ఉన్నా హైదరాబాద్‌లో మాత్రం ఎక్కువే ఉన్నట్లు తేలింది. కేంద్ర పిసిబి లెక్కల ప్రకారం ఛండీఘర్‌లో వాయుకాలుష్యం 123 మైక్రోగ్రాములుగా ఉందని, 118 మైక్రోగ్రాములతో ఢిల్లీ రెండవ స్థానంలో ఉండగా హైదరాబాద్ నగరం 78 మైక్రో గ్రాములతో 13వ స్థానంలో ఉందని తేలింది.

నిబంధనలకు నీళ్ళు....

కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పాటించాల్సిన అనేక పరిశ్రమలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, నీరు, నేల సైతం విషంగా మారుతున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు పరిశమలు వ్యర్థాలను, రసాయనాలను శుద్ధి చేయకుండానే బయటకు వదలడం వల్ల దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని, ఫలితంగా భూగర్భ జలం సాధారణ అవసరాలకు పనికిరావడంలేదని, వ్యవసాయభూములు సాగుకు యోగ్యం కాకుండా పోతున్నాయని శాస్త్రవేత్తలు తేల్చారు.



ప్రశాంతంగా ముగిసిన టిఆర్‌టి పరీక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామక పరీక్షలు (టిఆర్‌టి) ఆదివారంతో ముగిశాయి. గత నెల 24 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు మొత్తం 48 సెషన్లుగా జరిగాయి. ఈ పరీక్షల్లో మూడు మినహా అన్నింటినీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆన్‌లైన్ విధానం (సిబిఆర్‌టి)లో నిర్వహించింది. 8,792 పోస్టులకు సుమారు 2.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఎనిమిది రోజుల పాటు జరిగిన ఈ పరీక్షలకు 90 శాతం మంది హాజరైనట్లు కమిషన్ పేర్కొనింది. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ' రెండు వారాలలో విడుదలయ్యే అవకాశం ఉంది. కాగా, ఒఎంఆర్ విధానంలో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్, బయోసైన్స్, మ్యాథమెటిక్స్– తెలుగు మీడియం) పరీక్షలకు 89.18 శాతం హాజరు నమోదైనట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 205 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పిఇటి) ఇంగ్లీష్ మీడియం పరీక్షలు 65.10 శాతం హాజరు నమోదైనట్లు తెలిపింది. టిఆర్‌టి పరీక్షలు నిర్వహణకు సహకరించిన జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఛీఫ్ సూపరింటెండెంట్లు, పరీక్షా కేంద్రాల సిబ్బంది, అధికారులు, పోలీసులు, స్క్వాడ్‌లను టిఎస్‌పిఎస్‌సి అభినందించింది.

సర్పంచ్‌పై కేసు నమోదు

మన తెలంగాణ/ బోనకల్ : ఫీల్డ్ అసిస్టెంట్‌ను లైంగికంగా వేధించినందుకు సర్పంచ్‌పై కేసు నమోదైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా బొనకల్ మండలంలోని గోవిందాపురం(ఎ) సర్పంచ్ గండమాల చుక్కారావుపై కేసు నమోదైంది. గోవిందాపురం (ఎ) ఫీల్డ్ అసిస్టెంట్ అంజమ్మ ఉపాధి హామీ పనుల తీర్మానాలపై సంతకాల కోసం గత కొన్ని రోజులుగా సర్పంచ్ ఇంటి చుట్టూ తిరుగుతుండగా సంతకాలు చేసేందుకు జాప్యం చేస్తూ తన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటికి రావాలని ఫోన్ చేశాడు. ఇంటికి రాగానే లైంగిక దాడికి ప్రయత్నించటంతో అక్కడ నుంచి తప్పించుకుని వెళ్లి పెద్దలకు చెప్పగా పెద్దలు నుంచి స్పందన లేకపోవటంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

మన తెలంగాణ/కట్టంగూర్ : ప్రమాదవశాత్తు కాలుజారి, చింతచెట్టు పై నుంచి కిందపడి, ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని కురుమర్తి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం కురుమర్తి గ్రామానికి చెందిన తన్నీరు రామస్వామి గ్రామశివారులోని తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. రామస్వామి చింతచెట్టు ఎక్కి, చింతపండు కోస్తుండగా కాలు జారి, కిందపడి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొడుకు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.రంజిత్ తెలిపారు.

మాజీ కార్పొరేటర్‌పై హత్యాయత్నం



మన తెలంగాణ / పంజాగుట్ట : ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ షేక్ షరీఫ్‌పై ముగ్గురు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి పదకొండు గంటల సమయంలో తాను ఓ కార్యక్రమానికి తన మిత్రుడుతో హాజరై ఇంటికి వస్తున్న సమయంలో స్థానికంగా ఉండే కరీంతో పాటు అతని కుమారుడు అలీం, అతని స్నేహితుడు ముగ్గురు ద్విచక్ర వాహనాన్ని అడ్డుకొని తనపై అకారణంగా కత్తితో దాడికి పాల్పడ్డారని, తాను తప్పించుకున్నానని షరీఫ్ తెలిపారు. దాడి అనంతరం షరీఫ్ దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కాగా, షరీఫ్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అని సికింద్రాబాద్ మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, టిఆర్‌ఎస్ ఖైరతాబాద్ పార్టీ ఇంచార్జ్ మన్నే గోవర్ధన్ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు ముప్పు భిక్షపతిలతో పాటు పలు పార్టీల నాయకులు ఖండించారు. దాడికి గురైన షరీఫ్ ఇంటికి వచ్చి ఆయనను పరామర్శించారు.

కారు డెకార్ ఉద్యోగిపై కత్తులతో దాడి

రూ.1.90 లక్షల అపహరణ




మన తెలంగాణ/గోషామహల్ : ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న ఓ వ్యాపారిని చాదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని అగంతకులు కత్తులతో దాడి చేసి గాయపర్చారు.చేతిలోని నగదు గల బ్యాగుతో పరారయ్యారు. ఈ సంఘటన నగరంలోని అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి సు మారు 11:30 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పిజి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆజంపురా ప్రాంతానికి చెందిన యూసుఫ్‌షరీఫ్ రాంకోఠి లో డ్రైవ్‌జోన్ పేరిట కార్ డెకరేషన్ షాపు నిర్వహిస్తున్నాడు. వరుసకు సోదరుడైన సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన ముబషీర్(38) యూసుఫ్ షరీఫ్ వద్ద గత కొ ంత కాలంగా కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం వివిధ ప్రాంతాల్లో కలెక్షన్ చేసిన రూ.1.90లక్షలు నగదును బ్యాగులో పెట్టుకుని ద్విచ క్ర వాహనంపై ఆజంపురాకు బయలుదేరి చాదర్‌ఘాట్ బ్రిడ్జి పైకి చేరుకోగానే రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ముగ్గురు అగంతలకు అతని ద్విచక్ర వాహనాన్ని నిలిపేశారు. అతని సెల్‌ఫోన్ లాక్కుని, కత్తితో దాడి చేసి, గాయపర్చి నగదు బ్యాగుతో పరారయ్యారు.ముబషీర్‌ను చికిత్సల నిమిత్తం మలక్‌పేట్ యశోద ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోడీ, కెసిఆర్‌లతో అభివృద్ధి శూన్యం

వనపర్తి సింహగర్జనలో ఎంఎల్‌ఎ రేవంత్‌రెడ్డి

మన తెలంగాణ/వనపర్తి ప్రతినిధి : కేంద్రంలో ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ, రాష్ట్రంలో సిఎం గా ఉన్న కెసిఆర్‌లతో దేశం, రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి జరగదని కాంగ్రెస్ నాయకులు కొడంగల్ ఎంఎల్‌ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఎఐసిసి కార్యదర్శి, ఎంఎల్‌ఎ డా.జి.చిన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సింహగర్జన బహిరంగ సభకు ఎంఎల్‌ఎ రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మాటల గారడీతో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. దేశానికి యువకుడుడైన రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి ఆయితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టుల్లో అవినీతి ఏరులై పారుతోందని, ప్రాజెక్టుల రీడిజైన్ల పేరుతో అంచనాలను పెంచి దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు.

విమానానికి తప్పిన పెను ప్రమాదం



మన తెలంగాణ/శంషాబాద్ : సిటీ లింక్ ఎయిర్‌లైన్ విమానానికి పెను ప్రమాదం తప్పింది. ఇంధనం ఖాళీ అవడంతో ఆదివారం తెల్లవారు జామున అత్యవసరంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయింది. జెడ్డా నుండి ఇండోనేషియా వెళ్తున్న సిటీ లింక్ ఎయిర్‌వేస్ విమానంలో ఇంధనం అయిపోవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. విమానంలో ఇంధనం నింపుతుండగా ఒక్కసారిగా ఇంధనం లీకైంది. దీంతో సిబ్బంది తక్షణమే రన్‌వే పై పడిన ఇంధనాన్ని ఫైరింజన్లతో క్లీన్ చేశారు. విమానం ఇలాగే టేకాఫ్ అయితే పెను ప్రమాదం జరిగి ఉండేది.

క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యం



▶▶ మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు

మనతెలంగాణ/వరంగల్‌బ్యూరో : వరంగల్‌లో ప్రతిమా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం చేయడం వల్ల ఉత్తర తెలంగాణలోని క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యం అందడంతోపాటు తెలంగాణ, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర ప్రజలకు కూడా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించడానికి ప్రతిమా గ్రూప్స్ ముందుకు రావడం అభినందనీయమని విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఆరెపల్లి క్రాస్‌రోడ్డులో ప్రతిమా గ్రూప్ క్యాన్సర్ రోగులకు అధునాతన వైద్య సేవలందించడానికి ఆస్పత్రి నిర్మాణానికి జరిగిన భూమి పూజ కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మంత్రి చందులాల్, కరీంనగర్ ఎంపి వినోద్‌కుమార్, వరంగల్ ఎంపి దయాకర్‌రావు, ఎంఎల్‌ఎలు ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, కొండా సురేఖ, వినయభాస్కర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రియాదవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ పేద ప్రజలకు, మధ్య తరగతి ప్రజలకు క్యాన్సర్ ఉచిత క్యాంపులు నిర్వహించి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, డాక్టర్ అబ్దుల్ కలాం ఆశయాల మేరకు 2020 వరకు తెలంగాణలో కనీసం వరంగల్ క్యాన్సర్ మహమ్మారిని రూపుమాపే విధంగా యాజమాన్యం వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిమా గ్రూప్స్ డైరెక్టర్లు బోయినపల్లి శ్రీనివాస్ రావు, రమేష్, అవినాష్, రాహుల్ నారాయణ, హరిణి తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌రెడ్డి బినామీలకు సమన్లు జారీ

కరీంనగర్ : మాజీ ఎస్‌ఐ మోహన్ రెడ్డి బినామీలకు ఐటి అధికారులు సమన్లు జారీ చేశారు. బినామీలుగా వ్యవహరిస్తున్న వారికి ఆదాయపన్ను శాఖ అధికారులు సమన్లు జారీ చేశారు. ఆస్తులు ఎలా సమకూర్చుకున్నారో తెలిపాలని ఆదేశించారు. మార్చి 8న ఆధారాలతో హైదరాబాద్ ఆయాకర్ భవన్‌కు రావాలని ఆదేశించారు. మోహన్ రెడ్డికి బినామీలుగా ఉన్నవారికి కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలు సహా హైదరాబాద్‌లోనూ కొందరికీ సమన్లు జారీ చేశారు.

ట్రాఫిక్ జామ్‌తో ఆలస్యంగా పరీక్ష

కరీంనగర్ : తిమ్మాపూర్‌లో మూడు పరీక్ష కేంద్రాలలో టిఆర్‌టి పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. గంటా ఇరవై నిమిషాల పాటు పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ట్రాఫిక్ జామ్‌తో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలు ఆలస్యంగా చేరుకున్నాయి. అభ్యర్థులకు అదనపు సమయం ఇస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలగనూరు చౌరస్తా వద్ద లారీ ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. లారీ ప్రమాదం కారణంగానే ప్రశ్నపత్రాలు ఆలస్యంగా వచ్చాయని అధికారులు గుర్తించారు.

ఉమ్మడి రిజర్వేషన్లకు కాలం చెల్లింది

▶▶ మందకృష్ణ మాదిగ



మన తెలంగాణ /హైదరాబాద్/ ముషీరాబాద్ : దళితుల మధ్య సాంఘిక అసమానతలు ఉన్నాయని ఆనాడే అంబేద్కర్ అన్నారని, రాజ్యాంగంపై ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవు కాని అంబేద్కర్ రాసిన ఉమ్మడి రిజర్వేషన్లకు కాలం చెల్లిపోయిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఉద్యమాన్ని బలపర్చుతూ ఎమ్మార్పీఎస్ పై రాజ్య నిర్భంధానికి వ్యతిరేకంగా పోరాడుదామంటూ సభ జరిగింది. విరసం నేత, ప్రొఫెసర్ కాశీం అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా మంద కృష్ణ మాదిగ, విరసం నేత వరవరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ ప్రసంగిస్తూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఎన్నో చట్టాలను సవరణ చేశారని, మరెన్నిటికో ఆర్టికల్ల వెనకాల ఎ, బి అని చేర్చి సవరణ చేశారని, కానీ రాజ్యాంగంలో ఉమ్మడి రిజర్వేషన్ల విధానాన్ని సవరణ ఎందుకు చేయడంలేదని, సవరణ చేసి నూతన చట్టాలను ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. వరవరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఏ రాజకీయ పార్టీ కూడా అనలేదని, అలా అంటే ఏ రాజకీయ పార్టీకి మనుగడ ఉండదన్నారు. న్యాయమైన డిమాండ్లను రాజ్యం అడ్డుకుంటుందని విమర్శించారు. ఈ నెల 13న జరిగే రాష్ట్ర వ్యాప్త బంద్‌కు మావోయిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషన్ ఒక ప్రకటనలో తెలిపారని వరవరరావు గుర్తు చేశారు. ఈ సభలో రత్నమాల, గీతాంజలి పాల్గొన్నారు.

సహజ వనరులను కొల్లగొడుతున్న ప్రభుత్వాలు

▶▶ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ




మన తెలంగాణ/జనగాం ప్రతినిధి: ధనిక రాష్ట్రంగా చెప్పుకుంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చుతున్నారని, మిషన్ భగీరథ పేరుతో 90వేల కోట్ల రూపాయల అప్పులు చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ఆదివారం జనగామ జిల్లా సిపిఐ ద్వితీయ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని చౌరస్తా నుంచి సిపిఐ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహజ వనరులను కొల్లగొడుతున్నాయన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రధాని మోడి నల్లధనాన్ని బయటకు తీసుకువస్తానని చెప్పి నాలుగు సంవత్సరాలు గడుస్తుందని, దేశంలో వేల కోట్లతో బ్యాంకులను మోసం చేసినా విజయ్ మాల్యా, నీరవ్ మోడిలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రధాని మోడి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకపోతే కెసిఆర్‌ను ఇంటి బాట పట్టిస్తామని హెచ్చరించారు. బంగారు తెలంగాణ కాదు అప్పుల తెలంగాణగా మారుస్తున్నారన్నారు. సామాజిక తెలంగాణ కోసం వామపక్షాలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 10న హైదరాబాద్‌లో అన్ని ప్రజాసంఘాలతో మిలీనియం మార్చ్ నిర్వహించి ప్రభుత్వాలకు కనువిప్పు కలిగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిహెచ్. రాజారెడ్డి, పాకూరి సుగుణమ్మ పాల్గొన్నారు.

మావోయిస్టు అగ్రనేత ప్రభాకర్‌కు కన్నీటి వీడ్కోలు



మన తెలంగాణ/కాజీపేట : మావోయిస్టు పార్టీ అగ్రనేత దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం తెలంగాణ ఛత్తీస్‌గడ్ సరిహద్దులోని తడపలగుట్ట, పూజారి కాంకేడ్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రభాకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ప్రభాకర్ స్వగ్రామమైన వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం రాంపేటలో ప్రజలతోపాటు ప్రజాసంఘాల నాయకులు, బంధుమిత్రుల కమిటీ నేతలు, పౌరహక్కుల నాయకులు తరలి వచ్చారు. ప్రజలు ప్రభాకర్‌కు అశ్రునయనాల నడుమ వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలంతా ఎర్రజెండాలతో రాంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఉన్నత చదువులు చదివి పోరుబాట పట్టిన అంచలంచెలుగా ఎదిగి నేలకొరిగిన దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ ఎన్‌కౌంటర్‌తోపాటు ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతికి కారకులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక నాయకుడు చిక్కుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. చట్టప్రకారం ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు అప్పగించాలని ఆయన అన్నారు.

అప్పుల బాధతో ముగ్గురు రైతుల ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నాగేశ్వర్, కుదరు భద్రయ్య, మహేష్

మన తెలంగాణ/సంగారెడ్డి టౌన్ : వ్యవసాయంలో నష్టాలు, అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం పొట్టిపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వర్ (42) తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో 20 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. పత్తి దిగుబడి సరిగ్గా రాకపోవడం, చేసిన అప్పులు తీవ్రం కావడంతో మనస్థాపానికి గురైన నాగేశ్వర్ శనివారం సాయంత్రం పొలానికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాపోయేసరికి అతని భార్య నాగేంద్రమ్మ పొలంతో వెతకగా శవంలభ్యమైంది. శవం పక్కన పురుగుల మందు ఖాళీ డబ్బా దొరికింది. దీంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య నాగేంద్రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉరేసుకుని...

మనతెలంగాణ/జమ్మికుంట :అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామపంచాయతీ పరిధిలోని శంభునిపల్లిలో చోటు చేసుకుంది. కుదరు భద్రయ్య (44) బతుకుదెరువు కోసం 10 సంవత్సరాల క్రితం మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామం నుండి జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామపంచాయితీ పరిధిలోని శంభునిపల్లికి కుటుంబంతో కలిసి వలస వచ్చాడు. గ్రామంలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. ఈ క్రమంలో వ్యవసాయంలో పంట దిగుబడికి కోసం పెట్టుబడి 5 లక్షల వరకు అప్పులు చేశాడు. పంట దిగుబడి సరిగా రాలేదు. దీంతో అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కుదరు భద్రయ్య ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

పంట ఎండిపోవడంతో ..

మనతెలంగాణ/ఇల్లంతకుంట : నీరు లేక వేసిన వరి పంట ఎండిపోవడంతో సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కందికట్కూర్ గ్రామానికి చెందిన రాచకొండ మహేష్ (30)అనే యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చేసిన అప్పు ఒక వైపు, పంట ఎండిపోవడం తోడవడంతో శనివారం రాత్రి తన వ్యవసాయ పొలం పక్కనే ఉన్న మామిడి తోటలో ఆత్మహత్య చేసుకున్నాడు.

మృతుడికి ఏడాది క్రితమే వివాహం జరిగింది. ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రైతు కుటుంబానికి రూ20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నక్క మహేష్‌యాదవ్, బిగుళ్ల విజయ్ డిమాండ్ చేశారు.



నీరు అడుగంటిన ప్రాజెక్టు

ఎస్‌ఆర్‌ఎస్‌పి చేరని బాబ్లీ నీరు

సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతరు ఆందోళనలో ఆయకట్టు రైతులు

మన తెలంగాణ / మెండోరా (నిజామాబాద్ జిల్లా): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్చి 1న విడుదల చేసిన 0.048 టిఎంసిల నీరు ఎస్సారెస్పికి చేరుకోలేదు. బాబ్లీ నుండి విడుదల చేసిన నీరు ఇప్పటి వరకు బాసర తీరం వరకే పరిమితమైంది. నీరు అక్కడికక్కడే ఇంకిపోయింది. దీంతో ఎస్సారెస్పీకి ఎలాంటి ప్రయోజనం లేదు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 0.6 టిఎంసిల నీటిని మార్చి 1వ తేదీన బాబ్లీ నుండి కిందికి వదలాల్సిన అధికారులు, మహారాష్ట్ర ప్రాంతాల్లో నిర్మించిన ప్రాజెక్టుల్లో కేవలం 0.04 టిఎంసిల నీటిని మాత్రమే వదిలి చేతులు దులుపుకున్నారు. ధర్మాబాద్ తదితర ప్రాంతాల తాగునీటి అవసరాల సాకును చూపి మహారాష్ట్ర తాగునీటి అధికారులు మనకొచ్చే వాటా మనకు వదలకుండా తక్కువలో తక్కువ మోతాదుకు 0.04 టిఎంసిల నీటిని వదిలాయి. దీంతో ఎస్సారెస్పీకి వస్తాయనుకున్నా ఒక చుక్క రాలేదు. దీంతో ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు, పరిసర గ్రామాల్లో ఎండలు తీవ్రమైతే నీటి ఎద్దడి అధికంగా ఏర్పడే అవకాశముంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా మహారాష్ట్ర కుటిల నీటితో నిర్మించిన తాగునీటి ప్రాజెక్టులు ఎస్సారెస్పీకి గడ్డు పరిస్థితిని తెచ్చిపెట్టాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ స్వచ్ఛమైన ఎస్సారెస్పీ పునరుజ్జీవనం పథకం ప్రారంభమైతే సంతరించుకునే అవకాశాలున్నాయి. కేవలం మహారాష్ట్రపై ఆధారపడితే భవిష్యత్‌లో ఎస్సారెస్పీకి గడ్డుకాలం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి.

మూడో కూటమి.. మరో కొత్త నాటకం

సిఎల్‌పి ఉపనేత జీవన్‌రెడ్డి

మన తెలంగాణ/జగిత్యాల: ఉద్యమ సమయంలో, ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైన ముఖ్యమంత్రి కెసిఆర్ తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే కేంద్రం సహకరించడం లేదం టూ కొత్త పల్లవి అందుకున్నారని సిఎల్‌పి ఉపనేత, జగిత్యాల ఎంఎల్‌ఎ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, గద్దెనెక్కిన కెసిఆర్ ప్రజల ఆశలను వమ్ము చేస్తూ రాచరిక పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్ల టిఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తన తప్పేమి లేదంటూ నిన్నటి వరకు అంటకాగిన ఎన్‌డిఎపై నెపం వేసి చేతులు దులుపుకునే ప్రయ త్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు రూ.21 వేల కోట్లు మురిగిపోయాయని, గిరిజనులకు జనాభా ప్రాతిపదికన దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా పోయాయని, ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మొండి చేయి చూపారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.69 వేల కోట్ల అప్పుల వాటా ఉంటే 2017 మార్చి నాటికి రాష్ట్ర అప్పులు రూ.1.35 లక్షల కోట్లకు చేరిందని, ఈ ఏడాదిలో అది 2 లక్షల కోట్లకు చేరు కుందన్నారు.

బిసి బిల్లుకు మద్దతివ్వండి

మన తెలంగాణ/హైదరాబాద్ : పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లుపై తమ గళాన్ని వినిపించాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు.ఈ మేరకు రాష్ట్రానికి చెందిన 16 మంది ఎంపిలకు బహిరంగ లేఖరాసినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బిసిల గురించి మాట్లాడకపోతే వచ్చే ఎన్నికల్లో బిసి ఓట్లను అడిగే నైతిక హక్కు కోల్పోతారని హెచ్చరించారు. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. సిఎం కెసిఆర్ తమ పార్టీ ఎంపిలతో జరిపిన సమావేశంలో బిసి బిల్లు ప్రస్తావన లేకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు.

జయ సమాధి వద్ద కానిస్టేబుల్ ఆత్మహత్య

చెన్నై : మెరీనా బీచ్‌లోని జయలలిత సమాధి దగ్గర విషాదం చోటుచేసుకుంది. మధురైకు చెందిన ఎమ్ అరుణరాజ్ అనే కానిస్టేబుల్ తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలంలోనే అతను చనిపోయినట్లు తెలుస్తోంది. మృత దేహాన్ని దగ్గర్లోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఉన్నతాధికారులు తెలిపారు.

పూజాహెగ్డేకు లక్కీ ఆఫర్



'బాహుబలి' వంటి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ అనంతరం ప్రభాస్ చేస్తున్న సినిమా 'సాహో'. భారీ బడ్జెట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా తర్వాత ప్రభాస్ 'జిల్' డైరెక్టర్ రాధాకృష్ణతో ఓ సినిమా చేయబోతున్నాడు. ఈ సినిమాలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటించనుందని సమాచారం. త్వరలో ఈ హీరోయిన్ పేరును అధికారికంగా ప్రకటించబోతున్నారు. ముందుగా బాలీవుడ్ హీరోయిన్ ఈ సినిమాలో నటిస్తుందనే టాక్ వినిపించినా చివరికి ఈ లక్కీ ఆఫర్‌ను పూజాహెగ్డే దక్కించుకుంది. ఏప్రిల్ నుండి ఈ సినిమా షూటింగ్ ప్రారంభంకానుంది. గోపీకృష్ణ మూవీస్ బ్యానర్‌పై కృష్ణంరాజు ఈ సినిమాను నిర్మిస్తారు. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హిట్ కాంబినేషన్‌లో శ్రీనివాస కళ్యాణం ప్రారంభం



నితిన్, రాశీఖన్నా

శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 14 ఏళ్ల క్రితం హిట్ చిత్రాల నిర్మాత దిల్‌రాజు, యువ హీరో నితిన్ కాంబినేషన్‌లో వచ్చిన 'దిల్' సినిమా ఎంత సెన్సేషనల్ హిట్ అయ్యిందో తెలిసిందే. అటువంటి సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'శ్రీనివాస కళ్యాణం'. జాతీయ అవార్డును అందుకున్న 'శతమానం భవతి' సినిమా దర్శకుడు సతీష్ వేగేశ్న ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాల్లో అల్లు అరవింద్ క్లాప్‌కొట్టగా... ప్రముఖ ఫైనాన్షియర్ సత్య రంగయ్య కుమారుడు ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. వంశీ పైడిపల్లి గౌరవ దర్శకత్వం వహించారు. నితిన్ సరసన రాశీ ఖన్నా, నందిత శ్వేత హీరోయిన్లుగా నటిస్తుండగా ప్రకాష్‌రాజ్, రాజేంద్రప్రసాద్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈనెల 16 నుండి ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. తొలి షెడ్యూల్ ఈనెల 30 వరకు జరుగుతుంది. జూన్‌కల్లా సినిమా చిత్రీకరణతో పాటు నిర్మాణానంతర కార్యక్రమాలను కూడా పూర్తిచేయనున్నారు. జూలై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో ఈ సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నామని సినిమా యూనిట్ తెలియజేసింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సమీర్ రెడ్డి, సంగీతంః మిక్కీ జె.మేయర్, ఎడిటింగ్ః మధు, ఆర్ట్ః రామాంజనేయులు.



శ్రీదేవి సంతాప సభలో మాట్లాడుతున్న టి.సుబ్బరామిరెడ్డి. వేదికపై జయప్రద, జయసుధ, అమల, పింకీ రెడ్డి, జీవిత, కృష్ణంరాజు, జగపతిబాబు, రాజశేఖర్, బాబుమోహన్, సి.కళ్యాణ్, కోట శ్రీనివాసరావు, బివిఎస్ఎన్ ప్రసాద్, పరుచూరి గోపాలకృష్ణ

భారతదేశం గర్వించదగ్గ గొప్ప నటి శ్రీదేవి

''జీవితంలోని ప్రతి అడుగులోనూ శ్రీదేవికి ఒక లక్ష్యం ఉండేది. ప్రతి మలుపును ఆమె ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నారు''అని జయప్రద అన్నారు. సినీ నిర్మాత, పార్లమెంట్ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో లెజెండరీ తార శ్రీదేవి సంతాప సభ హైదరాబాద్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో జయప్రదతో పాటు జయసుధ, రామ్‌చరణ్ సతీమణి ఉపాసన, పింకీ రెడ్డి, అమల, జీవిత, పి.సుశీల, కవిత, కోటశ్రీనివాసరావు, అలీ, పరుచూరి గోపాలకృష్ణ, కృష్ణంరాజు, జగపతిబాబు, శ్రీకాంత్, రాజశేఖర్, బాబుమోహన్, సుమంత్, అల్లు అరవింద్, సి.కళ్యాణ్, బివిఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొని శ్రీదేవి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయప్రద మాట్లాడుతూ ''శ్రీదేవి హఠాన్మరణంతో నేనెంతో బాధపడ్డాను. ఆమె చిత్ర పరిశ్రమలో గొప్ప తారగా వెలిగి ప్రేక్షకులను అలరించారు. శ్రీదేవి, నేను కలిసి దాదాపు 15 చిత్రాల్లో కలిసి పనిచేశాము. ప్రతి సినిమాలో మేము పోటీపడి నటించాము. శ్రీదేవి ఈరోజు నిజంగానే లేరంటే నమ్మలేకపోతున్నాను''అని అన్నారు. జయసుధ మాట్లాడుతూ ''చెన్నైలో శ్రీదేవి ఇంటి సమీపంలోనే మా ఇల్లు ఉండేది. ఆమె బాలనటిగా నటిస్తున్న రోజుల్లోనే ఆమె ఆటోగ్రాఫ్‌ను నేను తీసుకున్నాను. శ్రీదేవితో కలిసి నేను 11 సినిమాల్లో నటించడం జరిగింది. ఆమెతో కలిసి పనిచేయడం మరచిపోలేని అనుభవానిచ్చింది''అని పేర్కొన్నారు. కృష్ణంరాజు మాట్లాడుతూ ''శ్రీదేవితో కలిసి నేను నాలుగు సినిమాల్లో నటించాను. సౌత్ నుంచి బాలీవుడ్‌కు వెళ్లి స్టార్ హీరోయిన్‌గా రాణించిన శ్రీదేవి ప్రేక్షకులను మెప్పించారు''అని అన్నారు. టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ''భారతదేశం గర్వించదగ్గ గొప్ప నటి శ్రీదేవి. నేను నిర్వహించిన సినీ ఫంక్షన్లకు ఎప్పుడు పిలిచినా ఆమె వచ్చేవారు. తెలుగు తార శ్రీదేవి బాలీవుడ్‌లో తిరుగులేని కథానాయికగా రాణించడం ఎంతో గొప్ప విషయం. ఆమె మరణంతో భారతదేశ చిత్ర పరిశ్రమ ఓ గొప్ప నటిని కోల్పోయింది''అని తెలిపారు. రాజశేఖర్ మాట్లాడుతూ ''శ్రీదేవి తండ్రి, మా నాన్న ఇద్దరూ మంచి స్నేహితులు. నా పెళ్లికి కూడా ఆమె వచ్చారు. అలాంటి శ్రీదేవి మరణించిందని తెలియడంతో చాలా షాక్‌కు గురయ్యాను. ఆమెతో ఓ సినిమా చేయాలనుకున్నాను కానీ కుదరలేదు''అని చెప్పారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''శ్రీదేవి లేరు అనుకోవడం పొరపాటు. ఆమె చిరస్థాయిగా అందరి మనసుల్లో నిలిచిపోయారు. శ్రీదేవి నిర్మాతలను, దర్శకులను ఒక్క రోజు కూడా నొప్పించలేదు. ఆమెతో నిర్మాతగా ఓ సినిమా చేయాలనేది నా కోరిక. కానీ అది నెరవేరలేదు''అని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు శ్రీదేవితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని... ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.





'గీతాంజలి'ని గుర్తుకుతెచ్చిన 'పరిచయం' టీజర్

అసిన్ మూవీ క్రియేషన్స్ పతాకంపై హైదరాబాద్ నవాబ్స్ మూవీ ఫేమ్ లక్ష్మీకాంత్ చెన్నా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పరిచయం'. విరాట్ కొండూరి హీరోగా పరిచయమవుతున్న ఈ సినిమాలో సిమ్రత్ కౌర్ హీరోయిన్. ఈ చిత్రం టీజర్, ఫస్ట్‌లుక్‌ని నాని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ''ఈ చిత్రం టీజర్ చాలా ఫ్రెష్‌గా ఉంది. దీన్ని చూస్తుంటే మణిరత్నం 'గీతాంజలి' మూవీ గుర్తుకువస్తోంది. హీరోహీరోయిన్‌లు ఈ కథకు సరిగ్గా సరిపోయారు. ఈ చిత్రం మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. చిత్ర నిర్మాత రియాజ్ మాట్లాడుతూ ''షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్‌లో ఉంది. ఏప్రిల్ మొదటి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని చెప్పారు. దర్శకుడు లక్ష్మీకాంత్ చెన్నా మాట్లాడుతూ ''నాని మా సినిమా టీజర్‌ను విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. లవ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో అన్ని రకాల భావోద్వేగాలు ఉంటాయి''అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః నరేష్ రానా, మ్యూజిక్ః శేఖర్‌చంద్ర, పాటలుః భాస్కరభట్ల, వనమాలి, శ్రీమణి, డైలాగ్స్ః సాగర్, ఫైట్స్ః రామకృష్ణ.



'పరిచయం' టీజర్‌ను విడుదల చేస్తున్న నాని. చిత్రంలో విరాట్ కొండూరి, లక్ష్మీకాంత్ చెన్నా, శేఖర్‌చంద్ర.

అల్లరి నరేష్ 55వ సినిమా షురూ

కామెడీ స్టార్ అల్లరి నరేష్, నిర్మాత అనిల్ సుంకర కాంబినేషన్‌లో వచ్చిన అహ నా పెళ్లంట, యాక్షన్ 3డి, జేమ్స్‌బాండ్ చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. ఈ హ్యాట్రిక్ హిట్ అనంతరం ఈ హిట్ కాంబినేషన్‌లో నాలుగవ చిత్రం రానుంది. ఎటివి సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మాణ సారథ్యంలో 'నందిని నర్సింగ్ హోమ్' చిత్రంతో దర్శకుడిగా తన అభిరుచిని చాటుకున్న పి.వి.గిరి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సినిమా అల్లరి నరేష్ నటిస్తున్న 55వ సినిమా కాగా... నిర్మాణ సంస్థ ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు 15వ చిత్రమిది. ఈ చిత్రానికి కెమెరాః నగేష్, కళః గాంధీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ః కిషోర్ గరికపాటి.



లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



కావ్య థాపర్, రాహుల్

ఫైట్‌మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ హీరోగా వి.ఎస్. క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. రాము కొప్పుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దివ్య విజయ్ నిర్మాత. ఈ చిత్రం టాకీపార్ట్‌ను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాము కొప్పుల మాట్లాడుతూ ''సినిమా టాకీ పార్ట్ అంతా అనుకున్న విధంగా పూర్తయింది. సినిమా చాలా బాగా వచ్చింది. నిర్మాణంలో ఎక్కడా రాజీపడలేదు. రాహుల్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే కథ ఇది. తన క్యారెక్టర్‌లో అతను అద్భుతంగా నటించారు''అని అన్నారు. నిర్మాత దివ్య విజయ్ మాట్లాడుతూ '' ఈ చిత్రంలో రాహుల్‌ను దర్శకుడు రాము చక్కగా చూపించారు. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా అందరినీ మెప్పించేలా ఉంటుంది. రాహుల్, కావ్య థాపర్ జోడి స్క్రీన్‌పై చక్కగా ఉంటుంది. మణిశర్మ అద్భుతమైన బాణీలను అందించారు. అలాగే శ్యామ్ కె.నాయుడు సినిమాటోగ్రఫీ సినిమాకు మరో ఆకర్షణగా ఉంటుంది. టాకీ పార్ట్ పూర్తయిన ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు త్వరలో ప్రారంభంకానున్నాయి''అని తెలిపారు. రాజేంద్రప్రసాద్, మురళీశర్మ, పవిత్ర లోకేష్, పోసాని కృష్ణమురళి, ఈశ్వరీరావు, రాళ్లపల్లి, సత్యం రాజేష్, జోష్ రవి తదితరులు నటించిన ఈ చిత్రానికి ఎడిటింగ్ః నవీన్ నూలి, ఫైట్స్ః విజయ్, ఆర్ట్ః చిన్న, సాహిత్యంః శ్రీమణి.

చాలా త్యాగాలు చేస్తున్నాము



తమన్నా

సినీ రంగం అంటే అందరూ అనుకున్నంత సులవైనది ఏమీ కాదని అంటోంది తమన్నా. నటీనటులుగా తాము పడే కష్టాలు జనాలకు తెలియవని ఆమె చెబుతోంది. సినీ తారల జీవితం ఆడంబరంగా కనిపిస్తుంది కానీ... అందులో ఆనందం తక్కువని వాపోయింది. తమన్నా మాట్లాడుతూ ''కోరుకున్నది చేసే స్వాతంత్ర్యం సినీ తారలకు చాలా తక్కువ. నటీనటులు ఎవరూ పరిపూర్ణమైన సంతోషాన్ని చవిచూడలేరు. పగలనక, రాత్రనకా, విశ్రాంతి లేకుండా మేము శ్రమిస్తుంటాము. షూటింగ్ ఎప్పుడు రెడీ అంటే అక్కడ వాలిపోవాల్సిందే. మనసులో ఎలాంటి కష్టాలున్నా అవి బయటకు కనిపించకుండా నటించాల్సిందే. సొంత పనులకు సమయం కేటాయించలేకపోతున్నాము. కుటుంబంతో కలిసి గడిపేందుకు సమయం చాలా తక్కువ ఉంటుంది''అని పేర్కొంది. ''ఎప్పుడూ ఫిజిక్ మెయింటేన్ చేయాలి కాబట్టి నచ్చిన ఆహారాన్ని సినీ తారలు తినలేరు. బయట స్వేచ్ఛగా తిరిగే అవకాశం కూడా మాకు ఉండదు. బయట మామూలు అమ్మాయిలను చూస్తే బాధ కలుగుతుంది. అయితే మా జీవితంలో అసలు సంతోషమే లేదని అనడం లేదు. కానీ మేము చాలా త్యాగాలు చేస్తున్నామన్న విషయాన్ని జనాలు గ్రహించాలి''అని తమన్నా చెప్పింది.



శ్రీప్రియ, అమృత అయ్యర్, సాయి రోనక్, ఛరిష్మా శ్రీకర్ తదితరులు

ఎలాంటి సంఘర్షణను ఎదుర్కొన్నారు?

ప్రపంచంలోనే తొలిసారి హోమ్ థియేటర్ ద్వారా విడుదలకానున్న సినిమా మాదే అని అన్నారు నిర్మాత వీరశంకర్. వి.ఎన్.ఆదిత్య దర్శకత్వంలో 'అలా నేను ఇలా నువ్వు' చిత్రాన్ని ఆయన నిర్మిస్తున్నారు. రాజ్ కందుకూరి సమర్పిస్తున్న ఈ చిత్రంలో సాయిరోనక్, అమృత అయ్యర్, ఛరిష్మా శ్రీకర్, శ్రీప్రియ ప్రధాన పాత్రధారులు. హైదరాబాద్‌లో ఈ సినిమాను ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో శ్రీకాంత్ క్లాప్‌నిచ్చారు. 'మా' అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచ్చాన్ చేశారు. సీనియర్ దర్శకుడు బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో నిర్మాత వీరశంకర్ మాట్లాడుతూ ''1986–1994 మధ్య జరిగే కథ ఇది. భిన్న సంప్రదాయాల మధ్య పెరిగిన యువతీయువకులు భిన్న అభిరుచులకు ఆకర్షితులవుతారు. చివరికి వారు ఆ అభిరుచుల వల్ల ఎలాంటి సంఘర్షణను ఎదుర్కొన్నారనే ప్రధానాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. రెండు షెడ్యూళ్లలో ఈ సినిమాను పూర్తిచేస్తాం. ఈ చిత్రాన్ని హెచ్‌టిఐ క్లబ్ ద్వారా ప్రపంచంలోని హోమ్ థియేటర్స్‌లో విడుదల చేస్తాం''అని అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంట్లో కూర్చొని సినిమా చూడాలనే ఉద్దేశంతో రూపొందుతున్న ఈ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ ''ఇంతవరకు ఎవరూ చేయని కొత్త ప్రయత్నాన్ని వీరశంకర్ చేస్తున్నందుకు ఆయనకు తోడుగా నిలిచాను. ఇది ప్రేక్షకులను ఆహ్లాదపరిచే సరికొత్త కాన్సెప్ట్''అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తేళ్ల వరప్రసాద్, రేలంగి నరసింహారావు, కాశీవిశ్వనాథ్, దేవిప్రసాద్, సంకల్ప్, ఏడిద శ్రీరామ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణంః సంతోష్ శానమోని, సంగీతంః నిహాల్, పాటలుః వనమాలి.

ఫోర్టిస్‌కు ఎస్ఎఫ్ఐఒ నోటీసులు జారీ

న్యూఢిల్లీ : హెల్త్‌కేర్ దిగ్గజం ఫోర్టిస్‌కు ఎస్ఎఫ్ఐఒ(సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్) నోటీసులు జారీ చేసింది. కంపెనీలో ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలను మార్చి 9లోపు సమర్పించాలని అధికారులు ఆదేశించారు. ఫోర్టిస్ సంస్థలో ఆర్థిక అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ సంస్థ లావాదేవీలపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ దృష్టి సారించింది. కంపెనీ ప్రమోటర్లుగా వ్యవహరించిన మాల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్‌లు బోర్డ్ అనుమతి లేకుండా 78 మిలియన్ డాలర్లను వినియోగించుకున్నట్లు ఆరోపణలు రావడంతో వివాదం తలెత్తింది. దీంతో ఎస్ఎఫ్ఐఒ ఈ వ్యవహారంపై దృష్టిపెట్టింది. ప్రస్తుతం దర్యాప్తు అధికారులకు సమాచారాన్ని అందజేసే పనిలో ఫోర్టిస్ అధికారులు నిమఘ్నమయ్యారు. దీంతోపాటు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కూడా ప్రమోటర్ల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించింది. కాగా బిలియనీర్ నీరవ్ మోడీ వేల కోట్ల కుంభకోణం నేపథ్యంలో ఫోర్టిస్ ప్రమోటర్లు మల్వీందర్ మోహన్ సింగ్, శివిందర్ మోహన్ సింగ్‌లపై ఒత్తిడి పెరిగింది. తాము ఎక్కడికీ పారిపోవడం లేదని, సమస్యను నిజాయితీగా పరిష్కరిస్తామని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ప్రమోటర్లు ఇటీవల వాటాదారులకు అభయమిచ్చారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కంపెనీ బోర్డు నుంచి డైరెక్టర్ల పదవికి వీరిద్దరు రాజీనామా చేశారు.

516 కోట్ల రుణాలు రద్దు

2017-18 ప్రథమార్ధంలో ప్రభుత్వరంగ బ్యాంకుల నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ప్రభుత్వరంగ బ్యాంకులు దాదాపు రూ. 516 కోట్ల విలువచేసే మొండి బకాయిలను రద్దు చేశాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకారం, 2017–18 ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో బ్యాంక్ పుస్తకాల్లో 38 ఉద్దేశపూర్వక రుణాల ఎగవేత ఖాతాలు రద్దు చేశారు. రద్దు అంటే మొండి బకాయిలకు 100 శాతం కేటాయింపులు బ్యాంకులు ఏర్పాటు చేశాయి. ఈ నేపథ్యంలో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) ఇక బ్యాలెన్స్ షీట్లలో కనిపించవు. బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లపై ఈ రద్దుతో ఒత్తిడి నెలకొననుందని.. ఇది ఆపరేటింగ్ లాభాలని తుడిచిపెట్టేస్తుందని అధికారులు అంటున్నారు. రుణాల ఎగవేతదారుల కేసుల్లో రికవరీ చాలా కష్టంగా ఉంది.. కావున భవిష్యత్‌లో తిరిగి చెల్లించే అవకాశాలు చాలా చాలా తక్కువగా ఉన్నాయని సీనియర్ బ్యాంక్ అధికారి ఒకరు అన్నారు. 2017 మార్చి నాటికి పిఎస్‌యు బ్యాంకుల ఉద్దేశపూర్వక ఎగవేతదారుల రుణం మొత్తంలో దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ వాటానే దాదాపు 27 శాతం ఉండడం గమనార్హం. గతేడాది మార్చి ముగింపునాటికి ఎస్‌బిఐలో 1,762 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారులు.. వీరి రుణాల మొత్తం రూ.25,104 కోట్లు ఉంటుం ది. ఆ తర్వాత రెండో స్థానంలో భారీ కుంభకోణంతో సతమతమవుతున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 1,120 మంది ఎగవేతదారులు.. వీరి రుణాల మొత్తం రూ.12,278 కోట్లు ఉన్నాయి. ఈ రెండు బ్యాంకుల మొండిబకాయిల మొత్తం రూ. 37,382 కోట్లు (40 శాతం) కలిగి ఉంటాయి. మొత్తంగా చూస్తే.. పిఎస్‌యు బ్యాంకుల్లో 8,915 మంది ఎగవేతదారులు.. వీరి రుణాలు రూ.92376 కోట్లు ఉన్నాయి.



పిఎన్‌బి ఉద్యోగులకు ముడుపులుగా వజ్రాభరణాలు



పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో నీరవ్ మోడీ రూ.12,700 కోట్ల భారీ కుంభకోణం కేసులో ఎన్నో విషయాలు ఒక్కొక్కడిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా 2 బిలియన్ డాలర్ల బ్యాంక్ మోసం కేసులో డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ నుంచి లంచం రూపంలో బంగారం, వజ్రాల నగలను పిఎన్‌బికి చెందిన అధికారి అందుకున్నారని తెలిసింది. అక్రమంగా ఎల్ఓయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) ద్వారా విదేశీ బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణాలను నీరవ్ పొందాడన్నది తెలిసిందే. రుణాలు పొందేందుకు నీరవ్ మోడీ బ్యాంకు ఉద్యోగులకు భారీ స్థాయిలో ముడుపులు ఇచ్చినట్లు సిబిఐ అధికారులు ముంబయి కోర్టుకు తెలియజేశారు. పిఎన్‌బి ముంబై బ్రాంచ్‌లో ఫారెక్స్ డిపార్ట్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న యశ్వంత్ జోషికి నీరవ్ నుంచి 60గ్రాముల బరువు ఉండే రెండు బంగారు నాణెలతో పాటు, బంగారు, వజ్రాభరణాలు కూడా ముట్టినట్లు సిబిఐ అధికారులు తెలిపారు. జోషితో పాటు మరికొంతమందిని ముంబయి కోర్టు జ్యాడిషియల్ కస్టడీకి సిబిఐ అప్పగించింది. అయితే బంగార నగలను జోషి నుంచి తిరిగి స్వాధీనం సిబిఐ తెలిపింది.

మరింత అప్రమత్తంగా బ్యాంకులు

దేశీయ బ్యాంకింగ్ చరిత్రలోనే పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో నీరవ్ మోడీ రూ.12,700 కోట్ల మోసం అతిపెద్దది.. ఈ మోసం నేపథ్యంలో బ్యాంక్‌లు చాలా జాగ్రత్త వహిస్తున్నాయి. పిఎన్‌బి స్కామ్ వ్యాపార రుణాలపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది. ఎల్ఓయు (లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్) అంటేనే బ్యాంకులు భయపడుతున్నాయి. ఎందుకంటే నీరవ్ మోడీ చేసిన మోసం ఎల్ఓయు ద్వారానే కాబట్టి.. దీంతో విదేశీ బ్రాంచ్‌లలో ఎల్ఓయు ద్వారా రుణాలను పొందడం చాలా క్లిష్టంగా మారిందని, తాజాగా కుంభకోణం తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రభుత్వరంగ బ్యాంక్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి అన్నారు. ప్రైవేటు రంగ బ్యాంకులు కూడా చాలా అప్రమత్తంగా ఉంటున్నాయి. రుణాలను మంజూరు చేసే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. అయితే దీనివల్ల నిజాయితీపరులైన వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అధికారులు అంటున్నారు. నీరవ్ మోడీ, ఆయన భాగస్వామి మెహుల్ చోక్సీలు రూ.12,700 కోట్ల భారీ కుంభకోణం కేసులో పేపర్ తనిఖీలు, సెక్యూరిటీలు లేకుండా ఎల్ఓయులను జారీ చేయడం.. దీని ద్వారా వేలాది కోట్లకు కుచ్చుటోపీ పెట్టడం జరిపోయాయి. అందువల్ల ఇటువంటి విషయాల్లో బ్యాంకులు మరింత అప్రమత్తంగా ఉండాలని నిర్ణయించాయి.

ఆస్తుల విక్రయంపై ఎన్‌సిఎల్‌టి ఆంక్షలు

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.12,700 కోట్ల మోసం కేసుపై వివిధ ఏజెన్సీలు దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో నీరవ్ మోడీ, మెహుల్ చోక్సి, పలువురికి చెందిన 60 సంస్థల ఆస్తుల విక్రయంపై ఎన్‌సిఎల్‌టి (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) ఆంక్షలు విధించింది. మోసం కేసులో ప్రధాన నిందితులు నీరవ్ మోడీ, చోక్సీలు. అలాగే వారి సంస్థలు, వారి బంధువులకు చెందిన సంస్థలపై ఎన్‌సిఎల్‌టి ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ ప్రకటన చేసింది. కంపెనీ చట్టం–2013లోని వివిధ సెక్షన్ల కింద మంత్రిత్వశాఖ దాఖలు చేసిన పిటిషన్ మేరకు ఈ ఆదేశాలు చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్న వివిధ కంపెనీలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆస్తులకు సంబంధించి మంత్రిత్వశాఖ పిటిషన్ దాఖలు చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసం కేసులో నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలతో పాటు వివిధ కంపెనీలు, పలువురికి చెందిన 64 సంస్థలపై ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆంక్షలు విధించిన కంపెనీల్లో గీతాంజలి జెమ్స్, గిల్లి ఇండియా, నక్షత్ర బ్రాండ్స్, ఫైర్‌స్టార్ డైమండ్ ఉన్నాయి. అలాగే సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్ వంటి భాగస్వామ్య సంస్థలు కూడా ఉన్నాయి.

హాంకాంగ్‌లో నీరవ్ మోడీ : ఇడి



వేల కోట్ల రుణాలను ఎగవేసి విదేశాలకు పారిపోయిన డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ హాంకాంగ్‌లో ఉన్నట్టు ఇడి(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారులు అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని ముంబైలోని పిఎంఎల్‌ఎ ప్రత్యేక న్యాయస్థానానికి తెలిపిన అధికారులు.. నీరవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేయాలని కోరారు. విచారణకు హాజరుకావాల్సిందిగా ఇడి పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ.. ఫలితం లేకపోవడంతో ఇడి పిఎంఎల్‌ఎలో పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారించిన స్పెషల్ జడ్జి ఎంఎస్ ఆజ్మి.. నీరవ్, ఆయన వ్యాపార భాగస్వామి మెహుల్ ఛోక్సీలపై నాన్ బెయిలబుల్ వారెంట్లను జారీ చేశారు. గతంలో నీరవ్ న్యూయార్క్‌లో ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఆయన ఎక్కడ ఉన్నాడనేది మాత్రం ఇప్పటికీ స్పష్టంగా తెలియడం లేదు. అయితే ప్రస్తుతం హాంకాంగ్‌లో ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నీరవ్ జాడ కోసం విచారణను మరింత వేగవంతం చేశారు.



స్టీలుకు మంచి రోజులు


వచ్చే త్రైమాసికాల్లో ఫలితాలు బాగుంటాయ్: నిపుణులు

న్యూఢిల్లీ: దేశీయంగా దిగుమతులు నియంత్రించినా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్టీల్‌పై సుంకం పెంచినా.. భవిష్యత్ మాత్రం స్టీలు రంగానికి అనుకూలంగా ఉందని నిపుణులు అంటున్నారు. కొద్ది సంవత్సరాలు స్టీలు కంపెనీలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అయితే రానున్న రోజుల్లో స్టీలు పరిశ్రమ బాగుండనుందని, నాలుగో త్రైమాసిక ఫలితాల్లో స్టీలు పరిశ్రమలు మంచి లాభాలను అందించనున్నాయని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా స్టీల్ పరిశ్రమ పుంజుకుంటుండగా, చైనాలో ఉత్పత్తి తగ్గిందని ఈ అంశాలు దేశీయ కంపెనీలకు సానుకూలమని వారంటున్నారు. మూడో త్రైమాసికంలో టాటాస్టీల్, ఎఎస్‌డబ్ల్యు స్టీల్ మంచి ఫలితాలు ప్రకటించాయి. జెఎస్‌పిఎల్, సెయిల్ కూడా పుంజుకున్నాయి. మైనింగ్ కంపెనీలైన ఎన్ఎండిసి లాంటివి మంచి ప్రదర్శన చూపాయి. ఈ తరహా వృద్ధి ఇకపై కొనసాగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఇండియా రేటింగ్స్ ఇటీవల దేశీయ స్టీల్‌రంగ అవుట్‌లుక్‌ను నెగిటివ్ నుంచి స్టేబుల్‌కు మార్చింది. రాబోయే కాలంలో కంపెనీలు మంచి పనితీరు చూపుతాయని, విక్రయాలు, మార్జిన్లలో మెరుగుదల ఉంటుందని అంచనావేసింది. కాగా అమెరికాలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంపై వరుసగా 25 శాతం, 10 శాతం చొప్పున సుంకం విధిస్తామని, వచ్చే వారమే ఇవి అమల్లోకి వస్తాయని ట్రంప్ చేసిన ప్రకటన పలు దేశాలను ఆందోళనకు గురిచేసింది. దీంతో అటు అమెరికా, ఇటు ఆసియాల్లోని స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ట్రంప్ నిర్ణయం దేశీయ పరిశ్రమకు మేలు చేకూరుస్తుందని స్టీల్, అల్యూమినియం ఉత్పత్తిదారులు అంటున్నారు. అయితే ఈ నిర్ణయం పారిశ్రామికంగా ఎదురుదెబ్బకు దారితీస్తుందని ఇతర రంగాలకు చెందిన నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు దేశీయంగా, విదేశీయంగా మౌలికసదుపాయాలపై దృష్టిపెట్టడం, ఇతర రంగాల్లో రికవరీ వంటి అంశాలు స్టీలు రంగానికి సానుకూలమని అంటున్నారు. రాబోయే కాలంలో స్టీల్ ధరలు 13 నుంచి 22 శాతం మేర పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29090	31112.30	–0.1%
ముంబై	29920	32000.00	–0.6%
ఢిల్లీ	29700	31764.71	–0.5%
కోల్‌కతా	30040	32128.34	–1.02%
కేరళ	28200	30160.43	0%
బెంగళూరు	28850	30855.61	0.52%
హైదరాబాద్	29090	31112.30	–0.07%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	41400.00	41200.00	0.49
ముంబై	41400.00	41200.00	0.49
ఢిల్లీ	41400.00	41200.00	0.49
కోల్‌కతా	41400.00	41200.00	0.49
హైదరాబాద్	41400.00	41200.00	0.49



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	363	విశాఖపట్నం	369
వరంగల్	366	చిత్తూరు	388
విజయవాడ	365	చెన్నై	395
గోదావరి	365	బెంగళూరు	384

ఆధార్‌తో 87 కోట్ల బ్యాంక్ ఖాతాలు అనుసంధానం

న్యూఢిల్లీ: గడువుకు ఒక నెల ముందు దాదాపు 80 శాతం బ్యాంక్ ఖాతాలు, 60 శాతం మొబైల్ కనెక్షన్లు ఆధార్‌తో అనుసంధానం చేసినట్లు యుఐడిఎఐ సీనియర్ అధికారి తెలిపారు. ప్రభుత్వ పథకాల నుంచి బ్యాంక్ ఖాతాలు, మొబైల్ నంబర్ల నుంచి పాన్ కార్డు వరకు ఆధార్ అనుసంధానాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.. దీనికి గాను 2018 మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. ఈ నెలాఖరు లోపు వీటన్నింటికీ 12 నంబర్ల ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఆయా ఖాతాలను స్తంభింపజేయడం జరుగుతోంది. అదే సమయంలో అన్ని మొబైల్ ఫోన్ల కనక్షన్లు కూడా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. దేశంలో మొత్తం 109.9కోట్ల బ్యాంక్ ఖాతాలు ఉండగా 87 కోట్ల ఖాతాలకు ఆధార్ అనుసంధానం జరిగిందని తెలుస్తోంది. వీటితో 58 కోట్ల బ్యాంకు ఖాతాదారులు అన్ని పత్రాలను సమర్పించారు. 142.9 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉండగా, 85.7 కోట్ల నంబర్లకు ఆధార్ అనుసంధానం జరిగింది. ఈ విషయాన్ని యుఐడిఎఐ సిఇఒ అజయ్ భూషణ్‌పాండే తెలిపారు. పాన్(శాశ్వత ఖాతా సంఖ్య)తో ఆధార్ అనుసంధానం ప్రక్రియను కూడా ఆధాయం పన్ను శాఖ తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వ పథకాలకు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసి.. ఈ విధానాన్ని చాలా వరకు పూర్తి చేసింది.



అంతర్జాతీయ అంశాలు కీలకం

అమెరికా ఫెడ్ సమీక్ష, దేశీయంగా పార్లమెంట్ సమావేశాలపై దృష్టిపెట్టాలి : నిపుణులు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరిణామాలు ఈవారం మార్కెట్‌ను శాసించనున్నాయని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలతో దేశీయంగా మార్కెట్లు పతనమయ్యాయి. స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకం పెంపు అంశం ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేయనుందని భావిస్తున్నారు. ట్రంప్ చేసిన ప్రకటనతో ఇప్పటికే అమెరికాతో సహా ఆసియా మార్కెట్లు కుప్పకూలాయి. ఈ ఎఫెక్ట్ దేశీయంగా ఉండనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మార్చి చివరి వారంలో ఫెడ్ పాలసీ సమీక్షా సమావేశాలు వుంటాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ పటిష్ట వృద్ధిని సాధిస్తుండటంతోపాటు ద్రవ్యోల్బణం బలపడుతున్నట్లు ఫెడ్ కొత్త చీఫ్ జెరోమీ పావెల్ ఇటీవల ప్రసంగంలో పేర్కొన్నారు. వెరసి రానున్న కాలంలో వడ్డీ రేట్ల పెంపు బాటలో సాగనున్నట్లు స్పష్టమైన సంకేతమిచ్చారు. దీంతో గడిచిన వారం అమెరికాసహా దేశీ స్టాక్ మార్కెట్లు కూడా అమ్మకాలతో కుదేలయ్యాయి. స్టీల్ దిగుమతులపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం చొప్పున టారిఫ్‌ను విధించనున్నట్లు ట్రంప్ చేసిన ప్రకటనతో యూరోపియన్ యూనియన్ తదితర ప్రపంచదేశాల మార్కెట్ల స్పందన ఎలా ఉండనుందోనని ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుమతి సుంకం పెంపుతో స్టీలు మరింత ప్రియం కానుందని, ఇది ద్రవ్యోల్బణానికి దారితీసి, అధిక వడ్డీ రేట్లకు ఊతమిస్తుందని అంటున్నారు. గురువారం అమెరికా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఈ ప్రభావం దేశీయంగా సోమవారం కనిపించే అవకాశమున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ వారం దేశ సేవల రంగ పిఎంఐ గణాంకాలతోపాటు చైనా, జపాన్, అమెరికా సేవల రంగ గణాంకాలు వెల్లడికానున్నాయి. కాగా మార్కెట్లో కన్సాలిడేషన్ కొనసాగితే నిఫ్టీ 10900 పాయింట్లకు చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికైతే అమ్మకాల ధోరణి మార్కెట్లో కొనసాగుతోంది. ఫిబ్రవరి సూచీలకు చేదు అనుభవాన్నిచ్చిందని అంటున్నారు. ఇప్పుడు మార్కెట్లు కన్సాలిడేషన్ మూడ్‌లోకి మారాయని చెప్పారు. 10300–10630 పాయింట్ల శ్రేణిలో కన్సాలిడేషన్ జరుగుతోందన్నారు. కేవలం 10300 పాయింట్లకు దిగువన క్లోజయితే కన్సాలిడేషన్ అంతమయి బేరిష్‌గా మారుతుందని చెప్పారు. సమీపకాలంలో బ్రేక్‌డవున్ జరగకపోతే నిఫ్టీ క్రమంగా 10900 పాయింట్లకు ఎరిగే అవకాశముందని అంటున్నారు.

పార్లమెంట్‌పై దృష్టి



సోమవారం (మార్చి 5) నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈవారం దేశీ స్టాక్ మార్కెట్లు పార్లమెంట్ సమావేశాలపై దృష్టిపెట్టనున్నాయని, ఇంకా అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు పరిశీలించాలని పేర్కొంటున్నారు. అలాగే డాలరుతో రూపాయి మార కం విలువ వంటి అంశాలను చూడాలని తెలిపారు.

ఈశాన్య ఓటర్లు ద్వేషపూరిత రాజకీయాలను తిరస్కరించారు : మోడీ



బెంగళూరు : బిజెపి అధికారంలోకి రావాలని కోరుతూ ఏకగ్రీవంగా ఓట్లు వేసి ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ద్వేషపూరితమైన రాజకీయాలను తిరస్కరించారని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. రామకృష్ణ వివేకానంద ఆశ్రమం సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బెంగళూరుకు 70 కిలోమీటర్ల దూరంలోని తుమకూరు వద్ద యువజన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'యువ శక్తి : నూతన భారతానికి దృష్టి' అంశంపై విడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. త్రిపుర ఫలితాలు తమకు ఎంతో ఉత్తేజాన్ని కలిగించాయని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చేందుకు ఈశాన్య రాష్ట్రాల సోదర, సోదరీమణులు ఏకగ్రీవంగా ఓట్లు వేశారని అన్నారు. సమగ్రమైన పరిష్కారమే తప్పుదోవ పట్టించేవారికి సరైన సమాధానం ఇస్తుందని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో లెఫ్ట్, కాంగ్రెస్‌ల హయాంలో వాటి విధానాలు, నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, కాని తమ ప్రభుత్వం ప్రజల ఇలాంటి ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వం దేశం మొత్తాన్ని ఒకే విధానంతో పాలిస్తుందని, తాము పని చేయడం ద్వారానే ఇది నిరూపితమవుతుందని అన్నారు. ఈశాన్యంలో వచ్చిన ఎన్నికల ఫలితాలతో దేశంలో పండుగ వాతావరణం నెలకొందని పేర్కొన్నారు.

ఈశాన్యంలో కీలకంగా ఎన్‌పిపి

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి వేగంగా పుంజుకుంది. కాంగ్రెస్ పార్టీ ప్రాభవాన్ని కోల్పోయింది. అయితే, ఇదే సమయంలో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలలో అతిపెద్ద కీలక పార్టీగా అవతరించింది. లోక్‌సభ మాజీ స్పీకర్, మేఘాలయ ముఖ్యమంత్రి పిఎ సంగ్మా స్థాపించిన ఈ పార్టీని ఇప్పుడు అతని పిల్లలు,జేమ్స్, కొన్రాడ్, అగాథలు నడిపిస్తున్నారు. ఇటీవల జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీ సాధించిన ఫలితాలే వారి సామర్థ్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. మేఘాలయలో కాంగ్రెస్ 21 స్థానాల్లో విజయం సాధించగా,ఎన్‌పిపి 19 సీట్లతో ఆ తరువాత స్థానంలో నిలిచింది. ఈ రెండింటి మధ్య రెండు సీట్లే తేడా.పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ ఎంపి కూడా అయిన కన్రాడ్, జేమ్స్, అగతలు సునాయాసంగా అసెంబ్లీ సీట్లను గెల్చుకున్నారు. పిఎ సంగ్మా రెండో వర్ధంతికి ఒకరోజు ముందు ఇది జరగడం గమనార్హం. మేఘాలయ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉండగా...59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి.అధికార పీఠం అధిష్టించాలంటే మేజిక్ ఫిగర్ 31 స్థానాలు సాధించాలి. కాంగ్రెస్‌కు 21, ఎన్‌పిపికి 19, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ (యుడిపి)కి 8, బిజెపికి 2, ఇతరులకు 9 స్థానాలు లభించాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కాన్రాడ్ తదుపరి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.మూడు దశాబ్దాల క్రితం కాన్రాడ్ తండ్రి సంగ్మా ఇదే విధంగా సిఎం అయ్యారు. యు డిపి,హెచ్‌ఎస్‌పిడిపి, పిడిఎఫ్, బిజెపిల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వానికి కాన్రాడ్ సారథ్యం వహించే అవకాశాలున్నాయి. అంపటి, సంగ్‌సక్ నుంచి గెలుపొందిన కాంగ్రెస్ నేత



ముకుల్ సంగ్మా వదులుకునే ఏదో ఒక స్థానం నుంచి ఉప ఎన్నికల్లో కాన్రాడ్ పోటీకి దిగుతారని అంచనా. 2013 ఎన్నికల్లో ఎన్‌పిపి దాదాపు 9 శాతం ఓట్లతో కేవలం రెండు సీట్లను మాత్రమే గెల్చుకుంది. అయితే, ఈసారి ఓట్ల శాతం 20 శాతానికి పెరిగింది. దీంతో పాటు తమకు పాగా పట్టున్న గారో హిల్స్ నుంచే కాకుండా మేఘాలయ నలుమూలలా రికార్డు స్థాయి విజయాలను నమోదు చేసుకుంది. రెండు స్థానాలను గెల్చుకుని నాగాలాండ్‌లోను ఎన్‌పిపి తన ఉనికిని చాటుకుంది. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మద్దతును ఎన్‌డిపిపి–బిజెపి భాగస్వామ్య పక్షాలకు అందించనుంది. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) వ్యవస్థాపకుల్లో ఒకరైన పిఎ సంగ్మా 2012లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ భాగస్వామ్యంతో ఎన్‌పిపిని స్థాపించారు.

2013లో జరిగిన ఎన్నిక లో ఆ పార్టీ కేవలం రెండు సీట్లను మాత్రమే గెల్చుకుంది. అదే ఏడాదిలో రాజస్థాన్‌లోనూ పోటీ చేసిన నాలుగు చోట్ల విజయం సాధించింది.2016లో సం గ్మా మృతితో పార్టీ పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంది. కాని, అతని సంతానం జేమ్స్, కాన్రాడ్, అగతలు రెండేళ్లుగా పార్టీ విస్తరణకు కృషి చేశారు.

మేఘాలయ సిఎం కోన్రాడ్

6న ప్రమాణస్వీకారానికి గవర్నర్ ఆహ్వానం



షిల్లాంగ్ : మేఘాలయ ముఖ్యమంత్రిగా కోన్రాడ్ సంగ్మా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 6న ప్రమాణ స్వీకారం చేయాలని గవర్నర్ ఆయనను ఆహ్వానించారు. అంతకుముందు ప్రభుత్వ స్థాపనకు తమకు అవకాశం ఇవ్వాలని ఎన్‌పిపి అధ్యక్షులు కోన్రాడ్ సంగ్మా కోరారు. రాష్ట్ర గవర్నర్ గంగా ప్రసాద్‌ను ఆదివారం సాయంత్రం కలుసుకుని ప్రభుత్వ స్థాపనకు ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 60 సభ్యుల అసెంబ్లీలో 34 మంది ఎమ్మెల్యేల బలం తమకు ఉందని తెలిపారు. శనివారం వెలువడ్డ ఫలితాలలో అధికార స్థాపనకు ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. అయితే అత్యధిక స్థానాలు దక్కించుకున్న పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. ఇప్పటివరకూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ప్రత్యర్థి పార్టీ బిజెపి మిత్రపక్షం అయిన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) కన్నా కాంగ్రెస్ స్వల్ప ఆధిక్యతను చాటుకుంది. అయితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితిలో లేదు. దీనితో రాష్ట్రంలో ప్రభుత్వ స్థాపనలో సందిగ్ధత నెలకొంది. ఈ దశలో తాము గవర్నర్‌ను కలుసుకుని తమ ప్రభుత్వ స్థాపనకు మద్దతు ఇస్తోన్న ఎమ్మెల్యేలతో కూడిన జాబితాను ఇచ్చామని సంగ్మా తెలిపారు. రాజ్‌భవన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

మాణిక్ సర్కార్ రాజీనామా



అగర్తలా : త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఆదివారం రాజీనామా చేశారు. ఆయన గవర్నర్ తథాగత రాయ్‌ను కలుసుని తన రాజీనామా లేఖను అందజేశారు. తదుపది ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించే వరకు కొనసాగాలని గవర్నర్ కోరినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలను శాంతియుత జరపించేందుకు సహకారించిన అధికారులు, భద్రతా సిబ్బందికి మాణిక్ సర్కార్ ధన్యవాదాలు తెలిపారు. అధికార సిపిఎం పార్టీ బిజెపి, ఐపిఎఫ్‌టి కూటమి చేతిలో ఓటమి చెందడంతో మాణిక్ సర్కార్ తన పదవీకి రాజీనామా చేయాల్సి వచ్చింది.

ఈశాన్య ప్రభావం కర్నాటకపై ఉండదు

న్యూఢిల్లీ: ఈశాన్య ఎన్నికల ఫలితాల ప్రభావం కర్నాటకపై ఉండబోదని కాంగ్రెస్ పేర్కొంది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాహుల్ గౌడ మాట్లాడుతూ ఈశాన్య ఫలితాలు అసాధారణమైనవని,జాతీయ స్థాయిలో బిజెపి వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. ఈశాన్యంలో బిజెపి విజయం సాధించడం ఒక అసాధారణ విషయమని, అవి దేశ వ్యాప్త ంగా కాంగ్రెస్ పునరుజ్జీవనంపై ప్రభావం చూపబోదని తెలిపారు. మేఘాలయలో కాంగ్రెస్‌కు మెజార్టీ రాకున్నా, త్రిపుర, నాగాలాండ్‌లో ఆ పార్టీకి ఒక సీటు కూడా సాధించలేకపోయింది. అయితే కర్నాటలో తాము విజయం సాధించి తీరుతామని ఆ పార్టీకి చెందిన నేతలు చెబుతున్నారు ఈశాన్య ఫలితాలు కర్నాటకపై వాస్తవ రూపం దాల్చబోవని వారు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు దేశంలో లేకపోవడంతో ఈ శాన్య ఫలితాలపై మాట్లాడేందుకు అతి కొద్ది మంది నేతలు మాత్రమే ముందుకు వస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ ఎన్నికలు కాంగ్రెస్‌లో మనో బలం పెరిగినప్పటికీ, ఈశాన్య ఫలితాలతో ఢీ లా పడిపోయింది. అయితే ఈ శాన్య ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ కర్నాటకలో బిజెపికి ఘోర పరాజయం తప్పదని రాహుల్ గౌడ పేర్కొన్నారు.

నేటి నుంచి సిబిఎస్‌ఇ పరీక్షలు

న్యూఢిల్లీ : నేటి (ఈనెల 5) నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ) 10,12 తరగతులకు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 28 లక్షలకు పైగా విద్యార్థులు హాజరుకానున్నట్లు సిబిఎస్‌ఇ అధికారి ఒకరు చెప్పారు. 10వ తరగతి పరీక్షకు మొత్తం 16,38,428 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 12వ తరగతికి 11,86,306 మంది విద్యార్థులు రిజిష్టర్ చేసుకున్నారు. ఇప్పటి వరకు ఉన్న సిసిఇ విధానాన్ని ఎత్తివేయాలని గతంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏడాది నుంచి 10వ తరగతి బోర్డు ఎగ్జామ్‌ను తిరిగి నిర్వహిస్తున్నారు. టెన్త్ పరీక్షలను దేశవ్యాప్తంగా 4,453 కేంద్రాల్లో నిర్వహిస్తుండగా, దేశం వెలుపల 78 కేంద్రాల్లో జరపనున్నారు. అదే విధంగా 12వ తరగతి పరీక్షలను దేశంలో 4,138 కేంద్రాల్లో, విదేశాల్లో 71 కేంద్రాల్లో నిర్వహించనున్నారు.ఈ పరీక్షలకు ఆయా రాష్ట్రాల అధికారులు తగిన ఏర్పాట్లు చేశారని, పరీక్షలకు ఎలాంటి అవరోధం లేకుండా చూసేందుకు స్థానిక పోలీసులు చర్యలు చేపట్టినట్లు సిబిఎస్‌ఇ అధికారి పేర్కొన్నారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న అభ్యర్థులకు తినుబండారాలను కూడా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. పదవ తరగతికి మొత్తం 4,510, 12వ తరగతి పరీక్షలకు 2,846 మంది వికలాంగ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకున్నారు.

ఉప ఎన్నికల్లో ఎస్‌పికి బిఎస్‌పి మద్దతు



లక్నో/గోరఖ్‌పూర్ : ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఒకప్పటి బద్ధ శత్రువైన సమాజ్‌వాది పార్టీకి (ఎస్‌పి) బహుజన సమాజ్‌వాది పార్టీ (బిఎస్‌పి) మద్దతు ప్రకటించింది. గోరఖ్‌పూర్‌లో జరిగిన బిఎస్‌పి జిల్లాస్థాయి సదస్సులో ఎస్‌పి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని ఆదివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో 2019లో జరిగే సాధారణ ఎన్నికలకు ముందు ఈ రెండు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడే అవకాశమున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే బిఎస్‌పి అధినేత్రి ఊహాగానాలకు తెరదించారు. కూటమిగా ఏర్పడ బోమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, గోరఖ్‌పూర్ ఉప ఎన్నికల్లో ఇప్పటికే ఎస్‌పి అభ్యర్థికి నిషద్ పార్టీ కూడా మద్దతు ప్రకటించింది. ఈ ఉప ఎన్నికలు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు కీలకం కానున్నాయి. ఆయన సిఎం కావడంతో గోరఖ్‌పూర్ ఎంపి స్థానానికి యోగి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా, ఉప ఎన్నికల బరిలోకి దిగే అత్యంత వెనుకబడిన తరగతికి చెందిన ప్రవీన్ నిషాద్‌కు మద్దతు పలకాలని బిఎస్‌పి అధినేత్రి నిర్ణయం తీసుకున్నారని ఆ పార్టీ కో–ఆర్డినేటర్ ఘన్‌శ్యామ్ తర్వార్ స్పష్టం చేశారు. ఉప ఎన్నిక ఈనెల 11న జరగనుంది.

సిపిఐ కేరళ కార్యదర్శిగా మళ్లీ కనం



మలప్పురం: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కేరళ కార్యదర్శిగా మూడేళ్ల పదవీకాలానికి కనంరాజేంద్రన్ రెండోసారి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ప్రముఖ కార్మిక సంఘం నాయకుడైన ఈ 67 ఏళ్ల నాయకుడు ఇదివరలో రెండుసార్లు శాసనసభ్యుడిగా పనిచేశారు. రాజేంద్రన్ 2015 లో కొట్టాయం రాష్ట్ర సమావేశంలో మొదటిసారి కార్యదర్శి గా ఎన్నికయ్యారు. ఆయనకు ఆదివారం పార్టీలోని అదే హోదాలో మరో దఫా పనిచేసే అవకాశం దక్కింది. అయితే పార్టీలో మాజీ రాజ్యసభ సభ్యుడు కె.ఇ. ఇస్మాయిల్ వర్గం ఆయనను వ్యతిరేకిస్తోంది. పార్టీ ఐక్యతను కాపాడేందుకు ఆయనపై పోటీ చేసిన సి.దివాకరన్ పోటీ నుంచి ఉపసంహరించుకున్నారు. ఎన్నికయ్యాక రాజేంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ఐక్యతకు కృషి చేస్తానన్నారు. కేరళలో సి.ఎం. పినరయి విజయన్ ప్రభుత్వంలో సిపిఐ రెండో పెద్ద మిత్రపక్షంగా ఉంది. ఇదిలా ఉండగా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌తో చేతులు కలపాలని సిపిఐ భావిస్తుండగా, విజయన్ వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తున్నది.

భద్రతా మండలి సభ్యత్వానికి మద్దతు

న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్(ఎపిఇసి)తో సహా ప్రాంతీయ సంబంధాలు, సహకార యంత్రాంగాలలో భారత్ చురుకుగా పాల్గొనేందుకు వియత్నాం మద్దతిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు ట్రాన్ డై క్వాంగ్ తెలిపారు. భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి వియత్నాం మద్దతిస్తుందని ఆయన తెలిపారు.ఆదివారం తీన్ మూర్తి భవన్‌లో ఓ సమావేశానుద్దేశించి ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబర్‌లో ఆసియాన్‌ఇండియా సదస్సులో ఆసియాన్ దేశాల చుట్టే భారత్ తూర్పు విధానం ఉంటుందని ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశంసిస్తున్నామని ట్రాన్ డై క్వాంగ్ పేర్కొన్నారు. ఆసియాపసిఫిక్ ప్రాంతంలో వియత్నాంకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నట్లు మోడీ నొక్కి చెప్పారన్నారు. భారతదేశం తమకు అత్యం త ముఖ్యమైన భాగస్వాములలోఒకటిగా ఉందని ఆయన తెలిపారు. అంతకు ముందు వియత్నాం అధ్యక్షుడు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌తో ఆయన భేటీ అయ్యారు.

6న త్రిపురలో ఎంఎల్‌ఎల సమావేశం

నాయకుడిని ఎన్నుకునేందుకు బిజెపి ఐపిఎఫ్‌టి సన్నాహం

అగర్తలా: త్రిపురలో కొత్తగా ఎన్నికైన భారతీయ జనతా పార్టీ(బిజెపి), ఇండీజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపిఎఫ్‌టి) శాసనసభ్యులు తమ నాయకుడిని ఎన్నుకునేందుకు మార్చి6న సమావేశం కాబోతున్నారు. ఈ విషయాన్ని త్రిపుర బిజెపి అధ్యక్షుడు బిప్లబ్ దేబ్ ఆదివారం చెప్పారు. త్రిపురలో బిజెపి ఎంఎల్‌ఎలు 35 మంది, ఐపిఎఫ్‌టి ఎంఎల్‌ఎలు 8 మంది ఉన్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరుకానున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి మోడీ, ఇతర కేంద్ర మంత్రులు హాజరవుతారు.

రియోకు తగిన మెజార్టీ : గవర్నర్ పిబి ఆచార్య



కోహిమా : నాగాలాండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నైఫీ రియోకు తగిన మెజార్టీ ఉందని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని గవర్నర్ పిబి ఆచార్య తెలిపారు. ఈ మేరకు స్పష్టమైన మెజారిటీతో వున్న తమకు ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని కోరుతూ ఎన్‌డిపిపి నాయకుడు నైఫీ రియో ఆదివారం నాగాలాండ్ గవర్నర్‌ను కలిశారు. 60 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో తనకు 32 మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు రియో గవర్నరుకు తెలిపారు. దీంతో ఆయన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. కాగా, తమకు మద్దతునిచ్చే 32 మంది ఎంఎల్‌ఎల సంతకాలను సోమవారం లోగా తనకు అందజేయాలని రియోను కోరినట్టు గవర్నర్ తెలిపారు. శనివారం వెలువడిన నాగాలాండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి–ఎన్‌డిపిపి కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని సంపాదించలేకపోయింది. ఎన్‌డిపిపి 16, బిజెపి 11, ఎన్‌పిపి 2, జెడి (యు) ఒక స్థానంలో గెలుపొందారు. మరోవైపు బిజెపి నేత రాంమాధవ్ రియోతో భేటీ అయి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.


యుడిపి చీఫ్‌తో రిజిజు భేటీ

షిల్లాంగ్ : కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జి కిరెన్ రిజిజు ఆదివారం నాడు యుడిపి అధ్యక్షుడు దొంకుపార్ రాయ్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఎన్నికల్లో 19 సీట్లు గెల్చుకుని రెండో స్థానంలో నిలిచిన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) నేతృత్వంలో మేఘాలయలో కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించారు. 'మాకు ఇక్కడ అంతగా ప్రాబల్యం లేదు. కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఇక్కడ ఏర్పాటు చేసే విషయంలో ప్రాంతీయ పార్టీలకు మద్దతు పలుకడానికే ఇక్కడికి వచ్చాం' అని రాయ్‌తో సమావేశానంతరం పిటిఐకి తెలిపారు. మా భాగస్వామ్య పక్షాలు, పిడిఎఫ్ సభ్యులతో కలిసి ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్చలు జరిపామని యుడిపి ప్రధాన కార్యదర్శి జెమీనో తెలిపారు. కాగా, ఇప్పటికే అసోం బిజెపి నాయకుడు హిమంత బిస్వా శర్మ యుడిపి అధ్యక్షుడు రాయ్‌తో చర్చలు జరిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేఘాలయ ఓటర్లు ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని ఇవ్వని విషయం విదితమే. అధికార కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద పార్టీగా నిలిచింది. మేఘాలయ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 21 శాసనసభ స్థానాలను దక్కించుకుంది. కనీసం 31 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమవుతుంది. తాజాగా బిజెపి మిత్ర పక్షం ఎన్‌పిపికి యుడిపి మద్దతు ప్రకటించింది. ఈ ఎన్నికల్లో బిజెపికి 2, ఎన్‌పిపికి 19, యుడిపికికి 6 స్థానాలు లభించాయి. ఈ మూడు పార్టీలు కలిసి, మరికొందరు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద కాంగ్రెస్‌ను నిరోధించి, మేఘాలయను దక్కించుకునేందుకు ఎన్‌డిఎ తీవ్ర యత్నాలు సాగిస్తోంది.

నేటి నుంచి మళ్లీ పార్లమెంట్

పిఎన్‌బి స్కామ్, ఆస్తుల జప్తు, తలాక్ బిల్లులు కీలకం

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం (నేటి) నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. పిఎన్‌బి స్కామ్, ఆర్థిక నేరగాళ్ల వ్యవహారాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు సిద్ధం అయ్యాయి. ఇక ఈశాన్య రాష్ట్రాలలో తాజాగా విజయం సాధించిన ఉత్తేజంతో అధికార పక్షం బిజెపి, మిత్రపక్షాలు సమావేశాలకు సన్నద్ధం అయ్యాయి. పలు వివాదాస్పద అంశాలపై అధికార ప్రతిపక్షాల మధ్య ఈ సమావేశాల్లో వేడి రగులుకోనుంది. నెల రోజుల విరామం తరువాత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభం అవుతున్నాయి. ఈసారి సమావేశాలలో కీలకమైన ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ బిల్లును తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని వల్ల ఆర్థిక నేరాల నిందితులు, బ్యాంకు రుణాల ఎగవేతదార్ల ఆస్తులన్నింటిని జప్తు చేసుకునేందుకు వీలేర్పడుతుంది. ట్రిపుల్ తలాఖ్ బిల్లు కూడా ప్రభుత్వ అజెండాలో ప్రాధాన్యతక్రమంలో ఉంది. పిఎన్‌బిలో రూ 12,700 కోట్ల మేర స్కామ్ జరగడం, నిందితుడు నీరవ్ మోడీ దేశం నుంచి పరారు కావడం వంటి ఘటనలతో ఆర్థిక నేరాల నిందితుల ఆస్తుల జప్తు బిల్లును రూపొందించారు. నీరవ్ మోడీ అంతకు ముందు విజయ్ మాల్యా దేశం వీడి వెళ్లడం , జాతీయ బ్యాంకులు ఆర్థిక అక్రమాలతో చితికిపోవడం వంటి పలు అంశాలు జాతీయ స్థాయిలో ఇప్పటికే ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అయితే ఈ మోసాల మూలా లు, ఆర్థిక నేరగాళ్ల లావాదేవీలు అన్నీ కూడా యుపిఎ హయాంలోనే మొదలయ్యాయని, అక్రమాలు వెలుగులోకి రాగానే ఎన్‌డిఎ స్పందించి చర్యలు చేపట్టిందని పేర్కొంటూ ఎదురుదాడికి దిగేందుకు బిజెపి సిద్ధం అయింది. ప్రత్యేకించి బ్యాంకులకు భారీ స్థాయి రుణాల మోసాలు కీలక అంశాలుగా పార్లమెంట్‌లో పరస్పర వాదోపవాదాలు జరుగనున్నాయి. ఇప్పటికే నీరవ్, లలిత్, మాల్యాల వ్యవహారాలలో కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ ప్రధానిపై దాడిని తీవ్రతరం చేశారు. ఈ అంశాలు రగులుకుంటూ వస్తున్న దశలోనే బిజెపి ఈశాన్యంలో పుంజుకోవడం, ఇదే సమయంలో కాంగ్రెస్ చతికిల పడటం వంటి అంశాల ప్రభావం కూడా సభలలో ప్రతిఫలిస్తుందని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన స్కామ్‌లను తిరగదోడటం ద్వారా పార్టీని ఇరుకున పెట్టాలని, తమపై విమర్శలను తిప్పికొట్టాలని బిజెపి వ్యూహంగా మారింది. ఇక ట్రిపుల్ తలాక్ బిల్లు కూడా ఆమోదం కోసం వేచి ఉంది. ఇందులో వివాదం ఇమిడి ఉండటంతో దీనికి ఆమోదం దక్కుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్, వామపక్షాల నుంచి వ్యతిరేకత ఉన్నా ఈ బిల్లు ఆమోదించుకుని తీరుతామని అధికార పక్షం దీమాగా ఉంది. ఇక ఒబిసి బిల్లు ఆమోదం కూడా ప్రభుత్వ అజెండాలో ఉంది. కేంద్ర బడ్జెట్‌పై కీలక ప్రతిపాదనలపై చర్చ జరుగుతుంది.



నెలకు రూ.12 లక్షల టీ విక్రయం




పుణె : మహారాష్ట్ర పుణె నగరానికి చెందిన ఓ తేనీటి విక్రయదారుడు తన వ్యాపారంలో నెలకు రూ.12 లక్షల బెంచ్‌మార్క్‌ను చేరుకున్నాడు. దీంతో నగరంలోని ప్రముఖ టీ స్టాళ్ల జాబితాలోకి యెవ్లే టి హౌస్ కూడా చేరింది. త్వరలో అంతర్జాతీయంగా కూడా పేరుగాంచనున్నట్లు యెవ్లే టీ హౌస్ సహ వ్యవస్థాపకుడు నవ్‌నాథ్ యవ్లే చెప్పారు. పకోడి వ్యాపారమే కాకుండా తేనేటి విక్రయ వ్యాపారం ద్వారా కూడా భారతీయులకు ఉపాధి కలుగుతుందన్నారు. తమ వ్యాపారం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని, అందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుతం పుణె నగరంలో యెవ్లే టి హౌస్‌కు మూడు బ్రాంచ్‌లు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో 12 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ముంబయి జైలులో కార్తీ విచారణ

ఇంద్రాణితో కలిపి సిబిఐ బృందం 4 గంటల విచారణ

ముంబయి : ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరాన్ని సిబిఐ వర్గాలు ఆదివారం ఇక్కడి బైకుల్యా జైలుకు తీసుకువచ్చాయి. ఈ జైలులో ఉన్న ఇంద్రాణి ముఖర్జీయాతో కార్తీని ముఖాముఖిగా ఉంచి సిబిఐ బృందం విచారణ జరిపింది. ఈ ప్రక్రియ దాదాపు నాలుగు గంటలు జరిగింది. ఈ క్రమంలో సిబిఐ 120 ప్రశ్నలు సంధించిందని వెల్లడైంది. ఐఎన్‌ఎక్స్ మీడియా మాజీ డైరెక్టరు ఇంద్రాణి భర్త పీటర్‌తో పాటు షీనా బోరా హత్య కేసులో ఇక్కడ జైలులో ఉన్నారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి కార్తీపై ఇంద్రాణి, మాజీ మీడియా అధినేత పీటర్ వెల్లడించిన అంశాలు , కోట్ల రూపాయలు కార్తీకి ఇచ్చామని చెప్పిన అంశాలను ప్రాతిపదికగా తీసుకుని కార్తీని ఇప్పుడు సిబిఐ ఈ జైలుకు తరలించింది. కేసుకు సంబంధించి కార్తీకి సిబిఐ కస్టడీ విధించిన విషయం తెలిసిందే. ఆరుగురు సభ్యుల సిబిఐ బృందం ఆదివారం కార్తీని తీసుకుని జైలుకు తరలి వచ్చారు. ముఖర్జీయాలతో కార్తీ ముఖాముఖీ నేపథ్యంలో విచారణ ప్రక్రియ సాగించారు. తొలుత ఇంద్రాణిని , కార్తీని ఒక గదిలోకి తీసుకువెళ్లారని, ఎదురెదురుగా కూర్చోబెట్టి ఈ విచారణ సాగించారని , ఒకే సారి పలు ప్రశ్నలు సంధించారని వెల్లడైంది. ఒక మహిళా పోలీసు అధికారితో పాటు సిబిఐ బృందం ముంబయికి చేరుకుంది. వెంటనే జైలు తలుపులు మూసివేసి, లోపలికి జైలు అధికారులను, సిబ్బందిని కానీ రానివ్వకుండా చూసుకుని ఈ ముఖాముఖి కార్యక్రమం సాగించారు. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు అయిన కార్తీని ఈ కేసులో సిబిఐ గత నెల 28న అరెస్టు చేసింది. తాను కార్తీకి ముడుపులు ఇచ్చినట్లు ఇంద్రాణి ఇచ్చిన వాంగ్మూలం ప్రాతిపదికన కార్తీని అదుపులోకి తీసుకున్నారు. లండన్ నుంచి ఆయన చెన్నైకు రాగానే ఆయనను అరెస్టు చేశారు. ఇంద్రాణి భర్త పీటర్‌తో కూడా కార్తీని కూర్చోబెట్టి విచారిస్తారని తొలుత భావించారు. అయితే కేవలం ఇంద్రాణితోనే ముఖాముఖీ దశలో సిబిఐ విచారణ సాగిందని వెల్లడైంది. నిందితుడు కార్తీని విచారించేందుకు కస్టడీలోకి తీసుకుంటున్న దశలోనే తమ వద్ద ఉన్న పత్రాలు, సహనిందితులతో కలిపి విచారణ అవసరం అవసరం అని భావించిన సిబిఐ చేసుకున్న దరఖాస్తుకు అనుకూలంగా సిబిఐ కోర్టు స్పందించింది. ఈ క్రమంలో ఈ విచారణ జరిగింది. మానసిక స్థితి సరిగ్గా లేని స్థితిలో జైలులో ఉన్న ఇంద్రాణి వాంగ్మూలం ఆధారంగా విచారణ నిర్వహించడం తగదని కాంగ్రెస్ విమర్శిస్తోంది.





బైకూల్లా జైలులో కార్తీ విచారణ క్రమం

సెంట్రల్ ముంబయిలోని జైలుకు ఉదయం 11.15కు ఆరుగురు సభ్యుల సిబిఐ టీం కార్తీతో చేరుకుంది. దాదాపు 3.15 గంటలకు సిబిఐ బృందం జైలు నుంచి బయటకు వచ్చింది. వెంట నవ్వుతూ ఉన్న కార్తీ కన్పించారు. సిబిఐ వాహనం ఫుట్‌బోర్డుపై కాలు పెట్టి కార్తీ అక్కడున్న విలేకరుల వైపు చూస్తూ చేయి ఊపడంతో , కిందికి దిగాలని సిబిఐ అధికారులు ఆదేశించారు. తరువాత సిబిఐ బృందం కార్తీని తీసుకుని ముంబై ఎయిర్‌పోర్టుకు తీసుకు వెళ్లింది.



త్వరలో ప్రముఖుల వాహనాలకు నెంబర్లు

న్యూఢిల్లీ : దేశంలోని రాజ్యాంగబద్ధ అగ్ర పదవుల్లో ఉన్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సంబంధించిన వాహనాలకు త్వరలోనే రిజిస్ట్రేషన్ నెంబర్లు దర్శనమివ్వనున్నాయి. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు ప్రమాణ పత్రాన్ని దాఖలు చేసింది. ఆ వాహనాలకు రిజిస్ట్రేషన్లు చేయించాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే రాతపూర్వకంగా సూచించినట్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి గీత మిట్టల్, సి.హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనానికి తెలియజేసింది. 'రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల కార్యాలయాలు వినియోగించే వాహనాలకు వెంటనే రిజిస్ట్రేషన్లు చేయించాలని, వాటి నెంబర్లను వాహనాలపై ప్రదర్శించాలని దేశంలోని రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల కార్యాలయాలు, కార్యదర్శి (విదేశీ వ్యవహారాలు)లను కోరాం. రిజిస్ట్రేషన్ల పూర్తికాకపోతే ఆ వాహనాలపై రిజిస్ట్రేషన్ మార్కు వేయాలని సూచించాం' అని ప్రమాణపత్రంలో రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ తెలిపింది.

వైట్‌హౌస్ ఎదుట కలకలం

వాషింగ్టన్: అమెరికాలోని వైట్‌హౌస్ ముందు జనసమర్ధ బాటపై ఓ శ్వేత జాతియుడు తనను తాను తలకు ఘోరంగా కాల్చుకున్నాడు. ఈ ఘటన శనివారం జరిగింది కానీ ఈ విషయాన్ని అక్కడి సీక్రెట్ సర్వీస్ ఆదివారం తెలిపింది. ఈ దుర్ఘటన జరిగే సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన భార్య లేడీ మెలానియా ఫ్లోరిడాలో ఉన్నారు. శ్వేత జాతియుడు దాపెట్టి తెచ్చుకున్న తుపాకీని తీసి అనేక రౌండ్లు కాల్చుకున్నాడు. కానీ అతడు ఎవరిని లక్ష్యం చేసుకుని ఈ కాల్పులు జరపలేదని సీక్రెట్ సర్వీస్ ప్రతినిధి చెప్పారు. అగంతకుడు తనను తాను కాల్చుకోడానికి ముందు తన ఫోన్‌ను కాల్చాడు. ఎలాంటి సూసైడ్ నోట్‌ను కూడా వదిలి పెట్టలేదు. అయితే ఘటనా స్థలిలో దొరికిన పుస్తకంలో అవాంఛనీయ వాక్యాలు కనిపించాయి. అగంతకుడు తప్ప మరెవరూ ఈ ఘటనలో గాయపడలేదు. ఈ ఘటనను వాషింగ్టన్ డిసి మెట్రోపాలిటన్ పోలీస్ శాఖ దర్యాప్తు చేస్తున్నది.

రజనీకాంత్ సినిమా '2.0' టీజర్ లీక్

చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన '2.0' సినిమా టీజర్ సామాజిక మాధ్యంలో లీక్ అయింది. దీనిపై రజనీకాంత్ కూతురు సౌందర్య ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.భారీ బడ్జెట్‌తో శంకర్ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో హిందీ నటుడు అక్షయ్ కుమార్ , నటి అమీ జాక్సన్ కూడా నటించారు. లైకా ప్రొడక్షన్స్ సినీ నిర్మాత సుభాష్‌కరన్ అల్లిరాజ పుట్టిన రోజు సందర్భంగా విఐపిల కోసమే ప్రదర్శించిన ఈ టీజర్‌ను లీక్ అయి ఉంటుందని అనుమానిస్తున్నారు.శంకరన్, రజనీకాంత్‌లు రూ పొందించిన 'యంతిరన్'(తెలుగులో 'రోబో'సినిమా) తర్వాత మళ్లీ వారిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా రూపొందించారు.ఇదో సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ సినిమా.ఈ సినిమాకు ఎ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చా రు. ఈ సినిమా టీజర్ పైరసీపై సౌందర్య ప్రతిస్పందిస్తూ 'అమానుష చ ర్య' అన్నారు. 'అధికారికంగా టీజర్‌ను విడుదల చేయక ముందే ఆన్‌లైన్‌లో విడుదల చేయడాన్ని సహించం, ప్రోత్సహించబోం.మాశ్రమను, కృ షిని, నిర్మాతల సెంటిమెంట్లను గుర్తించకుండా ఇలాంటి అమానుష చ ర్యకు పాల్పడ్డం సిగ్గుమాలినతనం,పైరసీని అరికట్టండి, డిజిటల్ మీడియంను దుర్వినియోగం చేయడాన్నిఅరికట్టండి'అనిసౌందర్య ట్వీట్ చేశారు.

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

తిరుపతి: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. పది కంపార్టు మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి ఐదు గంట లు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటలు, కాలినడక భక్తులకు రెండు గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 77,703 మంది భక్తులు దర్శించుకోగా 32,391 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.75 కోట్లు ఉందని టిటిడి అధికారులు వెల్లడించారు.

పులివెందులో టెన్షన్ టెన్షన్

ఆంధ్రప్రదేశ్: పులివెందులో టెన్షన్ టెన్షన్ నెలకొంది. పులివెందుల అభివృద్ధిపై బహిరంగ చర్చకు టిడిపి, వైసిపి సిద్ధమైంది. ఆదివారం సాయంత్రం పులివెందుల పూలంగళ్ల సర్కిల్‌లో బహిరంగ చర్చ రెండు పార్టీల కార్యకర్తలు రెడీగా ఉన్నారు. ఇరు పార్టీల నేతలను అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. పులివెందులలో పోలీసులు భారీగా మోహరించారు. పులివెందుల శివార్లలో పోలీసులు చెక్‌పోస్టులు పెట్టి ఇరు పార్టీల కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్నారు.

ఎపికి హోదా కోసం ఆందోళన


చెన్నయ్ : ఎపికి ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ చెన్నయ్ తెలుగుదేశం ఫోర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళనకు దిగారు. చెపాక్‌లోని స్టేట్ గెస్ట్ హైప్ వద్ద ఈ ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో ఐటి సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఎపికి ప్రత్యేక హోదా ఇస్తేనే అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని టిడిపి నేతలు పేర్కొన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విభజన హామీల అమలుతో పాటు ప్రత్యేక హోదా ఇచ్చే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

జెఎఫ్‌సి నివేదిక భేష్ : రామకృష్ణ

అమరావతి : ఎపికి అందాల్సిన నిధులపై జనసేన నిజ నిర్ధారణ కమిటీ (జెఎఫ్‌సి) నివేదిక భేషుగ్గా ఉందని ఎపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. కేంద్రం మోసపూరిత మాటలతో ఎపి ప్రజలను మభ్య పెడుతోందని, 45 నెలలు గడిచినా కేంద్రం ఎపికి సరైనా న్యాయం చేయడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమంటున్న నీతి ఆయోగ్ మాటలు పార్లమెంట్‌లో నాటి ప్రధాని ఇచ్చిన హామీ కంటే గొప్పవా అని ఆయన ప్రశ్నించారు. విబజన చట్టంలో ఎపికి ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ఢిల్లీలో నిరవధిక నిరసనలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. ఎపి ప్రయోజనాల గురించి మాట్లాడుతున్న బిజెపి నేతలకు దమ్ముంటే కేంద్రాన్ని నిలదీయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎపికి అన్నీ ఇచ్చామని చెబుతున్న బిజెపి ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు దమ్ముంటే రాజీనామా చేసి తిరిగి పోటీ చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా కోసం అధికార టిడిపితో పాటు అన్ని విపక్షాలు ఉద్యమించాల్సిందేనని ఆయన చెప్పారు. ఎల్లకాలం ప్రజలను కేంద్రం మోసం చేయలేదని ఆయన అన్నారు. కేంద్రం చేసిన మోసాన్ని ఎపి ప్రజలు గ్రహించారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైన ఎపికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బిజెపి ఎదుగుదల ఓర్వలేకే విమర్శలు

బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు రమేష్ నాయుడు



అమరావతి: దక్షిణ భారతంలో బిజెపి ఎదుగుదలను ఓర్వలేని కొన్ని పార్టీలు ఆంధ్రప్రదేశ్‌కు ఆ పార్టీ ఏమీ చేయలేదంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నాయని బిజెపి యువమోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు రమేష్ నాయుడు విజయవాడలో అన్నారు. మిత్రపక్షమైన బిజెపిపై టిడిపినేతలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పవన్ జేఎఫ్‌సీ నివేదిక చిన్నపిల్లలను ఆట పట్టించే విధంగా ఉందంటూ ఎద్దేవా చేశారు. బిజెపిపై నిందలు మోపేలా జేఎఫ్‌సీ నివేదికలో చూపిద్దామనుకొని పవన్ ఫెయిల్ అయ్యారన్నారు. ఏపీకి ఏం కావాలో పవన్ ఢిల్లీ వెళ్ళి ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాలో పరిశ్రమలు వస్తాయని పలువురు టిడిపి నేతలు రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొన్న మాట వాస్తవం కాదా? అని రమేష్ నాయుడు ప్రశ్నించారు. పెనుగొండ మండలంలో కియో మోటార్స్ ప్రాంతంలో 275 ఎకరాలను పల్లె, పయ్యావుల రైతుల నుంచి బెదిరించి భూములను తీసుకున్నారని.. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. రైతుల నుంచి బలవంతంగా లాక్కున్న భూములపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ తృతీయ ఫ్రంట్‌కు నాయకత్వం వహిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా ఏపీకి ఇస్తే మా రాష్ట్రానికీ కావాలని కెసీఆర్ అడగరా? అని ప్రశ్నించారు. కర్ణాటక ఎన్నికల్లో బిజెపి గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పాక్ చట్టసభలో దళిత మహిళ

తొలి హిందువుగా అడుగుపెట్టిన కృష్ణ కుమారి



కరాచీ: ముస్లింలు మెజారిటీగా ఉండే పాకిస్థాన్‌లోని ఎగువసభ(సెనెట్)కు తొలిసారిగా సింధు ప్రాంతానికి చెందిన 39 ఏళ్ల హిందూ దళిత మహిళ కృష్ణ కుమారి కొల్హీ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ వెల్లడించింది. ఆమె బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పిపిపి) తరపున సింధు ప్రాంతం నుంచి పోటీచేసి ఎగువసభకు ఎన్నికయ్యారు. సింధ్ నుంచి మైనారిటీ సీటు కింద ఆమె ఎన్నికయ్యారు. ఆమె ఎన్నిక పాకిస్థాన్‌లో మహిళలకు, మైనారిటీలకు ఓ మైలురాయి కాగలదని భావిస్తున్నారు. కృష్ణ కుమారి కొల్హీ సింధ్ ప్రాంతంలోని థార్ జిల్లాలోని మారుమూల గ్రామమైన నాగర్‌పార్కర్‌లోని ఓ పేద కుటుంబంలో 1979లో జన్మించారు. ఉమర్‌కోట్ జిల్లాకు చెందిన కున్రీకి చెందిన ఓ భూస్వామి దగ్గిర దాదాపు మూడేళ్ల పాటు ఆమె కుటుంబం నిర్బంధంలో గడిపింది. భూస్వామి నిర్బంధంలోకి వెళ్లే సమయంలో ఆమె మూడో గ్రేడ్ విద్యార్థిని. ఆమె తొమ్మిదో గ్రేడ్ చదివే సమయానికి..16 ఏళ్ల వయస్సులో లాల్‌చంద్‌తో ఆమె వివాహం అయింది. 2013లో ఆమె సింధ్ విశ్వవిద్యాలయం నుంచి సామాజిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీలని పూర్తి చేసింది. కృష్ణకుమారి తన సోదరినితో కలసి పిపిపిలో చేరింది. తర్వాత బెరానో యూనియన్ కౌన్సిల్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. థార్, ఇతర ప్రాంతాల్లో అణగారిన వర్గాల వారి హక్కుల కోసం ఆమె పోరాడారు. 1857లో నాగర్‌పార్కర్ నుంచి సింధ్‌పై దాడి చేసిన బ్రిటిష్ వలసదళాలతో పోరాడిని స్వాతంత్ర్య సమరయోధుడు రూప్లో కొల్హీ కుటుంబానికి చెందిన వారు కృష్ణ కుమారి కొల్హీ. రూప్లోను బ్రిటిష్ పాలకులు పట్టుకుని 1858 ఆగస్టు 22లో ఉరితీశారు. ఎగువసభకు 52 మంది సెనేటర్ల ఎన్నికల్లో ప్రాంతీయ, ఫెడరల్ శాసనకర్తలు తమ ఓటు వేశారని పాకిస్థాన్ ఎన్నికల సంఘం తెలిపింది. ఈ నెల 52 మంది సెనేటర్ల పదవీకాలం ముగిసిపోతుండటంతో వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకునేందుకు పంజాబ్, సింధ్, ఖైబర్–పఖ్తుఖ్వా, బలూచిస్థాన్ స్థానాల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు. నామినేటెడ్ సభ్యులతో కలుపుకుని 130 మందికిపైగా అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీపడ్డారు.

ఇటలీలో ఎన్నికలు



రోమ్: దేశంలో మునుపెన్నడూ జరగనంత అనిశ్చితి స్థితిలో ఇటలీ ఓటింగ్ ఆదివారం మొదలైంది. ఇందులో మితవాద, ప్రజాకర్షక పార్టీలు తలపడుతున్నాయి. మితవాద, ఫాసిస్టు వ్యతిరేక కార్యకర్తల మధ్య ఘర్షణలు, ఆర్థిక దిగజారుడు తనం, వలసలు ప్రచారంలో దిగులును సృష్టించాయి. పార్టీలు గుప్పించిన ఎన్నికల వాగ్దానాలను ఇటలీవాసులు అపనమ్మకంగా చూస్తున్నారు. ఘర్షణపడుతున్న అనేక పార్టీలు ఎలాంటి ఫలితం ఉండనుందో అన్న అయోమయంలో ఉన్నాయి.' పరిస్థితులు చాలా దుర్భరంగా తయారయ్యాయి. ఇక మార్పు జరగాల్సి ఉంది. మధ్యతరగతి వర్గం లేదు. పేదలు మరింత పేదలవుతున్నారు. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. సామాజిక న్యాయం అన్నదే లేదు' అని మిలాన్‌లోని మార్కెట్ దుకాణదారుడు ఎంజో గల్లో చెప్పాడు. ప్రజాకర్షక ఫైవ్‌స్టార్ మూవ్‌మెంట్, మూడుసార్లు ప్రధానిగా కొనసాగిన సిల్వియో బెర్లుస్కోని మితవాద కూటమి, అధికారంలో ఉన్న సెంటర్ లెఫ్ట్ డెమోక్రటిక్ పార్టీ మధ్య ఎన్నికల ఫలితాల ప్రతిష్టంభన ఏర్పడనుంది. తాజా కడపటి ఒపినియన్ పోలింగ్స్(ఎన్నికల నాడి) ప్రకారం బెర్లుస్కోని కూటమికి 37 శాతం,ఫైవ్‌స్టార్ మూవ్‌మెంట్‌కు 28 శాతం, సెంటర్‌లెఫ్ట్ డెమోక్రటిక్ పార్టీకి 27 శాతం ఓట్లు రానున్నాయని తెలిసింది. అయితే కొత్త ఎన్నికల చట్టం ప్రకారం జరుగుతున్న మొదటి ఎన్నికల్లో ఏ గ్రూపు అయినా పార్లమెంటు ఉభయసభల్లో మొత్తంగా 40 శాతం ఆధిక్యతను చాటాల్సి ఉంటుంది. 'ఈ ఎన్నికలు లాటరీలా ఉన్నాయి. ఇలాంటివి ఇంతకు మునుపెన్నడూ జరగలేదు' అని రోమ్‌కు చెందిన లూయిస్ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి రాబర్టో డి అలిమోంటే చెప్పారు. ఎన్నికలు గ్రీన్‌విచ్ మీన్ టైమ్ కాలమానం ప్రకారం ఉదయం 6.00 గంటలకు మొదలయి రాత్రి 10.00 గంటలకు ముగియనున్నాయి. ఫలితాలను సోమవారం ఉదయాన్నే ప్రకటించనున్నారని భావిస్తున్నారు.

రక్షణ బడ్జెట్ ప్రకటించని చైనా

సాంప్రదాయానికి భిన్నమైన చర్య



బీజింగ్: చైనా వార్షిక పార్లమెంటు సమావేశానికి ముందు సాంప్రదాయికంగా ప్రకటించే రక్షణ బడ్జెట్‌ను ఈసారి ప్రకటించకుండా దాటేశారు. చైనా అభివృద్ధి ఏ ఇతర దేశానికి ముప్పు కాబోదని ఈ సందర్భంగా ఓ ఉన్నతాధికారి చెప్పారు. ప్రతి ఏడాది నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పిసి) ప్రతినిధి దేశ రక్షణ బడ్జెట్‌ను శాతాల్లో ప్రకటించడం పరిపాటి. కానీ ఈ ఏడాది ఎన్‌పిసి ప్రతినిధి బాధ్యతలు చేపట్టిన మాజీ విదేశాంగ ఉపమంత్రి ఝాంగ్ ఎసూయి ఎంత శాతం రక్షణ బడ్జెట్ పెంచింది తెలుపలేదు. అయితే చైనా సైనిక వ్యయం ఎప్పటిలానే పెంచామని మాత్రం ఆయన వెల్లడించారు. చైనా గత ఏడాది రక్షణ బడ్జెట్‌ను 150.5 బిలియన్ డాలర్లకు పెంచింది. ఇది భారత రక్షణ బడ్జెట్ 52.5 బిలియన్ డాలర్ల కన్నా మూడు రెట్లు అధికం అన్నది గమనార్హం. దాదాపు 602.8 బిలియన్ డాలర్లు ఉండే అమెరికా రక్షణ బడ్జెట్ ప్రపంచంలోని అన్ని దేశాలకంటే అధికం. ఇదిలా ఉండగా సోమవారం ఎన్‌పిసికి ప్రధాని లీ కెఖ్వియంగ్ సమర్పించే వర్క్ రిపోర్టులో ఈ ఏడాది చైనా రక్షణ వ్యయం సమాచారం ఉంటుందా, లేదా అన్నది స్పష్టంగా తెలియలేదు. ఇతర దేశాల కన్నా చైనా సైన్యానికి వినియోగించేన తలసరి ఆదాయం తక్కువ అని ఝాంగ్ ఎసూయి చెప్పారు. చైనా ఎన్నో కోట్ల డాలర్ల వ్యయంతో నిర్మిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్(బిఆర్‌ఐ) చైనా భౌగోళిక వ్యూహ సాధనం అన్న వాదనను ఆయన ఖండించారు. బిఆర్‌ఐపై ఏర్పడ్డవని అపోహలేనన్నారు. ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్లే చైనా–పాకిస్థాన్ నడవను భారత్ వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. 12వ చైనా ప్రజల రాజకీయ సంప్రదింపుల సమావేశం(సిపిపిసిసి) చైర్మన్ యు ఝెంగ్ షెంగ్ ప్రధాన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను చర్చించేందుకుగాను 2,149 రాజకీయ సలహాదారులకు వర్క్ రిపోర్టును సమర్పించారు. ఆధునిక సామ్యవాద చైనా నిర్మాణంపై తాము దృష్టిపెట్టనున్నామని యు ఝెంగ్‌పెంగ్ తెలిపారు.

సాగు.. కొలువు.. పేదల బాగు

• కాంగ్రెస్ ప్లీనరీలో ప్రత్యేక తీర్మానం • 16 నుంచి సభలు



న్యూఢిల్లీ : దేశంలో బిజెపికి గట్టి సవాలు విసరాలని కాంగ్రెస్ సంకల్పించింది. వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి, పేదరిక నిర్మూలన అంశాలపై విస్తృతంగా దృష్టి సారించి, ప్రజల వద్దకు వెళ్లాలని నిర్ణయించింది. దేశంలో కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలనే ప్రధానంగా తీసుకోవడం ద్వారా నిజమైన ప్రత్యామ్నాయంగా నిలవాలని సంకల్పించారు. దేశ రాజధానిలో ఈ నెల 16 నుంచి 18 వరకూ సుదీర్ఘ చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ జరగనుంది. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార దిశలో తీసుకునే చర్యలపై ప్రత్యేక తీర్మానాలను వెలువరించనున్నారు. వ్యవసాయం, ఉద్యోగాలు, పేదరిక నిర్మూలన వంటి అంశాలపై ఈ ప్రత్యేక తీర్మానంలో పొందుపరుస్తారని వెల్లడైంది. ఈ అంశాలపై ఇప్పటికే పార్టీలో తొమ్మండుగురు సభ్యులతో ఉపసంఘం ఏర్పాటు చేశారు. దీనికి హర్యానా మాజీ సిఎం భూపీందర్ సింగ్ హూడా నాయకత్వం వహిస్తున్నారు. పార్టీ నేత మీనాక్షీ నటరాజన్ కన్వీనర్‌గా ఉన్నారు. దేశంలో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రతరం అయింది. ఈ దశలో దీనిపై ప్రత్యేక తీర్మానం అత్యవసరం , దీనికి అనుగుణంగానే పార్టీ భవిష్యత్తు కార్యక్రమాలు ఉంటాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. అయితే వ్యవసాయం ఇతర కీలక అంశాలపై తీర్మానాల ఆమోదం ఇంతకు ముందు కూడా జరిగిందని ఇది కొత్త కాదని వివరించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం ఈ కీలక సమస్యలపై దృష్టి సారిస్తూ వచ్చిందని, ఇప్పుడు పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆ నేత చెప్పారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని , పెద్ద నోట్ల రద్దు, తరువాత జిఎస్‌టితో పరిస్థితి దిగజారిందని, ఈ అన్ని అంశాలను తీసుకుని ప్రజల వద్దకు వెళ్లుతామని మరో నాయకుడు తెలిపారు. యువతకు ఉన్న సమస్య ఉద్యోగ కల్పన అని దీనిపై పార్టీ ఇప్పటికే దృష్టి సారించిందని తెలిపారు.

ప్రత్యేక హోదా కోరుతూ వామపక్షాల భిక్షాటన

అనంతపురం: ప్రత్యేక హోదాతో పాటు, విభజన చట్టంలోని అంశాలను కేంద్రం నెరవేర్చడం లేదంటూ అనంతపురంలో వామపక్షాలు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశాయి. సీపీఎం, సీపీఐ సహా వామపక్ష పార్టీలు టవర్ క్లాక్ వద్ద నుంచి భిక్షాటన చేపట్టాయి. కేంద్రం ఏపీకి మొండిచేయి చూపిందంటూ నినాదాలు చేస్తూ నాయకులు భిక్షాటన చేశారు. ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ సాయం చేయాలంటూ నాయకులు ప్రధాన వీధులు మీదుగా తిరిగారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం చేస్తున్న మోసాలు ఎన్నో రోజులు సాగవన్నారు. దీనిపై రానున్న రోజుల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పెనుగంచిప్రోలులో భారీ అగ్నిప్రమాదం

కృష్ణాజిల్లా: పెనుగంచిప్రోలులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తిరుపతమ్మ తిరునాళ్లలో భాగంగా మునేరు నదిలో పెద్ద సంఖ్యలో పురిపాకలు ఏర్పాటు చేసుకున్నారు. పొంగళ్లు తయారు చేసుకునే క్రమంలో గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో ఆ మంటలు ఇతర పాకలను అంటుకోవడంతో అన్ని పాకలు నిముషాల వ్యవధిలోనే తగలబడిపోయాయి. అయితే ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.ఆదివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రదేశానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేంద్రం నుంచి ఎపికి రూ.74,542 కోట్లు రావాలి : జెపి

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రమే సాయం చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ డిమాండ్ చేశారు. జెఎఫ్‌సి తుది నివేదిక వెల్లడించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కేంద్రంనుంచిఎపికి రూ.74,542 కోట్లు రావాలన్నారు. ఆర్థిక సం ఘం నివేదిక ప్రకారం ఐదేళ్లకు 22 వేల కోట్లు ఎపికి కేంద్రం ఖారారు చేశారని చేసిందని చెప్పారు. అంతకు మించి ఢిల్లీ నుంచి ఎపికి ఏమీ రావడం లేదన్నారు. ప్రతి సంవత్సరం లోటు బడ్జెట్‌ను కేంద్రం పూరించడం లేదన్నారు. వెనకబడిన ఏడు జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.

పిసిబి పాలక మండలికి ఎదురుచూపులు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ పాలక మండలి పదవీకాలం ముగిసినా కొత్త కూర్పుపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కీలక నిర్ణయాలను తీసుకోవడంలో పాలక మండలి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని మండలిలోని సీనియర్ శాస్త్రవేత్తలు వాపోతున్నారు. పాలకమండలి నిర్ణయాల కోసం దాదాపు ఏడాది కాలం ఎదురు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత అవసరాల రీత్యా పిసిబికి పాలకమండలిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని అధికారులు లేఖ కూడా రాశారు.



పారిశ్రామిక రంగంలో శరవేగంగా అభివృద్ధి

పారిశ్రామిక రంగంలో తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతూ, ఐటి ఎగుమతుల్లో దూసుకుపోతూ, కొత్తగా దాదాపు 40 వేల పరిశ్రమలు ఏర్పడి ప్రత్యక్షంగా, పరోక్షంగా కోట్లాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తూ ఉన్న పరిస్థితుల్లో కాలుష్య నియంత్రణ మండలి కీలక పాత్రను పోషించాల్సి ఉందని, ఫార్మాసిటి, నిమ్జ్, అంకుర వంటి పరిశ్రమల ఏర్పాటుతో ఇది తక్షణావసరంగా ముందుకొచ్చిందని శాస్త్రవేత్తలు ఉదహరించారు. పరిశ్రమల ఏర్పాటుతో ఏర్పడే పలు రకాల కాలుష్య నివారణ కోసం మండలి పలు చర్యలు తీసుకోవాల్సి ఉందని, ఇందుకు పాలక మండలి నిర్ణయాలు అవసరమని అధికారులు వివరిస్తున్నారు. పాలకమండలి లేకపోవడంతో ఎలాంటి చర్యలూ తీసుకునే పరిస్థితి లేదని అధికారులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

ఒకేసారి నియామకం

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ ఛైర్మన్‌గా పిసిబికి పాలక మండలిని ఏర్పాటు చేసింది. 2014 జులై 7న ప్రభుత్వం జారీ చేసిన ఉత్వర్వుల ప్రకారం మూడేళ్ల కాల పరిమితితో గడువు 2017 జులై 6న ముగిసింది. ఆ తర్వాత కాలుష్య మండలి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం పాలక మండలి గడువును మరో ఆరు నెలల పాటు పొడిగించింది. పొడిగించిన గడువు సైతం ఈ ఏడాది జనవరి 6తో ముగిసింది. సాధారణంగా పిసిబి పాలక మండలి మూడు నెలలకోసారి సమావేశం కావాల్సి ఉన్నా మూడున్నరేళ్ల కాల వ్యవధిలో కేవలం నాలుగు సమావేశాలను మాత్రమే నిర్వహించింది. అత్యవసర సమావేశాల కారణంగా ఐదవ సమావేశాన్ని వాయిదా పడింది. పాలక మండలిలో పలు కీలక నిర్ణయాల అమోదం లేకపోవడంతో కాలుష్య నియంత్రణకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు వెలువడడం లేదు. ప్రధానంగా పరిశ్రమల నుంచి వెలువడే శబ్ధ, వాయు, జల కాలుష్య నివారణపై తనిఖీలు నిర్వహించలేకపోతున్నారు అధికారులు.

21 రోజులపాటు సాగనున్న 'పలకరింపు'

అమరావతి: గుంటూరు జిల్లా ఉండవల్లిలోని గ్రీవెన్స్ సెల్ హాలులో రాష్ట్ర, జిల్లా, గ్రామీణస్థాయి ఆరోగ్య బులిటెన్, చిన్నారుల ఆరోగ్యం కోసం 'పలకరింపు' కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డు ఆవిష్కరించారు.రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, వైద్యశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్యతోపాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు,ఆశా, అంగన్‌వాడీ, మెప్మా కార్యకర్తలు పాల్గొన్నారు. మార్చి ఐదు నుంచి నెలాఖరు వరకు 21 రోజులపాటు 'పలకరింపు' కార్యక్రమం జిల్లా, గ్రామా ల్లో కొనసాగు తుందని సీఎం చెప్పారు.రాష్ట్రంలో కోటి 20లక్షల 86 వేల ఇళ్లను సందర్శించి 50లక్షల మంది చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోడానికి ప్రతినెల నాలుగో తేదీన రాష్ట్రంలో 'పలకరింపు' కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. అదే రోజు నెలవారీ ఆరోగ్య బులిటెన్‌ను విడుదల చేస్తామన్నారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు అందించడం, పోషక లోపాలున్న పిల్లలను గుర్తించి తగిన జాగ్రత్తలు, సూచనలు అందిస్తూ పౌష్టికాహారం పొందేలా అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు.తాను వైద్యుడిని కాకపోయినా ప్రజల సాదకబాధకాలు అనారోగ్య సమస్యలపై తనకు ఉన్న అవగాహనతోఈ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.



జోఫ్రా ఆర్చర్ ఐపిఎల్‌లో ఆడడం అనుమానమే!



న్యూఢిల్లీ: విండీస్ యువ సంచలనం, స్పీడ్‌స్టర్ జోఫ్రా ఆర్చర్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో బరిలోకి దిగడం అనుమానంగా మారింది. కడుపు నొప్పితో బాధపడుతున్న ఆర్చర్ ఇప్పటికే పాకిస్థాన్ సూపర్ లీగ్ నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితులో వచ్చే నెలలో ప్రారంభమయ్యే ఐపిఎల్‌లో జోఫ్రా బరిలోకి దిగడంపై అనుమానాలు నెలకొన్నాయి. ఇటీవల జరిగిన ఐపిఎల్ వేలం పాటలో జోఫ్రా కళ్లు చెదిరే ధర పలికిన విషయం తెలిసిందే. అతన్ని రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రూ.7.2 కోట్లను చెల్లించి సొంతం చేసుకుంది. అయితే అనారోగ్యం వల్ల జోఫ్రా ఐపిఎల్‌లో ఆడడం ప్రశ్నార్థకంగా మారింది. అతను బరిలోకి దిగక పోతే అది రాజస్థాన్‌కు పెద్ద లోటుగానే చెప్పాలి. టి–20 ఫార్మాట్‌లో జోఫ్రా అద్భుత బౌలర్‌గా పేరు తెచ్చుకున్నాడు. దీంతో అతన్ని దక్కించుకునేందుకు ఐపిఎల్ వేలం పాటలో చాలా ఫ్రాంచైజీలు తీవ్రంగా పోరాడాయి. చివరికి కళ్లు చెదిరే ధరతో రాజస్థాన్ జోఫ్రాను కొనుగోలు చేసింది. కాగా, ఆర్చర్ ఆడతాడా లేదా అనే దానిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత రాలేదు. అతను బరిలోకి దిగే అవకాశాలను కొట్టి పారేసేందుకు కూడా వీలు లేదు. అయితే తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న జోఫ్రాకు విశ్రాంతి అవసరమని వైద్యులు తెలిపారు.







శ్రీలంకకు బయలుదేరిన టీమిండియా

ముంబయి: ముక్కోణపు ట్వంటీ–20 సిరీస్‌లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు ఆదివారం శ్రీలంక బయలుదేరి వెళ్లింది. మూడు దేశాల టోర్నమెంట్‌లో భారత్ తలపడనుంది. ఈ టోర్నీలో భారత్‌తో పాటు ఆతిథ్య శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొంటున్నాయి. కాగా, ఈ సిరీస్‌లో పాల్గొనే టీమిండియాకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. శిఖర్ ధావన్ వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఇదిలావుండగా కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనిలతో పాటు కీలక బౌలర్లకు విశ్రాంతి ఇచ్చారు. దీంతో పలువురు సీనియర్లు లేకుండానే భారత్ టోర్నీలో తలపడనుంది. స్పీడ్‌స్టర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రా, హార్దిక్ పాండ్య, యువ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌లకు సిరీస్‌కు ఎంపిక చేయలేదు. వీరి బదులు పలువురు యువ ఆటగాళ్లకు ఛాన్స్ ఇచ్చారు. యువ ఆటగాడు రిషబ్ పంత్ టోర్నీకి ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాడు. విజయ్ శంకర్ కూడా జట్టులో చోటు సంపాదించాడు. వాషింగ్టన్ సుందర్, హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్‌లు కూడా టోర్నీకి ఎంపికయ్యారు. ఇదిలావుంగా ముక్కోణపు టోర్నమెంట్ మంగళవారం ప్రారంభం కానుంది. కాగా, టోర్నీ కోసం ముంబయి నుంచి టీమిండియా లంకకు బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా ఆటగాళ్ల ఫొటోలను బిసిసిఐ ట్వీటర్‌లో పోస్ట్ చేసింది.

ఫుట్‌బాల్ ఆటగాడు అస్టోరి ఆకస్మిక మృతి



రోమ్: ఇటలీకి చెందిన స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు డావైడ్ అస్టోరి ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ వార్తను అస్టోరి ప్రాతినిథ్యం వహించే ఫియోరెన్‌టినా సాకర్ క్లబ్ జట్టు ట్వీటర్‌లో ప్రకటించింది. 31 ఏళ్ల అస్టోరి ఇటలీ సాకర్ లీగ్‌లో ఫియోరెన్‌టినా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే అతను ఉడైన్ నగరంలోని ఓ హోటల్ గదిలో విగత జీవిగా పడివున్నాడు. ఈ విషయాన్ని గమనించిన హోటల్ సిబ్బంది అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తీవ్ర అస్వస్థతకు గురైన అస్టోరి హఠాత్తుగా మరణించినట్టు క్లబ్ అధికారులు తెలిపారు. కాగా, అస్టోరి మృతిపై సాకర్ ప్రపంచం తీవ్ర షాక్ గురైంది. ఇటలీ ఫుట్‌బాల్ జట్టుకు 12 మ్యాచుల్లో అస్టోరి ప్రాతినిథ్యం వహించాడు. మంచి డిఫెండర్‌గా అతనికి పేరుంది. ఇక, తన క్లబ్ ఫియోరెన్‌టిన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ జట్టును విజయ పథంలో నడిపిస్తున్నాడు. 2015లో అతను జట్టులో చేరాడు. అప్పటి నుంచి జట్టుకు పెద్ద స్టార్‌గా మారాడు. అతని సారథ్యంలో క్లబ్ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందుకుంది. కాగా, అస్టోరి మృతికి సంతాపంగా ఆదివారం జరగాల్సి ఇటలీ సాకర్ లీగ్ మ్యాచ్‌లను రద్దు చేశారు. ఇదిలావుండగా అస్టోరి మృతిపై ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన ఫుట్‌బాల్ ఆటగాళ్లు సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులో అస్టోరి మృతి చెందడం బాధకు గురిచేసిందని వారు ట్వీటర్ వేదికగా పేర్కొన్నారు.

జిమ్నాస్ట్ అరుణకు సిఎం చేయూత

- **రూ.2 కోట్ల నజరానా, కోచ్‌కు రూ. 50 లక్షలు**

మన తెలంగాణ / రాజేంద్రనగర్ : ఒలింపిక్‌లో పథకమే లక్ష్యంగా జిమ్నాస్టిక్‌లో మరింత తర్ఫీదు తీసుకోవాలని ప్రపంచ జిమ్నాస్టిక్‌లో చరిత్ర సృష్టించిన బుద్దా అరుణారెడ్డికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు సూచించారు. అందుకు ఆస్ట్రేలియాలో పొందే శిక్షణ తదితరాలకు అవసరమయ్యే ఖర్చు రెండు కోట్లను ప్రభుత్వం తరపున అందజేయడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు. ఆదివారం ప్రగతి భవన్‌లో జిమ్నాస్టిక్ కాంస్య పథక విజేత అరణను ఆయన ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా క్రీడల మంత్రి పద్మరావు గౌడ్, శాప్ చైర్మన్ వెంకటేశ్వరరావు సమక్షంలో బుద్దా అరుణా రెడ్డిని ఏం కావాలని కోరిన ముఖ్యమంత్రి కేసీఆర్ పై విధంగా స్పందించడం హర్షనీయం. జిమ్నాస్టిక్‌లో ఏం చేస్తావో తెలియదు తెలంగాణకు ఒలింపిక్‌లో పథకం తీసురావాలని ఆమెను కోరారు. అందుకోసం ఆస్ట్రేలియాలో తీసుకోవాల్సిన శిక్షణ వివరాలను కోచ్ బ్రిజ్‌కిషోర్, శాప్ చైర్మన్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు అరుణ పై ప్రకటించారు. ఈ విషయాన్ని అరుణ, ఆమె కుటుంబ సభ్యులు, కోచ్‌తో పాటు, ఆమెను జిమ్నాస్టిక్ వైపు అడుగులు వేయించిన కరాటే మాస్టార్ బాలసుబ్రమణ్యం 'మన తెలంగాణ'కు వెల్లడించారు. ఏది ఏమైనా ప్రపంచ జిమ్నాస్టిక్‌లో కాంస్య పథకం సాధించిన అరుణ ఎదురైన, నేర్చుకున్న అనుభవాలు ఒలిపిక్‌లో ప్రభుత్వ సహకారంతో తర్ఫీదు పొందితే పథకం తీసుకురావడం ఖాయమనే చెప్పాలి. కాగా అరుణ కోచ్ బ్రిజ్ కిషోర్ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న ముఖ్యమంత్రి రూ. 50 లక్షల బహూతి నజరాన ఇస్తానని తెలిపినట్లు తెలిసింది.



డ్రాతో సరిపెట్టుకున్న భారత్





- **సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ**

ఇఫో (మలేసియా): తొలి మ్యాచ్‌లో పటిష్టమైన అర్జెంటీనాకు గట్టి పోటీ ఇచ్చిన భారత్ ఆదివారం ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో డ్రాతో గట్టెక్కింది. గెలిచేందుకు వచ్చిన ఎన్నో అవకాశాలను చేజార్చుకున్న భారత్ చివరికి డ్రాతో సంతృప్తి పడింది. ఇంగ్లాండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌ను భారత్ 1–1 గోల్స్‌తో డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచింది. గోల్స్ చేసేందుకు లభించిన అవకాశాలను చేజేతులా చేజార్చుకుంది. అటాకింగ్ గేమ్‌తో అదర గొట్టిన భారత్ ఏకంగా 9 పెనాల్టీ కార్నర్‌లను నమోదు చేసింది. అయితే ఒక్కదాన్ని కూడా గోల్‌గా మలచడంలో సఫలం కాలేదు. ఆట 14వ నిమిషంలో శీలానంద్ లర్కా భారత్ తరపున ఏకైక గోల్ చేశాడు. యువ ఆటగాడు శీలానంద్ అద్భుత ప్రదర్శనతో ఈ గోల్‌ను సాధించాడు. కాగా, అతని కెరీర్‌లో ఇదే మొదటి గోల్ కావడం విశేషం. మరోవైపు తర్వాత కూడా భారత్ దూకుడుగా ఆడింది. ఇంగ్లాండ్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ ముందుకు సాగింది. ఇదే సమయంలో ఇంగ్లాండ్ కూడా స్కోరును సమం చేసేందుకు తీవ్రంగా పోరాడింది. కానీ, ప్రథమార్ధంలో భారత్ కీలకమైన 1–0 ఆధిక్యంలో నిలిచింది. సెకండ్ హాఫ్‌లో కూడా భారత్‌కు గోల్ చేసే అవకాశాలు లభించినా ఫలితం లేకుండా పోయింది. పేలవమైన ఆటతో గోల్స్ చేసే అవకాశాలను కాలరాసింది. మరోవైపు 53వ నిమిషంలో ఇంగ్లాండ్ తన తొలి గోల్‌ను సాధించింది. మార్క్ గ్లెగ్‌హార్న్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి స్కోరును 1–1తో సమం చేశాడు. తర్వాత ఇరు జట్లు కూడా మరో గోల్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియక తప్పలేదు. సీనియర్లు లేకుండా బరిలోకి దిగిన భారత్ ఈ టోర్నమెంట్‌లో ఆశించిన విధంగా ఆడడం లేదనే చెప్పాలి. గోల్స్ చేసేందుకు లభించిన సువర్ణ అవకాశాలను చేజార్చుకొని ఇంగ్లాండ్ కోలుకునేలా చేసింది. కాగా, భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఆస్ట్రేలియాతో తలపడుతుంది. మంగళవారం ఈ మ్యాచ్ జరుగుతుంది.



దినేష్‌కు పగ్గాలు

కోల్‌కతా: ఐపిఎల్‌లో తలపడే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు భారత స్టార్ ఆటగాడు దినేష్ కార్తీక్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సీజన్‌లో కార్తీక్‌ను కెప్టెన్‌గా నియమిస్తూ నైట్‌రైడర్స్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ ప్రతినిధి వెంకీ మైసూర్ అధికారికంగా ప్రకటించారు. దీంతో నైట్‌రైడర్స్ జట్టు ఎవరిని కెప్టెన్‌గా నియమిస్తుందనే ఉత్కంఠతకు తెరపడింది.

అఫ్గాన్‌కు స్కాట్లాండ్ షాక్

బులవాయో: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఆసియా సంచలనం అఫ్గానిస్థాన్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. ప్రపంచ క్రికెట్‌లో సంచలన జట్టుగా పేరు తెచ్చుకున్న అఫ్గాన్ ఆదివారం స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి పాలైంది. స్కాట్లాండ్ ఏడు వికెట్ల తేడాతో అఫ్గాన్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 255 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 47.2 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. కీలక ఇన్నింగ్స్ ఆడిన కాలమ్ మెక్‌లీడ్ అజేయ శతకంతో స్కాట్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. చెలరేగి ఆడిన మెక్‌లీడ్ 146 బంతుల్లోనే 23 ఫోర్లు, ఒక సిక్స్‌తో అజేయంగా 157 పరుగులు చేశాడు. అతనికి రిచి బెర్నింగ్‌టన్ (67) సహకారం అందించాడు. ఇద్దరు కీలక భాగస్వామ్యంతో జట్టు విజయంలో ముఖ్య పాత్ర పోషించారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్‌ను మహ్మద్ నబి ఆదుకున్నాడు. అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన నబి ఏడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 92 పరుగులు చేశాడు. నజీబుల్లా జర్దాన్ (67) తనవంతు పాత్ర పోషించాడు. కాగా, హరారేలో జరిగిన మరో మ్యాచ్‌లో యూఎఇ విజయం సాధించింది.

మళ్లీ రాకాసి బౌన్సర్ వేసిన అబాట్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ సీన్ అబాట్ మరోసారి బౌన్సర్ వివాదంలో చిక్కుకున్నాడు. ఆస్ట్రేలియా దేశవాళి క్రికెట్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఓ మ్యాచ్‌లో అబాట్ విసిరిస ఓ బౌన్సర్ తగిలి విక్టోరియా బ్యాట్స్‌మన్ విల్ పుకోవ్‌స్కీ గిలగిల కొట్టుకున్నాడు. అయితే అతను కోలుకోవడంతో అబాట్‌తో సహా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే షెఫీల్డ్ టోర్నీలో భాగంగా ఆదివారం న్యూ సౌత్ వెల్స్–విక్టోరియా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా న్యూసౌత్ వెల్స్ బౌలర్ అబాట్ వేసిన ఓ షార్ట్ పిచ్ బంతి అనూహ్యంగా వచ్చి బ్యాట్స్‌మన్ పుకోవ్‌స్కీ హెల్మెట్‌లో చిక్కుకుంది. ఈ దెబ్బకు పుకోవ్‌స్కీ గిలిగిల కొట్టుకుంటూ మైదానంలో కుప్పకూలి పోయాడు. ఆ వెంటనే వైద్య సిబ్బంది వచ్చి అతనికి చికిత్స కేంద్రానికి తరలించారు. చాలా సేపటి తర్వాత పుకోవ్‌స్కీ స్పృహాలోకి వచ్చాడు. దీంతో అబాట్‌తో పాటు అందరు ఊపిరి పీల్చుకున్నారు ఇదిలావుండగా 2014 సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో అబాట్ వేసిన బౌన్సర్ తగిలి ఆస్ట్రేలియా యువ ఆటగాడు ఫిలిప్ హ్యూజ్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, ఈ బంతిని వేసిన అబాట్ అప్పట్లో ఎంతో మనో వేదనను అనుభవించాడు. చాలా కాలం పాటు అతన్ని ఈ సంఘటన వెంటాడింది. తాజాగా అబాట్ వేసిన బౌన్సర్ మరో ఆటగాడు గాయపడడంతో అందరిలోనే ఆందోళన నెలకొంది. కాగా, పుకోవ్‌స్కీకు చికిత్స జరుగుతున్నంత సేపు అబాట్ ఎంతో భావోద్వేగానికి లోనయినట్టు కనిపించింది. పుకోవ్‌స్కీ కోలుకునేంత వరకు అతను మళ్లీ బౌలింగ్‌కు దిగలేదు.





గెలుపు వాకిట ఆస్ట్రేలియా

- **దక్షిణాఫ్రికాతో మొదటి టెస్టు**

డర్బన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా గెలుపు వాకిట నిలిచింది. 417 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఆతిథ్య సౌతాఫ్రికా జట్టు ఆదివారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసి పరాజయం అంచున నిలిచింది. ఆస్ట్రేలియాకు విజయం కోసం ఒక వికెట్ మాత్రమే అవసరం కాగా, సఫారీలు గెలవాలంటే మరో 124 పరుగులు చేయాలి. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సౌతాఫ్రికాను ఆస్ట్రేలియా బౌలర్లు హడలెత్తించారు. ప్రారంభంలోనే వరుసగా వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఓపెనర్ డీన్ ఎల్గర్ (9), వన్‌డౌన్‌లో వచ్చిన హాషిం ఆమ్లా (8), స్టార్ ఆటగాడు ఎబి.డివిలియర్స్ (0), కెప్టెన్ డుప్లెసిస్ (4) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. దీంతో దక్షిణాఫ్రికా 49 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను ఓపెనర్ మార్‌క్రామ్ తనపై వేసుకున్నాడు. డిబ్రూయిన్‌తో కలిసి స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన బ్రూయిన్ ఆరు ఫోర్లతో 36 పరుగులు చేశాడు. మరోవైపు తర్వాత వచ్చిన వికెట్ కీపర్ డికాక్‌తో కలిసి మార్‌క్రామ్ మరో కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇద్దరు కలిసి ఆరో వికెట్‌కు 147 పరుగులు జోడించారు. చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన మార్‌క్రామ్ 19 ఫోర్లతో 143 పరుగులు చేశాడు. కాగా, డికాక్ 11 బౌండరీలతో అజేయంగా 81 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. అయితే మిగతావారు విఫలం కావడంతో సౌతాఫ్రికా ఓటమి అంచుకు చేరుకుంది. ఇదిలావుండగా ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ నాలుగు, హాజిల్‌వుడ్ రెండు వికెట్లు పడగొట్టారు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.